జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
మనసర్కార్ దినపత్రిక, డిజిటల్ ఛానల్, న్యూస్ పోర్టల్ కు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ లోని ఉమ్మడి జిల్లాల వారీగా గతంలో ప్రింట్ లేదా ఎలక్ట్రానిక్ మీడియాలో జిల్లా స్థాయిలో పని చేసిన అనుభవం ఉన్న రిపోర్టర్లు కావలెను.
మీ బయోడేటాను ఈ క్రింది మెయిల్ కు పంపగలరు
మనసర్కార్ PRGI REG. No. : TGTEL/25/A0540
Plot No. 72, Kamalapuri Colony, Phase III, Road No.2, Banjarahills, Hyderabad, Telangana - 500 073
email: jobs@manasarkar.com

సంక్షేమ
# మనసర్కార్
Follow: manasarkar

సంపుటి: 01 ::: సంచిక:246 | హైదరాబాద్ 08 ఏప్రిల్ 2026, బుధవారం | పేజీలు: 8, వెల: రూ. 5/-
Vol-01 ::: Issue-246 | Hyderabad 08 April 2026, Wednesday | Pages: 8, Rs. 5/-

MAKK FINSOL
ఇన్సూరెన్స్ అడ్వైజర్స్ కావలెను
ప్రముఖ ఇన్సూరెన్స్ మార్కెటింగ్ కంపెనీకి లైఫ్, హెల్త్, జనరల్ ఇన్సూరెన్స్ మార్కెటింగ్ చేయుటకు అనుభవం ఉన్న అడ్వైజర్లు / ఏజెంట్లు కావలెను. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును.
వివరాలకు : 91333 73937, makkfinsol@gmail.com



## మీ దేశాన్ని ఈ రోజే... అంతం చేస్తా

మంగళవారమే ఆఖరి రాత్రి | ట్రంప్ 'మిడ్ నైట్' హెచ్చరిక | ఖర్గ్ ఐలాండ్ టార్గెట్ గా ప్రణాళిక

ఇరాన్ నాగరికతకు అంతిమ గడియలు మొదలయ్యాయంటూ డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేయడంతో ప్రపంచం ఉలిక్కిపడింది. ఖర్గ్ ఐలాండ్‌లోని కీలక చమురు మరియు రక్షణ కేంద్రాలపై అమెరికా బలగాలు ఇప్పటికే విరుచుకుపడగా, హర్మూజ్ జలసంధిని తెరవని పక్షంలో ఆ దేశాన్ని నామరూపాల్లేకుండా చేస్తామంటూ వైట్ హౌస్ ఇచ్చిన అల్టిమేటం ఇప్పుడు పశ్చిమ ఆసియాను నిప్పుల కొలిమిగా మార్చింది.


...::: పూర్తి కథనం 3వ పేజీలో...

## ఏ పోరాటానికైనా... మేము సిద్ధం

నేను సైతం ప్రాణ త్యాగానికి సిద్ధం | 14 మిలియన్ల మందితో 'మృత్యు పాశం' | హర్మూజ్ పై తగ్గేదేలేదు

అమెరికా హెచ్చరికలను బేఖాతరు చేస్తూ, దేశ సార్వభౌమాధికారం కోసం ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ సంచలన పోరాట పిలుపునిచ్చారు. శత్రువుల దాడుల నుండి కీలక వనరులను కాపాడుకోవడానికి లక్షలాది మంది పౌరులు 'మానవ గొలుసులు'గా మారబోతున్నారని ప్రకటిస్తూ, అగ్రరాజ్యానికి ఆత్మబలిదానాల హెచ్చరికలు పంపారు. దీంతో పశ్చిమ ఆసియాలో యుద్ధ మేఘాలు మరింత దట్టమయ్యాయి.

...::: పూర్తి కథనం 3వ పేజీలో...



## చొరబాటుదారులకు భారత్ లో చోటు లేదు



**బరాక్ వ్యాలీ (ఏడీఎన్ఎన్):**

చొరబాటుదారులకు భారత్ లో చోటు లేదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా హెచ్చరించారు. అస్సాంలోని బరాక్ వ్యాలీలో మంగళవారం నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ఆయన ప్రసంగించారు. దేశ భద్రత, పౌరసత్వ సవరణ చట్టం అమలుపై ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్ ఏమీ ధర్మసత్రం కాదని, అక్రమంగా దేశంలోకి చొరబడే వారికి ఇక్కడ స్థానం లేదని ఆయన స్పష్టం చేశారు.

...::: తరువాయి 2వ పేజీలో...

## బెంగాల్‌పై కన్నేస్తే... ముక్కలు ముక్కలే!




**న్యూఢిల్లీ (ఏడీఎన్ఎన్):**

పాకిస్తాన్ కవ్వింపు చర్యలపై భారత రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పశ్చిమ బెంగాల్‌ను లక్ష్యంగా చేసుకుంటామన్న పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ వ్యాఖ్యలను ఆయన తిప్పికొట్టారు. 'ఒకవేళ భారత్‌పై కన్నెత్తి చూస్తే.. ఈసారి పాకిస్తాన్ ఎన్ని ముక్కలవుతుందో ఊహించడం కూడా కష్టమే'అని ఘాటుగా హెచ్చరించారు. గత చరిత్రను గుర్తు చేస్తూ రాజ్‌నాథ్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. 55 ఏళ్ల క్రితం పాకిస్తాన్ ఇలాంటి రెచ్చగొట్టే ధోరణిని అవలంభించడం వల్లే ఆ దేశం రెండుగా విడిపోయిందని గుర్తు చేశారు. 1971 యుద్ధంలో భారత సైన్యం అండతో బంగ్లాదేశ్ స్వతంత్ర దేశంగా అవతరించిందన్నారు. భవిష్యత్తులో భారత్ ఏదైనా దాడికి దిగితే తాము కోల్‌కతాను లక్ష్యంగా చేసుకుంటామని ఖవాజా ఆసిఫ్ ఇటీవల వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలు ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలకు దారితీశాయి. అనవసరమైన ప్రకటనలతో ఉద్రిక్తతలను పెంచవద్దని ఇస్లామాబాద్ పాలకులకు రాజ్ నాథ్ హితవు పలికారు. పాకిస్తాన్ తన పరిమితులను తెలుసుకుని మెలగాలన్నారు. బెంగాల్ వంటి సున్నితమైన ప్రాంతాల గురించి మాట్లాడేటప్పుడు ఒళ్లు దగ్గర పెట్టుకోవాలని, లేనిపక్షంలో 1971 కంటే ఘోరమైన పరాభవం ఎదుర్కోవాల్సి ఉంటుందని రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు.

## మైకులు బంద్!

మూడు రాష్ట్రాల్లో ముగిసిన ప్రచార పర్వం



...::: పూర్తి కథనం 2వ పేజీలో...




## హెడ్ కానిస్టేబుల్ రేవతి పోలీసుశాఖకే ఖ్యాతి!

- లాఠీకి నిజాయితీ పాఠాలు నేర్పింది
- చట్టానికి ప్రత్యక్ష 'సాక్ష్య'మై నిలిచింది
- ధర్మానికి 'హెడ్'..కానిస్టేబుల్ ఆమె..
- దేశ వ్యాప్తంగా రేవతిపై ప్రశంసల జల్లు
- ఇలాంటి పోలీస్.. స్టేషన్ కు ఒక్కరుంటే చాలు
- 'మన సర్కార్' స్పెషల్ 'పోలీస్ స్టోరీ..'

కంటి చూపుతోనే కాదు.. ఒంటిపై 'ఖాకీ'ఉందనే తలపొగరుతో మిడిసిపడే లాఠీ క్రౌర్యానికి కొన్ని దశాబ్దాల తర్వాత.. 'చట్టం'ఎవరికీ చుట్టం కాదని హెచ్చరిస్తూ.. మదురై కోర్టు చారిత్రాత్మక తీర్పు చెప్పింది. సమాజ హితం కోసం.. చట్టం తన పని తాను చేసుకుపోతుందని చెర్నాకోలా చేతపట్టి.. నిరూపించింది. అమాయకులను వేధించే 'అధికార'మదాంధుల పాలిట ఈ తీర్పు ఓ 'మరణ'శాసనం. ఓ సంచలనం. ఈ కేసు కీలక మలుపు తిరగడానికి కారణమైన .. 'ఖాకీ'వనంలో ప్రాణం పోసుకున్న ఓ 'తులసి మొక్క'గురించి ఆధునిక సమాజానికి పరిచయం చేయాలి. నిజాల ఖజానాలో నిత్య సత్య ప్రకాశమై విరాజిల్లే ఓ 'అభినవ రేవతి' కథను ఖచ్చితంగా చెప్పుకోవాలి. ఇంతటి సమున్నత తీర్పు వెనుక.. ఓ సగటు మహిళా హెడ్ కానిస్టేబుల్ ప్రదర్శించిన ధైర్యం ఉంది. 'నాలుగో'సింహాన్ని మరోసారి తలెత్తుకుని సగర్వంగా నిలబెట్టిన 'నిజాయితీ'ఉంది. అమాయకుల ప్రాణాలకూ 'విలువ'ఉందని చాటిన నేటి తరం 'సత్యవాక్కు'ఉంది.. ధైర్యం విసిరిన రాకెట్.. ఏ ప్రలోభాలకూ లొంగని భారతీయ న్యాయ సంహిత పక్షాన నిలిచిన అసలు సిసలైన లాఠీ.. 'రేవతి' గురించి 'మన సర్కార్'అందిస్తున్న స్ఫూర్తిదాయక కథనమిది..


...::: పూర్తి కథనం 2వ పేజీలో...

## పెట్టుబడులకు ఎస్ఐపీబీ గ్రీన్ సిగ్నల్



ఆంధ్రప్రదేశ్‌ను పారిశ్రామికంగా అగ్రగామిగా నిలిపే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కీలక అడుగు వేశారు. మంగళవారం జరిగిన 16వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశంలో అమరావతి 'క్వాంటం వ్యాలీ' మొదలుకొని రాయలసీమ సోలార్ హబ్ వరకు మొత్తం 31 ప్రాజెక్టులకు ఆమోదం తెలిపారు. ఈ భారీ పెట్టుబడుల ద్వారా ఏకంగా 1.11 లక్షల మంది యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం సమరోత్సాహంతో ముందుకు సాగుతోంది.

...::: పూర్తి కథనం 2వ పేజీలో...



## నేడే కాళేశ్వరంపై హైకోర్టు తీర్పు

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో జరిగిన అవకతవకలపై విచారణ జరిపిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై బుధవారం రాష్ట్ర హైకోర్టు కీలక తీర్పును వెలువరించనుంది. ఈ నివేదికను సవాల్ చేస్తూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు, ఐఏఎస్ అధికారిణి స్మితా సబర్వాల్, మాజీ సీఎస్ ఎస్‌కే జోషి దాఖలు చేసిన పిటిషన్లపై ధర్మాసనం తన నిర్ణయాన్ని ప్రకటించనుంది. తమ వాదనలు వినకుండా ఏకపక్షంగా నివేదిక రూపొందించారని, కాబట్టి దానిని రద్దు చేయాలని పిటిషనర్లు కోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే.ఈ పిటిషన్లపై గత కొన్ని రోజులుగా హైకోర్టులో సుదీర్ఘ వాదనలు జరిగాయి. ప్రభుత్వం తరపు న్యాయవాదులు కమిషన్ నివేదికను సమర్థించగా, పిటిషనర్ల తరపు న్యాయవాదులు నివేదికలోని లోపాలను ఎత్తిచూపారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం ఇప్పటికే తీర్పును రిజర్వ్ చేసింది. రేపు వెలువడనున్న ఈ తీర్పు కాళేశ్వరం ప్రాజెక్టు భవితవ్యాన్ని మాత్రమే కాకుండా, దీనితో సంబంధం ఉన్న కీలక నేతల రాజకీయ భవిష్యత్తును కూడా ప్రభావితం చేసే అవకాశం ఉండటంతో రాజకీయ వర్గాల్లో నరాలు తెగే ఉత్కంఠ నెలకొంది.

## 'ఉగ్ర'కుట్ర భగ్నం

### భారీగా పేలుడు పదార్థాల స్వాధీనం



**నాగ్‌పూర్ (ఏడీఎన్ఎన్):**

మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో భారీ ఉగ్రవాద కుట్రను పోలీసులు ముందస్తుగా పసిగట్టి భగ్నం చేశారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ప్రధాన కార్యాలయానికి అత్యంత సమీపంలో భారీగా పేలుడు పదార్థాలు లభించడం దేశవ్యాప్తంగా తీవ్ర కలకలం సృష్టించింది. భద్రతా సంస్థల నుంచి అందిన ముందస్తు సమాచారంతో పోలీసులు అప్రమత్తమవడంతో పెను ప్రమాదం తప్పింది.పోలీసులు నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో ఆర్ఎస్ఎస్ హెడ్‌క్వార్టర్స్‌కు కూతవేటు దూరంలో ఒక అనుమానాస్పద డంప్‌ను గుర్తించారు. అందులో అత్యంత శక్తివంతమైన 15 జిలెటిన్ స్టిక్స్, 50 డిటోనేటర్లు, 8 కనెక్టర్లు బయటపడ్డాయి. వెంటనే రంగంలోకి దిగిన బాంబు డిటెక్షన్ అండ్ డిస్పోజల్ స్క్వాడ్ ఆ పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకుని, వాటిని సురక్షితంగా నిర్వీర్యం చేసే ప్రక్రియను చేపట్టింది. ఈ ఘటనతో నాగ్‌పూర్ పోలీసులు నగరంలో హై అలర్ట్ ప్రకటించారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఫోరెన్సిక్ నిపుణులు నమూనాలను సేకరించి దర్యాప్తు ప్రారంభించారు. పోలీసులు ఆ ప్రాంతంలోని సీసీ టీవీ ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఈ పేలుడు పదార్థాలను అక్కడ ఎవరు ఉంచారు? దీని వెనుక ఉన్న సూత్రధారులు ఎవరు? అనే కోణంలో విచారణ ముమ్మరం చేశారు.




## అణుశక్తి రంగంలో భారత్ చారిత్రక ఘనత

**తాడేపల్లి (ఏడీఎన్ఎన్):**

భారతదేశపు పౌర అణుశక్తి కార్యక్రమంలో చోటుచేసుకున్న అద్భుత విజయంపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. తమిళనాడులోని కల్పక్కంలో స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించిన 'ప్రోటోటైప్ ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్' విజయవంతంగా అణువిచ్ఛిత్తి ప్రక్రియను ప్రారంభించడంపై ఆయన శాస్త్రవేత్తలను కొనియాడారు. ఈ చారిత్రక ఘట్టాన్ని ఆవిష్కరించిన ఇందిరా గాంధీ సెంటర్ ఫర్ అటామిక్ రీసెర్చ్ , భారతీయ నాభికీయ విద్యుత్ నిగమ్ లిమిటెడ్ సంస్థల్లోని శాస్త్రవేత్తలు , ఇంజనీర్లకు జగన్ తన హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ఈ విజయం మన దేశ అణు ప్రస్థానంలో ఒక గొప్ప ముందడుగు అని ఆయన అభివర్ణించారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ ఎక్స్ వేదికగా మంగళవారం పోస్ట్ చేశారు. ఈ 500 మెగావాట్ల సామర్థ్యం కలిగిన రియాక్టర్ ద్వారా దేశంలోని అపారమైన థోరియం నిల్వలను ఇంధన స్వావలంబనకు వినియోగించుకోవడానికి వీలవుతుందని పేర్కొన్నారు. రాబోయే తరాలకు సురక్షితమైన , స్వచ్ఛమైన విద్యుత్ శక్తిని అందించడంలో ఈ సాంకేతికత కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. సోమవారం నాడు సాకారమైన ఈ అణు విజయం ప్రతి భారతీయుడికి గర్వకారణమని, ఇంధన రంగంలో స్వయం సమృద్ధి సాధించే దిశగా ఇది ఒక మైలురాయి అని ఎక్స్ వేదికగా వైఎస్ జగన్ కొనియాడారు.

## ఆరోగ్య రంగంలో... అత్యాధునిక వసతులు



...::: పూర్తి కథనం 2వ పేజీలో...

## భారత పౌరులకు కేంద్రం అలర్ట్



...::: పూర్తి కథనం 3వ పేజీలో...



## మోదీ అడుగుజాడల్లోనే కేరళ సీఎం

**తిరువనంతపురం (ఏడీఎన్ఎన్) :**

కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌పై తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి మరోసారి విమర్శల బాణాలు ఎక్కుపెట్టారు. తిరువనంతపురంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, విజయన్ పై ఘాటు వ్యాఖ్యలు చేశారు. పినరయి విజయన్ ఎప్పుడు సిద్ధమన్నా తాను చర్చకు సిద్ధమని సవాల్ విసిరిన రేవంత్ రెడ్డి, ఇటీవల తాను రాసిన లేఖపై కేరళ సీఎం స్పందనను తప్పుబట్టారు. ఇద్దరు ముఖ్యమంత్రుల మధ్య నెలకొన్న ఈ వాగ్వాదం ఇప్పుడు దేశ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.విజయన్ తన రాజకీయ జీవితానికి ఎవరిని రోల్ మోడల్‌గా తీసుకుంటున్నారని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. సిద్ధాంతకర్తలైన జ్యోతిబసు, సోమనాథ్ ఛటర్జీలను అనుసరిస్తున్నారా లేక నరేంద్ర మోదీ, అమిత్ షాల బాటలో నడుస్తున్నారా అని నిలదీశారు. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే పినరయి విజయన్ ప్రధాని మోదీనే తన రోల్ మోడల్‌గా భావిస్తున్నట్లు కనిపిస్తోందని, ఆయన అనుసరిస్తున్న పద్ధతులు కేరళ సంస్కృతికి, అక్కడి ప్రజలకు ఏమాత్రం ఆమోదయోగ్యం కావని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు.

...::: తరువాయి 2వ పేజీలో...

## రాజకీయాల్లో హుందాగా ఉండాలి

**తిరువనంతపురం (ఏడీఎన్ఎన్) :**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన విమర్శలపై కేరళ సీఎం పినరయి విజయన్ తీవ్రంగా స్పందించారు. రాజకీయ విభేదాలను పరిష్కరించుకోవడానికి వ్యక్తిగత దూషణలకు దిగడం సరికాదని హితవు పలుకుతూ ఆయన ఒక బహిరంగ లేఖ విడుదల చేశారు. విమర్శలు చేసేటప్పుడు భాషా సంస్కారం ఉండాలని, హద్దులు దాటి మాట్లాడటం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని రేవంత్ రెడ్డికి విజయన్ స్పష్టమైన హెచ్చరిక పంపారు. కేరళ ప్రభుత్వ పనితీరుపై రేవంత్ చేసిన వ్యాఖ్యలు అవాస్తవాలని ఆయన కొట్టిపారేశారు.అభివృద్ధిలో కేరళ సాధించిన విజయాలను అంకెలతో సహా విజయన్ ఈ లేఖలో ఎత్తి చూపారు. నీతి ఆయోగ్ విడుదల చేసిన ఎస్‌డీజీ ఇండెక్స్ 2023-24లో 79 పాయింట్లతో కేరళ దేశంలోనే మొదటి స్థానంలో నిలవగా, తెలంగాణ 6వ స్థానానికి పరిమితమైందని గుర్తు చేశారు. దశాబ్దాలుగా ఎల్‌డీఎఫ్ ప్రభుత్వాలు చేసిన కృషి వల్లే ఈ అగ్రస్థానం సాధ్యమైందని, ఇందులో కాంగ్రెస్ గొప్పదనం ఏమీ లేదని స్పష్టం చేశారు.

...::: తరువాయి 2వ పేజీలో...



# మైకులు బంద్!

## మూడు రాష్ట్రాల్లో ముగిసిన ప్రచార పర్వం



**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

దేశవ్యాప్తంగా రాజకీయ వేడిని పెంచిన అస్సాం, కేరళ, పుదుచ్చేరి రాష్ట్రాల ఎన్నికల ప్రచార పర్వం మంగళవారంతో అధికారికంగా ముగిసింది. కొన్ని రోజులుగా ప్రధాన ప్రాంతాలన్నీ రాజకీయ నేతల ప్రసంగాలు, భారీ బహిరంగ సభలు, రోడ్ షోలతో దద్దరిల్లాయి. ప్రచార పర్వం ముగియడంతో మైకులు ఒక్కసారిగా మూగబోయాయి. కేరళలో 'ఇండియా' కూటమి, ఎల్.డీ.ఎఫ్ మధ్య జరిగిన తీవ్రమైన వాదోపవాదాలు, ముఖ్యమంత్రుల మధ్య లేఖల యుద్ధంతో కేరళ ఎన్నికల ప్రచారం దేశ ప్రజల దృష్టిని ఆకర్షించింది. అభివృద్ధి, అవినీతి ఆరోపణలు ప్రధానాంశాలుగా ప్రచారం సాగింది. మరోవైపు అస్సాం అస్తిత్వాన్ని కాపాడుకుంటామంటూ నేతలు ఓటర్లకు హామీలు ఇచ్చారు. పుదుచ్చేరి కేంద్రపాలిత ప్రాంతంలో రాజకీయ స్థిరత్వం, అభివృద్ధి, స్థానిక సమస్యల పరిష్కారంపై అభ్యర్థులు తమ ప్రచారాన్ని కేంద్రీకరించారు. ప్రచార పర్వం ముగియడంతో, ఎన్నికల సంఘం నిబంధనల మేరకు రాజకీయ నాయకులు, అభ్యర్థులు ఎటువంటి బహిరంగ సభలు లేదా ర్యాలీలు నిర్వహించకూడదు. టెలివిజన్, రేడియో, సోషల్ మీడియాలో ఎటువంటి రాజకీయ ప్రకటనలు, ప్రసారాలు చేయడానికి వీల్లేదు. ఓటర్లను ప్రభావితం చేసే ప్రయత్నాలేవీ జరగకుండా పోలీసులు, ఎన్నికల అధికారులు రాష్ట్రవ్యాప్తంగా నిఘా పెంచారు. ఈ మూడు రాష్ట్రాల్లో త్వరలో జరగనున్న పోలింగ్, ఆయా ప్రాంతాల్లోని భవిష్యత్తు రాజకీయ ముఖచిత్రాన్ని మార్చనుంది. వేల సంఖ్యలో అభ్యర్థుల భవితవ్యం ఇప్పుడు ఓటరు దేవుళ్ల చేతిలో ఉంది.

# చొరబాటుదారులకు భారత్ లో చోటు లేదు

**మొదటిపేజీ తరువాయి...**

పశ్చిమ బెంగాల్ అభివృద్ధి చెందాలన్నా, అక్రమ చొరబాటుదారుల సమస్యకు పరిష్కారం లభించాలన్నా అది కేవలం భారతీయ జనతా పార్టీ వల్లే సాధ్యమవుతుందన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రంలో పెను మార్పులు వస్తాయని, ప్రతి చొరబాటుదారుడిని గుర్తించి, తిరిగి వారి సొంత దేశాలకు తిరిగి పంపిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఓటు బ్యాంకు కోసం కాంగ్రెస్ పార్టీ చొరబాటుదారులకు రెడ్ కార్పెట్ పరిచి స్వాగతం పలుకుతోందని ఆరోపించారు. దేశ ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలకే ఆ పార్టీ పెద్దపీట వేస్తోందని, అందుకే పౌరసత్వ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తోందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి ప్రజల కష్టాల కంటే నిరసనకారులను అక్కున చేర్చుకోవడమే ముఖ్యమైపోయిందని ఆయన ఎద్దేవా చేశారు. ప్రజల సమస్యలను కాంగ్రెస్ నాయకులు పట్టించుకోవడం లేదని, వారి స్థాయి ఏంటో వారి వ్యాఖ్యలే చెబుతున్నాయన్నారు. బెంగాలీలు అధికంగా ఉండే బరాక్ లోయలో అమిత్ షా చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

# మోదీ అడుగుజాడల్లోనే కేరళ సీఎం

**మొదటిపేజీ తరువాయి...**

పినరయి విజయన్ ఒక రాష్ట్ర ముఖ్యమంత్రిలా కాకుండా, మరో నరేంద్ర మోదీ తరహాలో ప్రచారం చేసుకుంటున్నారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. కేరళలో పరిపాలన కంటే వ్యక్తిగత ఇమేజ్ కోసమే ప్రాధాన్యత ఇస్తున్నారని ధ్వజమెత్తారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి, కేరళలోని లెఫ్ట్ ప్రభుత్వానికి మధ్య లోపాయికారీ ఒప్పందం ఉందని, అందుకే విజయన్ పై వస్తున్న అవినీతి ఆరోపణలపై కేంద్ర దర్యాప్తు సంస్థలు మౌనంగా ఉంటున్నాయని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. విజయన్‌పై ఉన్న అవినీతి కేసుల నుంచి కేంద్రంలోని మోదీ ప్రభుత్వమే ఆయనను రక్షిస్తోందని రేవంత్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. ఈ రక్షణ కవచం వల్లే ఆయనపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవడం లేదని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ప్రతిపక్ష నేతలపై దాడులు చేస్తున్న కేంద్ర సంస్థలు, కేరళ సీఎం విషయంలో మాత్రం చూసీచూడనట్లు వ్యవహరించడం వెనుక ఉన్న మర్మమేంటో ప్రజలకు అర్థమవుతోందని ఆయన వ్యాఖ్యానించారు. దేశ రాజకీయాల్లో 'ఇండియా' కూటమిలో భాగస్వాములుగా ఉన్నప్పటికీ, కేరళలో కాంగ్రెస్ , లెఫ్ట్ పార్టీల మధ్య ఉన్న రాజకీయ వైరం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలతో మరోసారి బహిర్గతమైంది. దక్షిణాది రాజకీయాల్లో కీలక నేతలుగా ఉన్న వీరిద్దరి మధ్య మాటల యుద్ధం కూటమిలోని ఇతర పార్టీల మధ్య ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందో అన్నది ఆసక్తికరంగా మారింది.



# రాజకీయాల్లో హుందాగా ఉండాలి

**మొదటిపేజీ తరువాయి...**

అలాగే అత్యంత తక్కువ అవినీతి ఉన్న రాష్ట్రంగా కేరళ రికార్డు సృష్టించిందని, తెలంగాణ 6వ అత్యంత అవినీతిమయ రాష్ట్రంగా ఉందని విమర్శించారు. పేదరిక నిర్మూలనలో కేరళ రోల్ మోడల్‌గా నిలిచిందని విజయన్ గర్వంగా ప్రకటించారు. నవంబర్ 1, 2025 నాటికి దేశంలోనే అత్యంత పేదరికం లేని ఏకైక రాష్ట్రంగా కేరళ అవతరించిందని వివరించారు. దాదాపు 64 వేల పేద కుటుంబాలను గుర్తించి, ప్రత్యేక మైక్రోప్లాన్ల ద్వారా వారికి ఉపాధి, ఆసరా కల్పించామని తెలిపారు. ఐటీ, పారిశ్రామిక రంగాల్లోనూ కేరళ వేగంగా వృద్ధి చెందుతోందని, విజింజం అంతర్జాతీయ నౌకాశ్రయం ద్వారా ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ వైపు అడుగులు వేస్తున్నామని పేర్కొన్నారు. తాను బీజేపీతో మెతకగా ఉంటున్నానన్న రేవంత్ ఆరోపణలను విజయన్ పూర్తిగా తిరస్కరించారు. కేంద్రం అనుసరిస్తున్న సమాఖ్య వ్యతిరేక విధానాలపై సుప్రీంకోర్టులో రాజ్యాంగబద్ధంగా పోరాడుతున్నది కేరళ ప్రభుత్వమేనని గుర్తు చేశారు. మైనారిటీల హక్కుల కోసం, రాజ్యాంగ విలువల కోసం తమ ప్రభుత్వం రాజీలేని పోరాటం చేస్తోందని స్పష్టం చేశారు. గతంలో కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కేరళకు రావాల్సిన రైల్వే కోచ్ ఫ్యాక్టరీ వంటి ప్రాజెక్టుల విషయంలో మొండిచేయి చూపిందని విజయన్ ఆరోపించారు. లేఖ చివరలో పినరయి విజయన్ తాము కేవలం ముందడుగు మాత్రమే వేస్తామని, 'నవ కేరళ' నిర్మాణంతో అందరికీ ఆదర్శంగా నిలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. కేరళలో పారిశ్రామిక స్తబ్దత ఉందన్న రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు వాస్తవ దూరమని, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో తమ రాష్ట్రం అగ్రస్థానంలో ఉందని వివరించారు. ఇద్దరు ముఖ్యమంత్రుల మధ్య సాగుతున్న ఈ లేఖల యుద్ధం ఇప్పుడు జాతీయ రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీస్తోంది.

# హెడ్ కానిస్టేబుల్ రేవతి పోలీసుశాఖకే ఖ్యాతి



**చెన్నై (ఏడీఎన్ఎన్):**

తొమ్మిదిమంది పోలీసులు ఒకవైపు.. హెడ్ కానిస్టేబుల్ రేవతి ఒక్కరే ఒకవైపు. వాళ్లది అధర్మ మార్గం. ఆమెది 'సత్య' పథం. శాంతాంకుళం లాకప్ డెత్ కేసు ఆద్యంతం పరిశీలిస్తే.. ఇప్పుడు దేశమంతా రేవతి వైపే చూస్తోంది. ఒకే ఒక్క సాక్ష్యంతో తొమ్మిది మంది తోటి పోలీసులకు ఉరి శిక్ష పడటానికి కారణమైన కీలక సాక్షి ఆమె. ఇద్దరు అమాయకుల నెత్తుటి గాయాల 'మనస్సాక్షి'గా చట్టంతో పాటు భారతీయ పోలీసు వ్యవస్థ మొత్తం ఆమె ఆత్మ స్థైర్యానికి 'శెల్యూట్'చేస్తోంది.

**'నిజాయితీ' కలిగిన కుటుంబ నేపథ్యం**

'సంతానలక్ష్మి రేవతి'ఒక సామాన్య మధ్యతరగతి కుటుంబానికి చెందిన మహిళ. స్వస్థలం తమిళనాడులోని తూత్తుకుడి జిల్లాలోని కడవట్టి గ్రామం. తల్లిదండ్రులు వ్యవసాయ పనులపై ఆధారపడి జీవిస్తున్నారు. తండ్రి పేరు సంతానపాండియన్. సొంతూళ్లో అందరూ ఆమెను సంతానలక్ష్మి రేవతి అని పిలుస్తారు. చిన్నప్పటి నుంచే ఆమె క్రమశిక్షణ, నిజాయితీ కలిగిన వాతావరణంలో పెరిగారు. విద్యాభ్యాసం స్వగ్రామంలోనే సాగింది. ఉన్నత విద్యను స్థానిక జిల్లా కేంద్రాల్లోని ప్రభుత్వ కళాశాలలో అభ్యసించారు. ఎం.ఏ, బి.ఈడీ పూర్తి చేసిన ఆమె, సమాజానికి సేవ చేయాలనే లక్ష్యంతో పోలీసు శాఖ వైపు అడుగులు వేశారు. భర్త పేరు సంతోష్ రాజ్. ఆయన కూడా పోలీస్ శాఖలో (ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగంలో) పనిచేస్తున్నారు. వారికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

**కానిస్టేబుల్‌గా రేవతి ప్రయాణం...**

రేవతి తమిళనాడు పోలీసు శాఖలో 2009-10 బ్యాచ్ లో కానిస్టేబుల్ గా శిక్షణ పూర్తి చేశారు. తర్వాత వివిధ పోలీస్ స్టేషన్లలో పనిచేశారు. శాంతాంకుళం పోలీస్ స్టేషన్‌కు బదిలీ కావడానికి ముందు ఆమె అంకితభావంతో విధులు నిర్వర్తిస్తూ క్షేత్రస్థాయిలో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. నిబద్ధత తన నైజమని ఆమె సహోద్యోగులు చెబుతున్నారు. ముఖ్యంగా మహిళల సమస్యల పరిష్కారంలోనూ ఆమె చురుకైన పాత్ర పోషిస్తున్నారు.

**ఆ భయంకరమైన రాత్రి.. 'ఆమే'ప్రత్యక్ష సాక్షి!**

2020 జూన్ నెలలో తండ్రీకొడుకులు జయరాజ్, బెన్నిక్స్ లను లాక్‌డౌన్ నిబంధనలు ఉల్లంఘించారనే నెపంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆ రాత్రి శాంతాంకుళం స్టేషన్‌లో రేవతి డ్యూటీలో ఉన్నారు. తన కళ్ల ముందే పైఅధికారులు ఆ ఇద్దరినీ క్రూరంగా హింసించడాన్ని కళ్లారా చూసి ఆమె తల్లడిల్లిపోయారు. రాత్రంతా బాధితుల అరుపులు, వేదన ఆమెను తీవ్రంగా కలచివేశాయి. తానూ ఒక పోలీసుగా పని చేస్తున్నా.. సాటి ఉద్యోగుల అరాచకాన్ని ఆపే శక్తి, ఉద్యోగ స్థాయి ఆమెకు లేకపోయాయి. అయితే.. వారు చేస్తున్నది తప్పు.. అని ధైర్యంగా నిలదీయలేకపోయినా.. తోటి ఖాకీల రాక్షసత్వాన్ని నిలువరించలేకపోయినా.. ఆ భయంకరమైన రాత్రి జరిగిన దాష్టీకం తాలూకు నిజాన్ని మాత్రం ఎలాగైనా బహిర్గతం చేయాలనుకుంది. గుండెలు పగిలే అమానవీయ ఘటనను పూస గుచ్చినట్లు చెప్పడానికి తానే 'ప్రత్యక్ష సాక్షి'ని కావాలని బలంగా సంకల్పించిందామె. 'ఇప్పుడు నువ్వు ఈ నిజాన్ని దాచేస్తే.. చారిత్రక తప్పిదం చేసినదానివి అవుతావు' అని మనస్సాక్షి ఆ మహిళా రక్షకభటురాలిని హెచ్చరించింది. దీంతో ఆమె గట్టిగా ఓ నిశ్చయానికి వచ్చేశారు. ఆ సమయంలో తన ప్రాణాలకు ముప్పు ఉందని తెలిసినా ఆమె వెనకడుగు వేయలేదు.

**కళ్లకు కట్టినట్లుగా.. నిజాన్ని నిర్భయంగా....**

పోలీస్ స్టేషన్‌లో తండ్రీకొడుకులను తోటి పోలీసు సిబ్బంది పదిమంది సామూహికంగా ఎన్ని రకాలుగా హింసించారో కోవిల్‌పట్టి మేజిస్ట్రేట్ భారతీదాసన్ ఎదుట తన వాంగ్మూలాన్ని కళ్లకు కట్టినట్లు, నిర్భయంగా వివరించారు హెడ్ కానిస్టేబుల్ రేవతి. తాను చూసిన ఈ అమానవీయ దాడి తలచుకుంటే ఒళ్లు గగుర్పొడుస్తుంది.. అంటూ లాకప్ గోడలపై చిమ్మిన అమాయక తండ్రీకొడుకుల నెత్తుటి గాయాలను కన్నీటిపర్యంతమవుతూ వివరించారు. పోలీసులు సాక్ష్యాలు లేకుండా చేయాలని ప్రయత్నించినా.. రక్తపు మరకలు తుడిచేసినా... సీసీ టీవీ ఫుటేజీని మాయం చేసినా.. వారి పన్నాగాలు ఫలించలేదు. ఎందుకంటే.. లాకప్ గోడల మూలల్లో, టేబుళ్ల కింద మిగిలిపోయిన చిన్న చిన్న నెత్తుటి మరకలను సైతం రేవతి గుర్తించింది. గుర్తుకు తెచ్చుకుని మరీ.. వాటినే కోర్టు ముందు సాక్ష్యాలుగా చూపించింది. దర్యాప్తు సంస్థ సీబీఐకి ఆమె ఇచ్చిన వివరాలు ఫోరెన్సిక్ ఆధారాలతో సరిపోలాయి. లిటరల్ గా చెప్పాలంటే.. సాంకేతికత విఫలమైనచోట.. ఆమె జ్ఞాపకాలే న్యాయ దివిటీలుగా మారాయి. దర్యాప్తునకు స్పష్టమైన 'దారి'చూపించాయి. అలా.. ఆమె చెప్పిన సాక్ష్యం ఆధారంగానే ఈ కేసులో నిందితులైన 9 మంది పోలీసుల పాత్ర స్పష్టమైంది. కోవిడ్ కారణంగా ఒక పోలీసు అధికారి మరణించగా, మిగిలిన తొమ్మిది మందికి కోర్టు మరణశిక్ష విధించడం దేశవ్యాప్తంగా సంచలనం రేపింది. రేవతి తిరుగులేని సాక్ష్యమే ఇందుకు ప్రధాన కారణమైంది. ఆమె నిజాయితీని గుర్తించిన తమిళనాడు ప్రభుత్వం ఆమెకు ప్రత్యేక భద్రత కల్పించడమే కాకుండా, సెలవు మంజూరు చేసి తదుపరి విధుల్లో సడలింపులు కూడా ఇచ్చింది.

**భయం జాడలో.. నిజాయితీ నీడలో...**

సాధారణంగా పోలీస్ స్టేషన్లలో జరిగే దారుణాల గురించి బయటకు చెప్పడానికి ఖాకీ సిబ్బంది భయపడతారు. పై అధికారుల వేధింపులు, ఉద్యోగం పోతుందనే ఆందోళన వారిని నోరు మెదపనివ్వవు. కానీ రేవతి మాత్రం అందుకు భిన్నంగా ఆలోచించారు. తన కుటుంబం, పిల్లల భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని తెలిసినా.. ప్రాణభయం ఉన్నా.. ఆమె సత్యం వైపు నిలబడాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో ఆమె భర్త కూడా ఆమెకు అండగా నిలబడటం విశేషం.

**ప్రాణ భయం.. ప్రభుత్వ భద్రత**

పోలీసులకు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పిన తర్వాత రేవతి, ఆమె కుటుంబానికి ప్రాణాపాయం పొంచి ఉందన్న ఆందోళన వ్యక్తమైంది. దీంతో మదురై హైకోర్టు ఆదేశాల మేరకు ఆమెకు, ఆమె కుటుంబ సభ్యులకు ప్రభుత్వం ప్రత్యేక భద్రత కల్పించింది. ఆమెను వేరే ప్రాంతానికి బదిలీ చేయడమే కాకుండా, విధులకు ఆటంకం కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. తన సహోద్యోగులకే వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పడం వల్ల ఆమె మానసిక ఒత్తిడికి గురైనప్పటికీ, ధైర్యాన్ని కోల్పోలేదు.

**విధి నిర్వహణలో అంకితభావం**

రేవతి ఈ కేసులో వ్యవహరించిన తీరు ఆమె వృత్తి పట్ల ఆమెకు ఉన్న గౌరవానికి నిదర్శనం. పోలీస్ అంటే కేవలం లాఠీ ఝుళిపించడం కాదు.. చట్టాన్ని కాపాడటం అని ఆమె నిరూపించారు. బాధితులకు న్యాయం జరగడం కోసం తన కెరీర్‌ను పణంగా పెట్టిన ఆమె అంకితభావం దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంది. ఒక మహిళా కానిస్టేబుల్ తలచుకుంటే వ్యవస్థలోని కుళ్లును ఎలా కడిగివేయవచ్చో ఆమె చూపించారు.

**రేవతి పోరాటం.. విజయ సంకేతం**

అయిదేళ్ల సుదీర్ఘ విచారణ అనంతరం మదురై కోర్టు తీర్పు వెలువరించినప్పుడు అందరూ ఒక్కసారిగా రేవతిని గుర్తు చేసుకున్నారు. ఆమె ఆ రోజు భయపడి ఉంటే, ఈ కేసులో నిందితులు తప్పించుకునే అవకాశం ఉండేది. సామాన్యులకు చట్టంపై నమ్మకం కలిగించడంలో రేవతి పాత్ర చిరస్థాయిగా నిలిచిపోతుంది. 'న్యాయమే నెగ్గింది.. ఆలస్యమైనా..' అని బాధిత కుటుంబం రేవతి ధైర్యానికి, నిజాయితీకి ధన్యవాదాలు చెబుతోంది.

**భావి తరాలకు స్ఫూర్తి...**

నేడు రేవతి కేవలం ఒక కానిస్టేబుల్ మాత్రమే కాదు... ఒక వ్యవస్థలో మార్పు కోరుకునే ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిప్రదాత. ఆమె ధైర్యం పోలీస్ శాఖలో ఉన్న ఎందరో నిజాయితీ గల అధికారులకు కొండంత అండను ఇచ్చింది. కుటుంబ సభ్యుల మద్దతు, పిల్లల భవిష్యత్తు కంటే సత్యమే ముఖ్యమని భావించిన రేవతి లాంటి వ్యక్తులు ఉన్నంత కాలం ప్రజాస్వామ్యం సజీవంగా ఉంటుంది. నిజాయితీకి రూపం, ధైర్యానికి చిరునామాగా రేవతి పేరు చరిత్రలో నిలిచిపోతుంది.

# పెట్టుబడులకు ఎస్ఐపీబీ గ్రీన్ సిగ్నల్

**అమరావతి (ఏడీఎన్ఎన్):**



ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన అమరావతి సచివాలయంలో మంగళవారం జరిగిన 16వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశం ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక రంగానికి ఒక సరికొత్త ఊపునిచ్చింది. ఈ సమావేశంలో మొత్తం రూ.39,436 కోట్ల విలువైన 31 భారీ ప్రాజెక్టులకు బోర్డు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ భారీ పెట్టుబడుల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా వివిధ రంగాలలో సుమారు 1,11,278 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. ప్రధానంగా పరిశ్రమలు, విద్యుత్, పర్యాటకం , ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల్లో వచ్చిన పెట్టుబడి ప్రతిపాదనలపై ఈ సమావేశంలో కూలంకషంగా చర్చించి ఆమోదం తెలిపారు. అమరావతిని గ్లోబల్ టెక్నాలజీ హబ్‌గా మార్చే లక్ష్యంలో భాగంగా, 'అమరావతి క్వాంటం వ్యాలీ'లో మూడు ప్రముఖ సంస్థల ఏర్పాటుకు బోర్డు అనుమతులు మంజూరు చేసింది. ఏపీని ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల తయారీలో దేశంలోనే అగ్రగామిగా నిలపాలని, ఆ దిశగా ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. అలాగే, రాయలసీమ ప్రాంతాన్ని దేశంలోనే అతిపెద్ద సౌరవిద్యుత్ ఉత్పత్తి కేంద్రంగా తీర్చిదిద్దాలని నిర్ణయించారు. రాష్ట్రంలో దాదాపు 325 గిగావాట్ల సౌరవిద్యుత్ ఉత్పత్తికి ఉన్న అవకాశాలను పూర్తిస్థాయిలో వినియోగించుకుంటూ పెట్టుబడులను ఆకర్షించాలని చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. పర్యావరణ హితానికి ప్రాధాన్యతనిస్తూ సాగు వ్యర్థాల సద్వినియోగం కోసం ప్రత్యేక యూనిట్ల ఏర్పాటుకు కూడా ఈ సమావేశంలో ఆమోదముద్ర పడింది. ప్రతి పారిశ్రామిక ప్రాజెక్టులోనూ అంతర్జాతీయ స్థాయి భద్రతా ప్రమాణాలు పాటించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ కీలక సమావేశంలో మంత్రులు నారా లోకేష్, కె.అచ్చెన్నాయుడు, అనగాని సత్యప్రసాద్, టీజీ భరత్, గొట్టిపాటి రవికుమార్, కందుల దుర్గేష్, నారాయణ, వాసంశెట్టి సుభాష్, బీసీ జనార్ధన్ రెడ్డితో పాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ , వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ప్రగతిని దెబ్బతీసే కుట్ర



**తిరుమంగళం (ఏడీఎన్ఎన్):**

శాంతికి, అభివృద్ధికి మారుపేరుగా నిలిచిన తమిళనాడు రాష్ట్ర అస్తిత్వాన్ని మార్చేందుకు కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ తీవ్ర ఆరోపణలు చేశారు. మదురై జిల్లా తిరుమంగళంలో మంగళవారం నిర్వహించిన డీఎంకే కూటమి అభ్యర్థుల పరిచయ వేదికలో ఆయన ప్రసంగించారు. బీజేపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు, సొంత మట్టికి ద్రోహం చేసేలా వ్యవహరిస్తోందని విమర్శించారు. మదురై ప్రగతి కోసం తమ 'ద్రావిడ మోడల్' ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని స్టాలిన్ పేర్కొన్నారు. రాష్ట్రంలో మత సామరస్యాన్ని దెబ్బతీసి, అల్లర్లు సృష్టించాలన్న ప్రత్యర్థుల కుట్రలను మదురై ప్రజలు తెలివితేటలతో భగ్నం చేశారని ఆయన కొనియాడారు. దేశంలోనే అత్యధిక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత తమ ప్రభుత్వానిదేనని ఆయన స్పష్టం చేశారు. కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ చేసిన విమర్శలను స్టాలిన్ ఈ సందర్భంగా తిప్పికొట్టారు. తమిళనాడు దివాలా తీస్తోందని, నిధులు ఎక్కడికి వెళ్తున్నాయంటూ గోయల్ అవాస్తవాలు మాట్లాడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేస్తున్న ప్రతి పైసా ప్రజల సంక్షేమం కోసమేనని, అప్పుల భారంపై మాట్లాడే ముందు కేంద్రం రాష్ట్రాలకు ఇస్తున్న పన్ను వాటాపై నిజాలు చెప్పాలని డిమాండ్ చేశారు. పన్నుల రూపంలో తమిళనాడు కేంద్రానికి చెల్లిస్తున్న ప్రతి రూపాయికి బదులుగా తిరిగి ఎంత వస్తోందో బహిరంగంగా చెప్పగలరా? అని గోయల్‌కు ముఖ్యమంత్రి సవాల్ విసిరారు. బీజేపీ పాలిత రాష్ట్రాలకు ఇస్తున్న స్థాయిలో తమిళనాడుకు నిధులు కేటాయిస్తే, రాష్ట్రానికి అప్పుల బాధే ఉండదని, నిధుల కొరత పూర్తిగా తీరిపోతుందన్నారు. రాష్ట్రం నుంచి నిధులు తీసుకుంటూ, తిరిగి ఇక్కడ నిధుల వినియోగంపై ప్రశ్నించడం ఎంతవరకు న్యాయమని నిలదీశారు. ఈ బహిరంగ సభలో మదురై జిల్లాలోని వివిధ నియోజకవర్గాల డీఎంకే, కాంగ్రెస్, ఎండీఎంకే అభ్యర్థులు పి.మూర్తి, పళనివేల్ త్యాగరాజన్, కృత్తికా తంగపాండియన్ తదితరులను స్టాలిన్ ప్రజలకు పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, ఎంపీలు మరియు కూటమి నేతలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# 'యువ'..విజయీభవ!

**చెన్నై (ఏడీఎన్ఎన్):**




పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల బరిలో ఈసారి యువత, విద్యావంతులు రికార్డు స్థాయిలో పోటీ చేస్తున్నారు. పాత తరం రాజకీయ నాయకులకు సవాల్ విసురుతూ 25 నుంచి 40 ఏళ్ల మధ్య వయసున్న 73 మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ప్రధాన పార్టీలు సైతం కొత్త రక్తం ఎక్కించే క్రమంలో యువతకు పెద్దపీట వేయడం విశేషం. రాజ్‌భవన్ నియోజకవర్గం నుంచి డీఎంకే తరపున విఘ్నేష్ కణ్ణన్(27), ఎంబలం (ఎస్సీ) నుంచి నామ్ తమిళర్ కట్చి తరపున మనోజ్ చందర్(27) బరిలో నిలిచి యువశక్తిని చాటుతున్నారు. వీరంతా ఉన్నత చదువులు పూర్తి చేసి, క్లిష్టమైన నియోజకవర్గాల్లో సీనియర్ నాయకులతో తలపడుతుండటం గమనార్హం. తెలుగు రాష్ట్రాలకు దగ్గరగా ఉండే యానాం నియోజకవర్గంలో ఆసక్తికర పోరు సాగుతోంది. గొల్లపల్లి శ్రీనివాస అశోక్(33) కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దిగారు. గత ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా ముఖ్యమంత్రి రంగసామిని ఓడించి సంచలనం సృష్టించిన ఆయన, ఇప్పుడు మాజీ మంత్రి మల్లాది కృష్ణారావుతో అమీతుమీ తేల్చుకుంటున్నారు. ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్న వారిలో అత్యంత ధనవంతుడు, అదే సమయంలో క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్న అభ్యర్థిగా జోస్ చార్లెస్ మార్టిన్(37) నిలిచారు.

## పుదుచ్చేరి ఎన్నికల్లో విద్యావంతుల జోరు

ప్రముఖ లాటరీ వ్యాపారి శాంటియాగో మార్టిన్ కుమారుడైన ఈయన, సుమారు రూ. 609 కోట్ల ఆస్తితో కామరాజ్‌నగర్ నుంచి ఎన్డీయే కూటమి తరపున పోటీ చేస్తున్నారు. మొత్తం 294 మంది అభ్యర్థుల్లో 159 మంది (54 శాతం) ఉన్నత విద్యావంతులు ఉండటం విశేషం. వీరిలో ముగ్గురు డాక్టరేట్లు, 41 మంది పీజీ గ్రాడ్యుయేట్లు, 41 మంది ప్రొఫెషనల్ గ్రాడ్యుయేట్లు ఉండటం రాజకీయాల్లో మారుతున్న ధోరణికి అద్దం పడుతోంది. చదువుకున్నవారు చట్టసభలకు వెళ్లాలని ప్రజలు కోరుకుంటున్న నేపథ్యంలో వీరికి ప్రాధాన్యం పెరిగింది. ముఖ్యమంత్రి ఎన్. రంగసామికి గట్టి పోటీ ఇచ్చేందుకు విద్యావంతులైన మహిళలు సైతం వెనకాడటం లేదు. మంగళం నియోజకవర్గం నుంచి టీవీకే తరపున పీజీ పూర్తి చేసిన ఎం.కె. సత్య నేరుగా ముఖ్యమంత్రితోనే తలపడుతున్నారు. మొత్తానికి పుదుచ్చేరి ఎన్నికల బరి ఈసారి యువతరం ఊపుతో, విద్యావంతుల ఆలోచనలతో సరికొత్తగా కనిపిస్తోంది.




# ఆరోగ్య రంగంలో... అత్యాధునిక వసతులు



**న్యూఢిల్లీ (ఏడీఎన్ఎన్):**

ఆరోగ్య రంగంలో అత్యాధునిక వసతులు కల్పించనున్నట్లు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మంగళవారం వైద్యులు, ఆరోగ్య కార్యకర్తలకు ప్రధాని కృతజ్ఞతలు తెలిపారు. ఆరోగ్యవంతమైన సమాజం కోసం సమిష్టిగా కృషి చేద్దామని ఆయన పిలుపునిచ్చారు. ప్రజల ఆరోగ్యం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న వారి నిస్వార్థ సేవలే భారతదేశ ఆరోగ్య వ్యవస్థకు పటిష్టమైన పునాది అని ఆయన కొనియాడారు. ఈ ఏడాది 'అందరం కలిసి ఆరోగ్యానికి.. విజ్ఞానంతో ముందుకు'అనే నినాదంతో వైద్య దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామన్నారు. విజ్ఞానశాస్త్ర సహకారంతో ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించాలని ప్రధాని సోషల్ మీడియా వేదికగా పునరుద్ఘాటించారు. కేవలం వ్యాధులకు చికిత్స అందించడమే కాకుండా, వ్యాధులు రాకుండా అడ్డుకునే 'ప్రివెంటివ్ హెల్త్ కేర్'పై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. 'ఆయుష్మాన్ భారత్' వంటి పథకాల ద్వారా పేదలకు వైద్య సేవలను మరింత చేరువ చేయడం, యోగా, ఫిట్ ఇండియా కార్యక్రమాల ద్వారా శారీరక దృఢత్వాన్ని ప్రోత్సహించాలన్నారు. ప్రతి వ్యక్తి సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ, అత్యాధునిక మౌలిక సదుపాయాలతో ఆరోగ్య వ్యవస్థలను మరింత బలోపేతం చేసేందుకు అందరూ కలిసికట్టుగా పని చేయాలని ఈ సందర్భంగా ప్రధాని పిలుపునిచ్చారు.

# శబరిమలలో మహిళల ప్రవేశంపై...



శబరిమలలో మహిళల ప్రవేశంపై ఉన్న ఆంక్షలను సమర్థిస్తూ కేంద్ర ప్రభుత్వం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కీలక వాదనలు వినిపించారు. మత విశ్వాసాల ప్రాముఖ్యత: ఈ అంశం పూర్తిగా భక్తుల మత విశ్వాసాలకు, సంప్రదాయాలకు సంబంధించినదని ఆయన పేర్కొన్నారు. మహిళల ప్రవేశంపై ఉన్న ఆంక్షలు వివక్ష కిందకు రావని, అవి కేవలం ఆలయ ఆచారాల్లో భాగమని స్పష్టం చేశారు. మతపరమైన అంతర్గత విషయాలు, విశ్వాసాలు న్యాయ సమీక్ష పరిధిలోకి రావని ఆయన ధర్మాసనానికి విన్నవించారు. గతంలో కోర్టు చారిత్రక తీర్పు (2018) నిచ్చింది. ఐదుగురు న్యాయమూర్తుల సుప్రీంకోర్టు ధర్మాసనం శబరిమలలో మహిళల ప్రవేశంపై ఉన్న నిషేధాన్ని రద్దు చేస్తూ తీర్పునిచ్చింది. ఈ తీర్పును సవాలు చేస్తూ అనేక రివ్యూ పిటిషన్లు దాఖలయ్యాయి. ప్రస్తుతం ఈ వివాదాన్ని చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని తొమ్మిది మంది న్యాయమూర్తుల భారీ ధర్మాసనం సమీక్షిస్తోంది. ఈ కేసు కేవలం శబరిమలకే పరిమితం కాకుండా, మతపరమైన ఆచారాల్లో న్యాయస్థానాలు ఎంతవరకు జోక్యం చేసుకోవచ్చనే రాజ్యాంగపరమైన అంశాలపై కూడా చర్చ జరుగుతోంది.

# మణిపూర్‌లో రాకెట్ దాడి... ఇద్దరు చిన్నారుల మృతి



మణిపూర్‌లో శాంతి మళ్లీ గాడి తప్పింది. బిష్ణుపూర్ జిల్లాలోని ఒక గ్రామంలో అర్ధరాత్రి వేళ ఉగ్రవాదులు జరిపిన రాకెట్ దాడి తీవ్ర విషాదాన్ని నింపింది. అందరూ గాఢనిద్రలో ఉన్న సమయంలో జరిగిన ఈ పేలుడులో ఐదేళ్ల బాలుడు, ఆరు నెలల పసికందు ప్రాణాలు కోల్పోవడం అత్యంత దారుణం. ఈ ఘటనలో మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ దాడితో ప్రజల్లో ఆగ్రహావేశాలు మిన్నంటాయి. నిరసనలు హింసాత్మకంగా మారకుండా, తప్పుడు వార్తలు వ్యాపించకుండా ప్రభుత్వం తక్షణమే అప్రమత్తమైంది 5 జిల్లాల్లో ఇంటర్నెట్ నిలిపివేసింది. ఇంఫాల్ ఈస్ట్, వెస్ట్, తౌబాల్, కాక్చింగ్, బిష్ణుపూర్ జిల్లాల్లో మూడు రోజుల పాటు మొబైల్ ఇంటర్నెట్ సేవలను రద్దు చేశారు. ఘర్షణలు తీవ్రమైన బిష్ణుపూర్ జిల్లాలో అధికారులు వెంటనే కర్ఫ్యూ విధించారు. గత కొంతకాలంగా మైతేయ్, కుకీ వర్గాల మధ్య జరుగుతున్న అంతర్గత కలహాలతో అట్టుడుకుతున్న మణిపూర్‌లో, ఈ తాజా రాకెట్ దాడి పరిస్థితులను మరింత ఆందోళనకరంగా మార్చింది. శాంతి భద్రతలను అదుపులోకి తెచ్చేందుకు భద్రతా బలగాలు రంగంలోకి దిగాయి.



# మీ దేశాన్ని ఈ రోజే...అంతం చేస్తా

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):

మంగళవారం రాత్రితో ఇరాన్ నాగరికత అంతమైపోతుంది" అంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరికలు అంతర్జాతీయంగా ఆందోళనకు గురిచేస్తున్నాయి . ఇరాన్ చమురు నిల్వ కేంద్రమే లక్ష్యంగా అమెరికా ఆర్మీ దళాలు భీకర దాడులకు తెగబడుతోంది. ఇరాన్‌పై డొనాల్డ్ ట్రంప్ తన 'ట్రూత్ సోషల్' వేదికగా పోస్ట్ లు ఆలజడి సృష్టిస్తున్నాయి . ఇరాన్‌లో గత 47 ఏళ్లుగా కొనసాగుతున్న అవినీతి, అరాచక పాలనకు మంగళవారం రాత్రితో చరమగీతం పాడుతామని పేర్కొన్నారు. ప్రపంచ చరిత్రలో ఈ రాత్రి ఒక మైలురాయిగా నిలిచిపోతుందని ఆయన స్పష్టం చేశారు. ఇరాన్ నాగరికతను తుడిచిపెట్టడం తనకు ఇష్టం లేకపోయినా, ప్రస్తుత పరిస్థితుల్లో అది తప్పడం లేదని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇరాన్‌లో కొత్త తెలివైన నాయకత్వం వస్తే అద్భుతాలు జరుగుతాయంటూనే, హర్మూజ్ జలసంధిని తెరవని పక్షంలో ఆ దేశ వంతెనలు, విద్యుత్ కేంద్రాలే లక్ష్యంగా దాడులు ఉంటాయని స్పష్టం మరోసారి ప్రస్తావించారు. క్షేత్రస్థాయిలో అమెరికా ఇప్పటికే తన ప్రతాపాన్ని చూపిస్తోంది. ఇరాన్‌కు అత్యంత కీలకమైన ఖర్గ్ ఐలాండ్‌పై అమెరికా దళాలు విరుచుకుపడ్డాయి. దాదాపు 50 వ్యూహాత్మక లక్ష్యాలపై దాడులు జరిపి, అక్కడి రక్షణ వ్యవస్థలను ధ్వంసం చేసినట్లు పెంటగాన్ అధికారికంగా వెల్లడించింది. ఈ ద్వీపాన్ని పూర్తిగా స్వాధీనం చేసుకోవడానికి అమెరికా మెరైన్ దళాలు రంగంలోకి దిగే అవకాశం ఉందని సమాచారం. అమెరికా , ఇజ్రాయెల్ సంయుక్తంగా జరుపుతున్న ఈ దాడులతో ఇరాన్‌లోని అనేక ప్రాంతాలు దద్దరిల్లుతున్నాయి. పౌర మౌలిక సదుపాయాలపై దాడులు చేయడం అంతర్జాతీయ చట్టాల ప్రకారం నేరమని ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ హెచ్చరించినప్పటికీ, అమెరికా తన దూకుడును తగ్గించడం లేదు.

# ఏ పోరాటానికైనా... మేము సిద్ధం

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):

తన దేశం కోసం ప్రజలతో కలిసి ప్రాణత్యాగానికి సిద్ధమంటూ ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ చేసిన సంచలన వ్యాఖ్యలు మరింత వేడెక్కిస్తున్నాయి. హర్మూజ్ జలసంధిపై అమెరికా అధ్యక్షుడు డెడ్ లైన్ లను ఇరాన్ బేఖాతరు చేస్తోంది. యుద్ధ ఉద్రిక్తల నడుమ ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ ఎక్స్ వేదికగా ధీటుగా పోస్ట్ పెట్టారు. దేశ సార్వభౌమాధికారాన్ని కాపాడుకోవడం కోసం దాదాపు 14 మిలియన్ల ( కోటి 40 లక్షల) మంది ఇరాన్ పౌరులు తమ ప్రాణాలను త్యాగం చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారని ఆయన పేర్కొన్నారు. "దేశ రక్షణ కోసం నా ప్రాణాలను అర్పించడానికి నేను ఎప్పుడూ సిద్ధమే. గతం, వర్తమానం, భవిష్యత్తు.. ఏదైనా నా ప్రాణం దేశానికే అంకితం" అంటూ పెజెష్కియాన్ చేసిన వ్యాఖ్యలు ఇరాన్ పోరాట పటిమను చాటుతున్నాయి. అమెరికా , ఇజ్రాయెల్ వైమానిక దాడులు చేసే అవకాశం ఉందన్న నిఘా వర్గాల హెచ్చరికల నేపథ్యంలో, ఇరాన్ ప్రభుత్వం తన వ్యూహాన్ని మార్చింది. దేశంలోని విద్యుత్ ప్లాంట్లు, చమురు క్షేత్రాలు , మౌలిక సదుపాయాలను కాపాడుకోవడానికి యువత పెద్ద ఎత్తున 'మానవ గొలుసులు' ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చింది. శత్రువుల బాంబు దాడులను అడ్డుకోవడానికి పౌరులే మానవహారాలుగా మారుతున్నట్లుగా సంకేతాలు ఇరాన్ ఇచ్చింది. ట్రంప్ ప్రతిపాదించిన తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఇరాన్ ఇప్పటికే నిర్ద్వంద్వంగా తిరస్కరించింది. ముక్క ముక్కలుగా ఉండే శాంతి ఒప్పందాల కంటే, ఈ సంఘర్షణకు శాశ్వత ముగింపు పలికే పరిష్కారం కావాలని ఇరాన్ డిమాండ్ చేస్తోంది. అధ్యక్షుడు పెజెష్కియాన్ పిలుపుతో ఇరాన్ వెనక్కి తగ్గే ప్రసక్తే లేకపోవడంతో ఒకవైపు అగ్రరాజ్యం సైనిక బలం, మరోవైపు ఇరాన్ పౌరుల ఆత్మబలిదానాల హెచ్చరికల మధ్య ప్రపంచం ఊపిరి బిగబట్టి చూస్తోంది.





## భారత్ పై పాక్
# సెనెటర్ అక్కసు

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):

ఆర్థిక సంక్షోభంతో కొట్టుమిట్టాడుతున్న పాకిస్తాన్ తన అసహనాన్ని పొరుగు దేశాలపై అక్కసు వెళ్లగక్కుతోంది. యూఏఈ తన బకాయిలను వెంటనే చెల్లించాలని ఒత్తిడి చేయడంతో, పాక్ సెనేటర్ ముషాయిద్ హుసేన్ చేసిన వ్యాఖ్యలు అంతర్జాతీయ దౌత్య వర్గాల్లో దుమారం రేపుతున్నాయి. పాకిస్తాన్ ఈ నెల 7 నుంచి రాత్రి 8 గంటలకే వాణిజ్య కేంద్రాలను మూసివేస్తూ చీకట్లో మగ్గుతున్న వేళ, అరబ్ మిత్రదేశం యూఏఈ నించి పాక్‌కు గట్టి షాక్ తగిలింది. తాము ఇచ్చిన 3.5 బిలియన్ డాలర్ల రుణాన్ని తక్షణమే తిరిగి చెల్లించాలని యూఏఈ పట్టుబట్టడంతో పాక్ పీకల్లోతు కష్టాల్లో పడింది. ఆ దేశ సెనేటర్ ముషాయిద్ హుసేన్ ఒక టీవీ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, భారత్ జోక్యం వల్లే యూఏఈ ఇలా ప్రవర్తిస్తోందని వింత వాదనను తెరపైకి తెచ్చారు. "భారత్ తన 'అఖండ భారత్' ఎజెండాతో యూఏఈని భయపెట్టిందని, ఆ దేశాన్ని భారత్‌లో కలిపేసుకుంటామన్న బెదిరింపుల వల్లే యూఏఈ మాపై ఒత్తిడి పెంచుతోంది" అని ఆయన ఆరోపించారు. యూఏఈని ఒక 'పేద దేశం'గా అభివర్ణిస్తూ హుసేన్ ఎద్దేవా చేయడం గమనార్హం. యూఏఈకి డబ్బు అవసరం చాలా ఉందని, అందుకే పాక్ ప్రభుత్వం ఆ అప్పు తీర్చడానికి అంగీకరించినందుకు సంతోషంగా ఉందని ఆయన వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. ఒకప్పుడు యూఏఈ సైన్యానికి శిక్షణ ఇచ్చింది తామేనని, ఆ దేశ నిర్మాణంలో పాక్ 'పెద్దన్న' పాత్ర పోషించిందని గుర్తు చేస్తూ, అదే దేశం అప్పు కోసం పాకిస్తాన్ పీక మీద కూర్చోవడం దారుణమని మండిపడ్డారు. యుద్ధం వల్ల చమురు సరఫరా ఆగిపోయి, పాక్ రూపాయి విలువ పడిపోతున్న తరుణంలో.. ఇటు మిత్రదేశాలు కూడా దూరం కావడం పాకిస్తాన్ భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తోంది. ఒకవైపు దేశ ప్రజలు నిత్యావసరాల కోసం రోడ్లపైకి వస్తుంటే, మరోవైపు బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న నేతలు ఇలాంటి 'కాన్స్పిరసీ థియరీ'లను (కుట్రపూరిత ఆరోపణలు) ప్రచారం చేయడం ప్రజల అసహనాన్ని పెంచుతోంది. అంతర్జాతీయ స్థాయిలో యూఏఈ , భారత్ సంబంధాలు బలోపేతం కావడాన్ని పాక్ జీర్ణించుకోలేకపోతోందని, అందుకే ఇలాంటి అసంబద్ధ వ్యాఖ్యలు చేస్తోందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ వ్యాఖ్యల వల్ల ఇప్పటికే దెబ్బతిన్న పాక్ ప్రతిష్ఠ అంతర్జాతీయ వేదికలపై మరింత దిగజారే అవకాశం ఉంది.



## భారత పౌరులకు
# కేంద్రం అలర్ట్

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):

ఇరాన్ నాగరికత అంతానికి ట్రంప్ విధించిన డెడ్‌లైన్ సమీపిస్తుండటంతో, యుద్ధం ఏ క్షణమైనా విరుచుకుపడొచ్చనే ఆందోళనల మధ్య తన పౌరులను అప్రమత్తం చేస్తూ భారత ప్రభుత్వం అత్యవసర అడ్వైజరీని జారీ చేసింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన "చారిత్రక రాత్రి" హెచ్చరికలు ప్రపంచాన్ని వణికిస్తుండగా, ఇరాన్‌లో నివసిస్తున్న వేలాది మంది భారతీయుల భద్రతపై కేంద్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టింది. టెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయం తాజాగా జారీ చేసిన ఆదేశాల ప్రకారం , రాబోయే 48 గంటల పాటు భారతీయులందరూ అత్యంత అప్రమత్తంగా ఉండాలని కోరింది. ఎక్కడివారు అక్కడే ఇళ్లకు లేదా సురక్షిత ప్రాంతాలకు పరిమితం కావాలని, అనవసర ప్రయాణాలను పూర్తిగా మానుకోవాలని సూచించింది. ఈ నెల 7, 8 తేదీల్లో ఇరాన్‌లోని విద్యుత్ ప్లాంట్లు, వంతెనలు , సైనిక స్థావరాలపై దాడులు జరిగే అవకాశం ఉన్నందున, అటువంటి సున్నితమైన ప్రాంతాలకు భారతీయులు కనీసం 5 నుంచి 10 కిలోమీటర్ల దూరంగా ఉండాలని స్పష్టం చేసింది. బహుళ అంతస్తుల భవనాల్లో ఉండేవారు పై అంతస్తుల్లో కాకుండా కింది భాగాల్లో ఉండాలని సూచించడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. ఇరాన్‌లోని భారతీయ విద్యార్థులు, పర్యాటకులు , ఉద్యోగుల కోసం రాయబార కార్యాలయం 24 గంటల హెల్ప్ లైన్ నంబర్లను (+989128109115, +989128109102, +989128109109, +989932179359) అందుబాటులోకి తెచ్చింది. ఒకవేళ అత్యవసరంగా రహదారి ప్రయాణాలు చేయాల్సి వస్తే, ఎంబసీ అధికారుల అనుమతి సమన్వయం తప్పనిసరి అని పేర్కొంది. ఇప్పటికే ఎంబసీ ఏర్పాటు చేసిన తాత్కాలిక వసతి గృహాల్లో ఉన్నవారు అధికారుల తదుపరి ఆదేశాలు వచ్చే వరకు గదుల నుంచి బయటకు రావద్దని స్పష్టం చేసింది. ట్రంప్ హెచ్చరించినట్లుగా ఈ రాత్రి దాడులు జరిగితే, ఇరాన్ మౌలిక సదుపాయాలు చిన్నాభిన్నం అయ్యే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ నిరంతరం పరిస్థితులను సమీక్షిస్తోంది. పౌరులు తమ వివరాలను ఎప్పటికప్పుడు cons.tehran@mea.gov.in మెయిల్ ద్వారా ఎంబసీకి తెలియజేయాలని, అధికారిక ప్రకటనలను మాత్రమే నమ్మాలని విజ్ఞప్తి చేసింది. భారతీయుల భద్రతే తమ ప్రథమ ప్రాధాన్యమని, అవసరమైతే తరలింపు ప్రక్రియకు కూడా సిద్ధంగా ఉన్నట్లు కేంద్ర ప్రభుత్వ వర్గాలు సంకేతాలిచ్చాయి. రెండు దేశాల మధ్య నెలకొన్న ఈ 'డెడ్ లాక్' ఏ క్షణంలోనైనా భీకర యుద్ధానికి దారితీసే అవకాశం ఉండటంతో టెహ్రాన్ నుంచి ఢిల్లీ వరకు సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

# సుప్రీం వారసుడు ఉన్నట్టా..లేనట్టా ..?

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):



ఈ ఏడాది ఫిబ్రవరి 28న జరిగిన భీకర వైమానిక దాడుల తర్వాత ఇరాన్ పగ్గాలు చేపట్టిన మొజ్తాబా ఖమేనీ అదృశ్యం బేతాళ ప్రశ్నగా మారింది. ఇరాన్ లో యుద్ధ వాతావరణం నెలకొనడంతో అసలు ఉన్నట్టా..లేనట్టా ప్రశ్నలు ఇప్పుడు అంతర్జాతీయ సమాజం మెదళ్లను తొలుస్తోంది. మరోవైపు, ఇరాన్ దివంగత సుప్రీం లీడర్ అలీ ఖమేనీ అంత్యక్రియలు కోమ్ నగరంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్న తరుణంలో , కొత్త వారసుడు మొజ్తాబా ఖమేనీ ఎక్కడ ఉన్నారనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ , ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు హెచ్చరికల మీద హెచ్చరికలు చేస్తున్నప్పటికి ఇరాన్ లో సర్వాధికారాలకు కేంద్ర బిందువైన సుప్రీం లీడర్ నుంచి స్పష్టమైన ఆదేశాలు భౌతికంగా లేకపోవడంతో ప్రపంచానికి ఉత్కంఠగా మారింది. ఇంతకుముందు మొజ్తాబా ఖమేనీ విడుదల చేసిన సందేశం ఇరాన్ ప్రజల్లో ఉత్తేజాన్ని నింపినప్పటికీ, ఆయన భౌతిక ఉనికిపై నెలకొన్న అనుమానాలతో సంధిగ్ధత నెలకొంది. అమెరికా, ఇజ్రాయెల్ దాడుల ప్రారంభంలోనే ఆయన తీవ్రంగా గాయపడ్డారని ఇరాన్ అధికారికంగా ధ్రువీకరించినప్పటికీ, ఆయన పరిస్థితిపై భిన్న కథనాలు వినిపిస్తున్నాయి. బ్రిటీష్ పత్రిక 'ది సన్' ప్రచురించిన కథనం ప్రకారం, మొజ్తాబా ఒక కాలు కోల్పోవడమే కాకుండా, అంతర్గత అవయవాలు దెబ్బతినడంతో ప్రస్తుతం కోమాలో ఉండి మృత్యువుతో పోరాడుతున్నారు. టెహ్రాన్‌లోని సీనా యూనివర్సిటీ హాస్పిటల్ వద్ద ఉన్న భారీ సైనిక పహారా ఈ వార్తలకు బలాన్ని చేకూరుస్తోంది. ఆయన ఇరాన్ యుద్ధ గదిలో ఉండి దాడులను సమీక్షిస్తున్నట్లుగా ప్రభుత్వం విడుదల చేసిన వీడియో 'AI (కృత్రిమ మేధ)' సృష్టించినది కావడంతో, ఆయన నిజంగానే అచేతన స్థితిలో ఉన్నారా అనే అనుమానాలు బలపడుతున్నాయి. మొజ్తాబా పేరుతో వెలువడుతున్న హెచ్చరికలు మాత్రం అత్యంత భీకరంగా ఉన్నాయి. అమెరికా ఆస్తులను ధ్వంసం చేస్తామని, హర్మూజ్ జలసంధిని దిగ్బంధించి ప్రపంచ ఇంధన సరఫరాను స్తంభింపజేస్తామని ఆయన పరోక్షంగా హెచ్చరించారు. "శత్రువుకు ఊహించని కొత్త యుద్ధ రంగాలు తెరుస్తాం" అని చెప్పడం ద్వారా, ఇరాన్ తన వ్యూహాలను మార్చుకోబోతోందని స్పష్టమవుతోంది. తన కుటుంబ సభ్యులందరినీ కోల్పోయిన ఆవేదనను వ్యక్తపరుస్తూనే, పొరుగు దేశాల్లోని అమెరికా స్థావరాలను ఖాళీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ప్రకటనలను ఒక న్యూస్ యాంకర్ చదివి వినిపించడం, మొజ్తాబా గొంతు కూడా వినపడకపోవడం 'ఘోస్ట్ అయతొల్లా' అనే చర్చకు తెరలేపింది. ప్రస్తుతం ఇరాన్ యుద్ధం తీవ్రతను గమనిస్తే.. అది మొజ్తాబా నాయకత్వంలో జరుగుతోందా లేక ఇరాన్ రెవల్యూషినరీ గార్డ్స్ (ఐఆర్‌జీసీ) తమ ఉనికిని కాపాడుకోవడానికి ఆయన పేరును వాడుకుంటున్నారా అనే సందేహం కలుగుతోంది. ఒకవేళ మొజ్తాబా కోమాలో ఉంటే, ఇరాన్ నాయకత్వ సంక్షోభంలో పడే ప్రమాదం ఉంది. క్షేత్రస్థాయిలో దాడులు ఆగకపోవడం చూస్తుంటే, ఆయన అజ్ఞాతంలో ఉండి ఒక రహస్య యుద్ధ ప్రణాళికను అమలు చేస్తున్నారని మరికొందరు భావిస్తున్నారు. ఇరాన్ స్టేట్ మీడియా ఆయనను 'గాయపడిన వీరుడు'గా చూపిస్తూ ప్రజల్లో భావోద్వేగాలను రెచ్చగొడుతోంది. మొజ్తాబా ఖమేనీ బహిరంగంగా ప్రజల ముందుకు వచ్చే వరకు, ఇరాన్ నాయకత్వం ఉందా లేక అదృశ్య శక్తి నడిపిస్తోందా అన్న ఉత్కంఠ కొనసాగుతూనే ఉంటుంది. ఈ అనిశ్చితి పశ్చిమాసియాను అల్లకల్లోలంలోకి నెట్టేలా కనిపిస్తోంది.

# లెబనాన్‌లో మరణమృదంగం


ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):



యుద్ధం కారణంగా లెబనాన్ దేశంలో మృత్యుఘోష అమాయక ప్రజలతో వికటాట్టహాసం చేస్తోంది. లెబనాన్‌పై ఇజ్రాయెల్ జరుపుతున్న నిరంతర వైమానిక, భూతల దాడులతో ఆ దేశం స్మశానవాటికను తలపిస్తోంది. కేవలం నెల రోజుల్లోనే మరణాల సంఖ్య 1,497కు చేరడం పరిస్థితి ఎంత తీవ్రతగా ఉందో అద్దం పడుతోంది. లెబనాన్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించిన తాజా నివేదికల ప్రకారం, గత నెల 2 నుంచి ప్రారంభమైన ఈ పోరులో ఇప్పటి వరకు 1,497 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 4,639 మంది తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో 129 మంది చిన్నారులు, 97 మంది మహిళలు ఉండటం గమనార్హం. గత 24 గంటల్లోనే సుమారు 40 మంది మరణించారు. మరో 130 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. రాజధాని బెయిరూట్‌తో పాటు దక్షిణ లెబనాన్ ప్రాంతాలు ఇజ్రాయెల్ యుద్ధ విమానాల బాంబుల మోతతో దద్దరిల్లుతున్నాయి. బెయిరూట్ దక్షిణ శివారు ప్రాంతమైన 'దహియే'పై ఆదివారం రాత్రి ఎనిమిది సార్లు భారీ బాంబు దాడులు జరగడం, జనసాంద్రత గల ప్రాంతాల్లో విధ్వంసం పేట్రేగిపోతుంది. ప్రాణనష్టమే కాకుండా, దేశంలో నిరాశ్రయులైన వారి సంఖ్య ఊహాతీతంగా పెరుగుతోంది. దాదాపు 10 లక్షల మంది (దేశ జనాభాలో 20%) తమ ఇళ్లను వదిలి సురక్షిత ప్రాంతాలకు వలస వెళ్లారు. పాఠశాలలు, స్టేడియాలు, తాత్కాలిక శిబిరాలు నిరాశ్రయులతో కిక్కిరిసిపోయాయి. దక్షిణ లెబనాన్‌లోని 50కి పైగా గ్రామాలను తక్షణమే ఖాళీ చేయాలని ఇజ్రాయెల్ జారీ చేసిన హెచ్చరికలతో ప్రజలు దిక్కుతోచని స్థితిలో ఉత్తర ప్రాంతాలకు పరుగులు తీస్తున్నారు. 1.2 మిలియన్ల మందికి పైగా ప్రజలు ఆహారం, మందులు , ప్రాథమిక వసతులు లేక అల్లాడుతున్నారు. దాడుల ప్రభావం ఆరోగ్య రంగంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఇప్పటివరకు 54 మంది ఆరోగ్య కార్యకర్తలు విధి నిర్వహణలో మరణించగా, అనేక ఆసుపత్రులు బాంబు దాడులకు గురయ్యాయి. దక్షిణ లెబనాన్‌లోని 'నాబతియా' జిల్లాలో అంబులెన్స్‌లు వైద్య సిబ్బందిపై కూడా దాడులు జరగడం అంతర్జాతీయ సమాజాన్ని కలవరపెడుతోంది. టైర్, కఫర్‌హట్టా, నాబతియా వంటి ప్రాంతాలు పూర్తిగా శిథిలాల కుప్పలుగా మారాయి. రహదారులు వంతెనలు ధ్వంసం కావడంతో సహాయక చర్యలు అందించడం దాదాపు అసాధ్యంగా మారింది. మరోవైపు హెజ్బొల్లా కూడా ఇజ్రాయెల్ సైనిక స్థావరాలు , చమురు మౌలిక సదుపాయాలే లక్ష్యంగా డ్రోన్లు, క్షిపణులతో ఎదురు దాడులు చేస్తోంది. ఐక్యరాజ్యసమితి శాంతి పరిరక్షక దళంపై కూడా దాడులు జరగడం, ముగ్గురు శాంతి పరిరక్షకులు మరణించడం ఆందోళన కలిగించే అంశం. పౌర మౌలిక సదుపాయాలపై దాడులు చేయడం అంతర్జాతీయ చట్టాల ప్రకారం నేరమని ఐక్యరాజ్యసమితి చీఫ్ హెచ్చరించినప్పటికీ, దాడులు ఆగడం లేదు. ఇరాన్ నాయకత్వం అమెరికా జోక్యం మధ్య ఈ యుద్ధం ఏ మలుపు తిరుగుతుందోనని పశ్చిమాసియా దేశాలు వణికిపోతున్నాయి. అంతర్జాతీయ సమాజం తక్షణమే స్పందించి యుద్ధాన్ని ఆపకపోతే, లెబనాన్ మరో శతాబ్ద కాలం వెనక్కి వెళ్లే ప్రమాదం ఉందని నిపుణులు సూచిస్తున్నారు.

# పాకిస్తాన్ లో 'స్మార్ట్ లాక్ డౌన్'

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):






ఇరాన్,అమెరికా వివాదంతో ప్రపంచమంతా చమురు భూతం కరాళ నృత్యం చేస్తోంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థను అతలాకుతలంగా కుదిపేస్తోంది. హర్మూజ్ జలసంధి దిగ్బంధంతో చమురు సరఫరా నిలిచిపోవడంతో, ఇప్పటికే ఆర్థికంగా చితికిపోవడంతో పూర్తిగా చేతులెత్తేసి దేశవ్యాప్తంగా అత్యవసర లాక్ డౌన్ ను పాకిస్తాన్ ప్రభుత్వం ప్రకటించింది. పశ్చిమాసియాలో ముదురుతున్న యుద్ధ జ్వాలలు పాకిస్తాన్ ను పట్టి పీడిస్తున్నాయి. ఇరాన్ వర్సెస్ అమెరికా,ఇజ్రాయెల్ దేశాల మధ్య ఘర్షణ కారణంగా ప్రపంచవ్యాప్తంగా చమురు సరఫరాకు హర్మూజ్ జలసంధి మూతపడటంతో ఇంధన దిగుమతులు నిలిచిపోయాయి. పాకిస్తాన్ లో పెట్రోల్, గ్యాస్ ధరలు ఆకాశాన్ని తాకడమే కాకుండా, విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన ఇంధనం లేక దేశం అంధకారంలోకి జారుకుంటోంది. ఈ క్లిష్ట పరిస్థితుల నుంచి గట్టెక్కేందుకు ప్రధాని షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వం దేశవ్యాప్తంగా "స్మార్ట్ లాక్ డౌన్" విధిస్తున్నట్లు సంచలన ప్రకటన చేసింది. మంగళవారం రాత్రి 8 గంటల నుంచే ఈ కఠిన నిబంధనలు అమలులోకి వచ్చాయి. పాకిస్తాన్ లోని పంజాబ్, ఖైబర్ పఖ్తున్ఖ్వా, బలూచిస్తాన్ , రాజధాని ఇస్లామాబాద్‌తో సహా అన్ని ప్రధాన నగరాల్లో మార్కెట్లు, షాపింగ్ మాల్స్ వాణిజ్య కేంద్రాలను రాత్రి 8 గంటలకే మూసివేయాలి. హోటళ్లు, రెస్టారెంట్లు ,వివాహ వేడుకలకు కేవలం రాత్రి 10 గంటల వరకు మాత్రమే అనుమతి ఇచ్చారు. విద్యుత్తును ఆదా చేయడం పెట్రోలియం ఉత్పత్తుల వాడకాన్ని తగ్గించడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. కేవలం మెడికల్ షాపులు, ఫార్మసీలు వంటి అత్యవసర సేవలకు మాత్రమే ఈ నిబంధనల నుంచి మినహాయింపు ఇచ్చారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే ప్రభుత్వ కార్యాలయాల్లో వారానికి కేవలం 4 రోజుల పనిదినాలను మాత్రమే ప్రకటించే యోచనలో ప్రభుత్వం ఉంది. భారత్, నేపాల్ వంటి పొరుగు దేశాలు ముందస్తు జాగ్రత్తలతో ఇంధన నిల్వలను సమకూర్చుకున్నప్పటికీ, తీవ్రమైన విదేశీ మారక ద్రవ్య నిల్వల కొరతతో ఉన్న పాకిస్తాన్ ఈ సంక్షోభాన్ని తట్టుకోలేకపోయింది. ఇంధన కొరత కారణంగా రవాణా వ్యవస్థ స్తంభించిపోవడంతో, గిల్గిత్, ముజఫరాబాద్ వంటి నగరాల్లో ప్రజల కష్టాలను తగ్గించేందుకు ప్రభుత్వం నెల రోజుల పాటు ఉచిత ప్రజా రవాణాను ప్రకటించింది. ఇందుకు అయ్యే భారీ వ్యయం ఇప్పటికే అప్పుల్లో ఉన్న ఖజానాపై మరింత భారాన్ని పెంచనుంది. యుద్ధం సుదీర్ఘ కాలం కొనసాగితే పాకిస్తాన్ ఆర్థిక వ్యవస్థ పూర్తిగా కుప్పకూలే ప్రమాదం ఉందని అంతర్జాతీయ ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. హర్మూజ్ జలసంధి మూసివేత అనేది కేవలం పాకిస్తాన్ కే పరిమితం కాకుండా ప్రపంచ దేశాలన్నింటినీ ఆందోళనలోకి నెట్టింది. ఇంధన సరఫరా పునరుద్ధరించబడే వరకు పాకిస్తాన్ వంటి బలహీన ఆర్థిక దేశాలు 'చీకటి రోజులను' అనుభవించక తప్పని పరిస్థితి నెలకొంది. చమురు బావులపై దాడులు, రవాణా మార్గాల దిగ్బంధం ఇలాగే కొనసాగితే ప్రపంచవ్యాప్తంగా నిత్యావసర ధరలు పెరిగి సామాన్యుడి బతుకు భారంగా మారనుంది.



## 10 వేల విమాన
# సర్వీసులు రద్దు

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):

మధ్యప్రాచ్యంలో యుద్ధ ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరడంతో విమానయాన రంగం కుదేలవుతోంది. యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు భారత్ నుంచి పశ్చిమాసియా దేశాలకు వెళ్లాల్సిన సుమారు 10,000కు పైగా విమాన సర్వీసులు రద్దయినట్లు పౌర విమానయాన మంత్రిత్వ శాఖ వెల్లడించింది. భద్రతా కారణాల దృష్ట్యా భారత్ నుంచి ఆ ప్రాంతానికి నడిచే వేలాది విమాన సర్వీసులు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సాధారణ సమయాల్లో భారత్ నుంచి రోజుకు సగటున 300 నుంచి 350 విమానాలు ఈ ప్రాంతానికి సర్వీసులను అందించేవి. ప్రస్తుత ఘర్షణల నేపథ్యంలో ఆ సంఖ్య కేవలం 80- 90కి పడిపోవడం పరిస్థితి తీవ్రతకు తెలియజేస్తుంది. ఎయిర్ ఇండియా, ఇండిగో వంటి ప్రముఖ సంస్థలు తమ సర్వీసులను తాత్కాలికంగా నిలిపివేయడమే కాకుండా, ప్రత్యామ్నాయ మార్గాలను వెతుక్కుంటున్నాయి. యుద్ధం కారణంగా విమానాలు ఆకాశ మార్గంలో సుదీర్ఘ దూరం ప్రయాణించాల్సి రావడం (రీ రూటింగ్) విమానయాన సంస్థలకు పెను సవాల్‌గా మారింది. ఈ నేపథ్యంలో విమాన కార్యకలాపాలకు ఆటంకం కలగకుండా పైలట్ల 'ఫ్లైట్ డ్యూటీ టైమ్ లిమిటేషన్' నిబంధనలను డీజీసీఏ తాత్కాలికంగా సడలించింది. ఇంధన ధరల పెరుగుదల ,అదనపు ప్రయాణ సమయం కారణంగా విమాన టికెట్ల ధరలు కూడా భారీగా పెరిగాయి. యుద్ధం సద్దుమణిగి పరిస్థితులు చక్కబడే వరకు పశ్చిమాసియా గగనతలంలో అనిశ్చితి కొనసాగేలా కనిపిస్తోంది, ఇది అంతర్జాతీయ వాణిజ్యం , పర్యాటక రంగంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది.



## చర్చల ద్వారాలు
# మూసేసిన ఇరాన్

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):

హర్మూజ్ జలసంధి వివాదంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన డెడ్‌లైన్ ముగియడానికి కొన్ని గంటల ముందే, ఇరాన్ ఒక కఠిన నిర్ణయం తీసుకుంది. అమెరికాతో ఉన్న అన్ని రకాల దౌత్య , పరోక్ష చర్చల మార్గాలను పూర్తిగా మూసివేస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది. పశ్చిమాసియాలో శాంతి ప్రయత్నాలకు తెరపడింది. ఇరాన్ ప్రభుత్వ అధికారిక మీడియా సంస్థ 'టెహ్రాన్ టైమ్స్' వెల్లడించిన సమాచారం ప్రకారం, అమెరికాతో జరుగుతున్న అన్ని రకాల సంభాషణలను ఇరాన్ నిలిపివేసింది. రెండు దేశాల మధ్య సందేశాల మార్పిడికి కూడా స్వస్తి పలికినట్లు 'ఎక్స్' వేదికగా స్పష్టం చేసింది. భారత కాలమానం ప్రకారం బుధవారం తెల్లవారుజామున 5:30 గంటలకు (అమెరికా కాలమానం ప్రకారం మంగళవారం రాత్రి 8 గంటలు) ట్రంప్ విధించిన గడువు ముగియనుంది. ఈ గడువులోగా హర్మూజ్ జలసంధిని తెరవకపోతే ఇరాన్‌లోని వంతెనలు, విద్యుత్ కేంద్రాలను నేలమట్టం చేస్తామని, ఇరాన్ నాగరికతను తుడిచిపెడతామని ట్రంప్ చేసిన హెచ్చరికల నేపథ్యంలో ఇరాన్ ఈ తీవ్ర నిర్ణయం తీసుకుంది. ఈజిప్టు, పాకిస్థాన్, తుర్కియే వంటి దేశాల మధ్యవర్తిత్వంలో ఇప్పటివరకు సాగిన చర్చలు ఒక్కసారిగా విఫలమయ్యాయి. శాంతి చర్చల్లో భాగంగా ప్రతిపాదించిన 45 రోజుల తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఇరాన్ ముందే తిరస్కరించిన సంగతి తెలిసిందే. ఏకంగా చర్చల ద్వారాలనే మూసివేయడం యుద్ధం అనివార్యమని సంకేతాలిస్తోంది. "ట్రంప్ హెచ్చరికలకు భయపడే ప్రసక్తే లేదు, అమెరికా దాని మిత్రదేశాలు కూడా మా ప్రతిఘటన దెబ్బను రుచి చూడాల్సి ఉంటుంది" అని ఇరాన్ ఘాటుగా స్పందించింది. దౌత్య మార్గాలు మూసుకుపోవడంతో, ఇప్పుడు రెండు దేశాల మధ్య కేవలం ఆయుధాలే మాట్లాడతాయనే భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. అమెరికా తన దాడులను ప్రారంభించడమే తరువాయి అన్నట్లుగా పశ్చిమాసియా గగనతలం యుద్ధ విమానాల మోతతో అల్లకల్లోలంగా మారింది.

సంక్షేమ మనసర్కార్
Follow: manasarkar
బుధవారం | హైదరాబాద్
08.04.2026
www.manasarkar.com



# జల సంరక్షణే భావితరాల నిధి

**కానూరు(ఏడీఎన్ఎన్) :**

భవిష్యత్తు తరాలకు సురక్షితమైన నీటిని అందించడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ జల సంరక్షణను ఒక సామాజిక బాధ్యతగా తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పిలుపునిచ్చారు. కానూరులోని ఏపీఎస్ఐఆర్డీ భవనంలో పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన వర్క్ షాపును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జల్ జీవన్ మిషన్ 2.0లో భాగంగా నీటి సంరక్షణకు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని స్పష్టం చేశారు. జలమే జీవమని, పరిమితంగా ఉన్న నీటి వనరులను కాపాడుకోకపోతే భావితరాలకు తీరని అన్యాయం చేసినట్లేనని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కృష్ణా, గోదావరి, పెన్నా వంటి నదుల ప్రాముఖ్యతను గుర్తు చేస్తూ, భూగర్భ జలాలు అడుగంటిపోవడం వంటి సవాళ్లను అధిగమించేందుకు వాటర్ షెడ్ల పునరుద్ధరణకు ప్రణాళికలు రచిస్తున్నట్లు వెల్లడించారు.ప్రధాని మోదీ ఆశయాలకు అనుగుణంగా, ముఖ్యమంత్రి మార్గదర్శకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా '100 రోజుల నీటి వినియోగ డ్రైవ్'ను చేపడుతున్నట్లు పవన్ కళ్యాణ్ ప్రకటించారు. ఈ నెల 6 నుంచి జూలై 14 వరకు సాగే ఈ డ్రైవ్ ద్వారా భూగర్భ జలాల పెంపు, వర్షపు నీటిని ఒడిసి పట్టడం మరియు నీటి పునర్వినియోగంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడమే లక్ష్యమని వివరించారు. ప్రకృతిని కాపాడుకుంటేనే మన భవిష్యత్తు సురక్షితంగా ఉంటుందని ఆయన ఉద్బోధించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్ కుమార్, ఏపీ ఎస్ఐఆర్డీ కమిషనర్ ముత్యాల రాజు, అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ మరియు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.




# ఏబీఎన్ కార్యాలయం ముట్టడి

**హైదరాబాద్(ఏడీఎన్ఎన్) :**

ఏబీఎన్ ఆంధ్రజ్యోతి అధినేత వేమూరి రాధాకృష్ణ అనుసరిస్తున్న రాతలపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. హైదరాబాద్‌లోని ఏబీఎన్ ప్రధాన కార్యాలయం వద్ద సోమవారం ఉద్రిక్తత చోటుచేసుకుంది. రాధాకృష్ణ రాస్తున్న కథనాలు విలువలు లేనివని, ముఖ్యంగా మహిళలను కించపరిచేలా ఉన్నాయని ఆరోపిస్తూ వైసీపీ నేతలు భారీ ఎత్తున కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ ధర్నాలో యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ , మాజీ మంత్రులు అంబటి రాంబాబు, ఆదిమూలపు సురేష్, మేరుగ నాగార్జున, విశ్వరూప్, కారుమూరి నాగేశ్వరరావులతో పాటు లక్ష్మీ పార్వతి, శ్రీకాంత్ రెడ్డి, మార్గాని భరత్ వంటి కీలక నేతలు పాల్గొన్నారు. వారంతా కార్యాలయం ముందు బైఠాయించి రాధాకృష్ణకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ నిరసనను తెలిపారు.ఈ సందర్భంగా వైసీపీ నేతలు మాట్లాడుతూ, రాధాకృష్ణ రాతలు జర్నలిజం చరిత్రలోనే ఒక మాయని మచ్చ అని మండిపడ్డారు. రాజకీయ లబ్ధి కోసం మహిళలను అడ్డం పెట్టుకుని వారిని అవమానించేలా కథనాలు రాయడం దారుణమని ధ్వజమెత్తారు. ఇది జర్నలిజం కాదని, పక్కా 'బ్రోకరిజం' అని, చంద్రబాబు అజెండాను అమలు చేయడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. అనుచిత రాతలకు గానూ మహిళా లోకానికి రాధాకృష్ణ వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాధాకృష్ణను ఒక "రాజకీయ వ్యభిచారి"గా అభివర్ణిస్తూ, ఇలాంటి బెదిరింపు రాతలకు తాము భయపడమని నేతలు స్పష్టం చేశారు. ఆందోళన తీవ్రమవ్వడంతో ఏబీఎన్ కార్యాలయం వద్ద పోలీసులు భారీగా మోహరించారు.

# ముగిసిన ఆరోగ్యశ్రీ ఆస్పత్రుల సమ్మె

**అమరావతి(ఏడీఎన్ఎన్) :**

గత వారం రోజులుగా ఎన్టీఆర్ వైద్యసేవ (ఆరోగ్యశ్రీ) నెట్‌వర్క్ ఆస్పత్రులు చేపట్టిన సమ్మె ఎట్టకేలకు ముగిసింది. ప్రభుత్వంతో జరిపిన చర్చలు సఫలం కావడంతో, మంగళవారం నుంచి సేవలను పునఃప్రారంభిస్తున్నట్లు స్పెషాలిటీ ఆస్పత్రుల అసోసియేషన్ ప్రకటించింది. ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా నిలిచిపోయిన ఉచిత వైద్య సేవలు మళ్లీ అందుబాటులోకి రానున్నాయి.పథకం కింద అందించిన వైద్యానికి సంబంధించి ప్రభుత్వం దీర్ఘకాలంగా బకాయిలను విడుదల చేయకపోవడంతో ఆస్పత్రుల యాజమాన్యాలు సమ్మెకు దిగిన సంగతి తెలిసిందే. దీనిపై స్పందించిన ప్రభుత్వం, అసోసియేషన్ ప్రతినిధులతో చర్చలు జరిపింది. రాబోయే 10 రోజుల్లో రూ. 1000 కోట్ల బకాయిలను చెల్లిస్తామని ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇచ్చింది. చర్చల వివరాలు, ప్రభుత్వం ఇచ్చిన హామీలతో కూడిన 'మినిట్స్' ప్రత్యామ్నాయాన్ని కూడా అధికారులు అసోసియేషన్‌కు పంపినట్లు సమాచారం. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు 10 రోజుల్లోపు నిధులు విడుదల చేయాలని ఆస్పత్రుల అసోసియేషన్ కోరింది. ఒకవేళ నిర్ణీత గడువులోగా బకాయిలు చెల్లించని పక్షంలో, మరోసారి ఎన్టీఆర్ వైద్య సేవలను నిలిపివేస్తామని యాజమాన్యాలు హెచ్చరించాయి. ప్రస్తుతానికి ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సమ్మెను విరమిస్తున్నట్లు వారు స్పష్టం చేశారు.సమ్మె విరమణ ప్రకటనతో ఎన్టీఆర్ వైద్యసేవ పథకం కింద అందించే అన్ని రకాల శస్త్రచికిత్సలు, డయాలసిస్ , అత్యవసర వైద్య సేవలు సాధారణ స్థితికి చేరుకున్నాయి. గత వారం రోజులుగా ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్న పేద రోగులకు ఈ పరిణామం పెద్ద ఊరటనిచ్చింది.

# దళిత విద్యార్థినిపై కేసు నమోదు దారుణం

**తాడేపల్లి(ఏడీఎన్ఎన్) :**

కృష్ణా జిల్లా పామర్రుకు చెందిన దళిత విద్యార్థిని సుప్రియపై హత్యాయత్నం కేసు నమోదు చేయడంపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో సుప్రియ ఆమె కుటుంబ సభ్యులు జగన్‌ను మంగళవారం కలిసి కూటమి ప్రభుత్వంలో తమకు ఎదురవుతున్న వేధింపులను వివరించారు. తన తండ్రిపై అక్రమంగా నేరం మోపడాన్ని ప్రశ్నించినందుకు పామర్రు సీఐ శుభాకర్, ఎస్సై భాస్కర్ తనను స్టేషన్‌కు పిలిపించి దారుణంగా కొట్టారని, పైగా తనపైనే హత్యాయత్నం కేసు పెట్టి రిమాండ్‌కు పంపారని



సుప్రియ జగన్ వద్ద కన్నీటి పర్యంతమయ్యారు. బీఎస్సీ నర్సింగ్ చదువుతున్న దళిత యువతి పట్ల పోలీసులు ఇంత అమానుషంగా వ్యవహరించడం ప్రజాస్వామ్యానికే గొడ్డలి పెట్టు అని జగన్ మండిపడ్డారు. సుప్రియ కుటుంబానికి వైసీపీ పూర్తి స్థాయిలో అండగా ఉంటుందని జగన్ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. బాధిత విద్యార్థినిపై పెట్టిన అక్రమ కేసులను ఎదుర్కోవడానికి పార్టీ లీగల్ సెల్ ద్వారా ఉచిత న్యాయ సహాయం అందిస్తామని స్పష్టం చేశారు. ఈ దారుణ ఘటనను జాతీయ ఎస్సీ కమిషన్ , జాతీయ మానవ హక్కుల కమిషన్ దృష్టికి తీసుకెళ్లాలని పామర్రు వైసీపీ ఇన్‌ఛార్జ్ కైలే అనిల్‌కుమార్‌కు ఆదేశాలు జారీ చేశారు. అంతేకాకుండా, విధి నిర్వహణలో అతిగా ప్రవర్తించిన సీఐ శుభాకర్, ఎస్సై భాస్కర్‌లపై హైకోర్టులో ప్రైవేట్ కేసు దాఖలు చేయాలని, బాధ్యులైన అధికారులకు శిక్ష పడేలా చూస్తామని భరోసా ఇచ్చారు. న్యాయం జరిగే వరకు తమ పార్టీ సుప్రియ కుటుంబం వెంటే ఉంటుందని జగన్ పునరుద్ఘాటించారు.

# రవాణా శాఖ అధికారి చొరవపై లోకేశ్ ప్రశంసలు

**అమరావతి(ఏడీఎన్ఎన్) :**

ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల్లో వరుసగా జరుగుతున్న అగ్నిప్రమాదాల నేపథ్యంలో, ప్రయాణికులకు భద్రతపై అవగాహన కల్పించేందుకు రవాణా శాఖ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా కృష్ణా జిల్లా ఉయ్యూరులో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సిద్ధిఖ్ ప్రయాణికులకు అందించిన సూచనలు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. ఒక ప్రైవేట్ ట్రావెల్స్ బస్సును ఆపిన ఎంవీఐ సిద్ధిఖ్, లోపల ఉన్న ప్రయాణికులతో నేరుగా మాట్లాడారు. బస్సులో అగ్నిప్రమాదం సంభవించినప్పుడు ఎలా వ్యవహరించాలో ఆయన వివరించారు. "ప్రమాదం జరి





గినప్పుడు విలువైన వస్తువుల కోసం వెతుకుతూ సమయాన్ని వృథా చేయకండి. ప్రాణాలు కాపాడుకోవడం ముఖ్యం, కాబట్టి వెంటనే బస్సు దిగి సురక్షిత ప్రాంతానికి వెళ్లండి," అని ఆయన సూచించారు. అలాగే ప్రతి ప్రయాణికుడు బస్సు ఎక్కిన వెంటనే ఎమర్జెన్సీ డోర్ ఎక్కడ ఉందో ముందే గమనించాలని కోరారు.ఈ అవగాహన కార్యక్రమానికి సంబంధించిన వీడియోపై రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ సానుకూలంగా స్పందించారు. ఈ వీడియోను తన 'ఎక్స్' ఖాతాలో పంచుకుంటూ, ప్రయాణికుల భద్రత విషయంలో సదరు అధికారి చూపిన చొరవను కొనియాడారు. ఇలాంటి అవగాహన కార్యక్రమాలు ఎంతో మంది ప్రాణాలను కాపాడుతాయని ఆయన పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని కోరుతూ, ఈ సమాచారాన్ని స్నేహితులు, కుటుంబ సభ్యులకు చేరవేయాలని లోకేశ్ విజ్ఞప్తి చేశారు.

# లిక్కర్ స్కామ్ కేసులో రాజ్ కేసిరెడ్డికి బెయిల్

**అమరావతి (ఏడీఎన్ఎన్) :**

ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం సృష్టించిన మద్యం కుంభకోణం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా (ఏ1) ఉన్న రాజ్ కేసిరెడ్డికి రాష్ట్ర హైకోర్టు తాజాగా షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. గతేడాది ఏప్రిల్ 25న సిట్ అధికారుల చేతిలో అరెస్టయిన ఆయన, గత ఏడాది కాలంగా జ్యుడీషియల్ కస్టడీలో జైలులోనే ఉన్నారు. గతంలో ఆయన తరపు న్యాయవాదులు పలుమార్లు బెయిల్ కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ కోర్టు వాటిని తిరస్కరించింది, అయితే తాజా విచారణలో హైకోర్టు ఆయనకు ఈ ఊరటనిచ్చింది. రాజ్ కేసిరెడ్డిపై మద్యం సరఫరాలో గుత్తాధిపత్యం చలాయించడం, వివిధ డిస్టిలరీల నుంచి భారీగా ముడుపులు వసూలు చేయడం , ప్రైవేట్ వ్యక్తులతో




కుమ్మక్కై ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టడం వంటి తీవ్రమైన ఆరోపణలు ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో ఏపీఎస్‌బీసీఎల్ మద్యం కొనుగోళ్ల ప్రక్రియను ఇతను ప్రభావితం చేసినట్లు ఏసీబీ, సీఐడీ దర్యాప్తులో తేలింది. ఈ భారీ స్కామ్‌లో ఏపీఎస్‌బీసీఎల్ మాజీ ఎండీ వాసుదేవ రెడ్డితో పాటు పలువురు ఐఏఎస్ అధికారులు, ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు , రాజకీయ నేతలు కూడా నిందితులుగా ఉన్నారు. ప్రస్తుతం బెయిల్ లభించినప్పటికీ, దర్యాప్తుకు సహకరించాలని , సాక్షులను ప్రభావితం చేయకూడదని కోర్టు ఆయనకు స్పష్టమైన షరతులు విధించింది.

# రాజీనామాకు సిద్ధం : ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

**వైఎస్సార్ జిల్లా(ఏడీఎన్ఎన్) :**

ఆంధ్రప్రదేశ్‌లోని అధికార కూటమి ప్రభుత్వానికి సొంత పార్టీ ఎమ్మెల్యే నుంచే ఊహించని నిరసన వ్యక్తమైంది. జమ్మలమడుగు బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి ప్రభుత్వంపై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తూ, తన పదవికి రాజీనామా చేయడానికి కూడా సిద్ధమని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ పరిణామం రాజకీయ వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చకు దారితీసింది.జమ్మలమడుగులో మంగళవారం జరిగిన ఒక కార్యక్రమంలో ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పనితీరుపై ధ్వజమెత్తారు. "ప్రభుత్వంలో ఏ పనులూ సాగడం లేదు. గండికోట నిర్వాసితులకు పరిహారం అందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. ఇతర శాఖల్లోనూ



ఫైళ్లు కదలడం లేదు. ప్రజలకు మేలు చేయలేనప్పుడు ఈ ప్రభుత్వం ఎందుకు?," అంటూ ఆయన సూటిగా ప్రశ్నించారు. ప్రజల సమస్యలు పరిష్కారం కానప్పుడు ఎమ్మెల్యేగా కొనసాగడం కంటే రాజీనామా చేయడమే ఉత్తమమని ఆయన అభిప్రాయపడ్డారు. తనకు పదవుల మీద వ్యామోహం లేదని ఆదినారాయణరెడ్డి స్పష్టం చేశారు. ఇప్పటికే నాలుగు సార్లు ఎమ్మెల్యేగా పనిచేశానని గుర్తు చేస్తూ, పార్టీలోనే ఉంటూ ఎమ్మెల్యే పదవిని వదులుకోవడానికి వెనుకాడబోనని ప్రకటించారు. రాజీనామా అస్త్రాన్ని సంధించడం ద్వారా తన నియోజకవర్గ సమస్యల పట్ల ప్రభుత్వ వైఖరిని ఆయన ఎండగట్టారు.గతంలోనూ కూటమి పాలనపై ఆయన చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమైన నేపథ్యంలో, తాజా రాజీనామా కామెంట్స్ కూటమి నేతల్లో కలవరం రేపుతున్నాయి. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. ఈ వ్యవహారంపై కూటమి అగ్ర నాయకత్వం ఎలా స్పందిస్తుందనేది ఆసక్తికరంగా మారింది.

# రోడ్డు ప్రమాదాలకు మానవ తప్పిదాలే కారణం

**అమరావతి (ఏడీఎన్ఎన్) :**

రాష్ట్రంలో ఇటీవల కర్నూలు, మార్కాపురం, మారేడుమిల్లి ప్రాంతాల్లో జరిగిన వరుస రోడ్డు ప్రమాదాల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఉన్నతాధికారులతో కలిసి బస్సు ప్రమాదాల నివారణ , ప్రయాణికుల భద్రతపై కీలక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జరిగిన ప్రమాదాలకు ప్రధానంగా మానవ తప్పిదాలే కారణమని ప్రాథమిక విచారణలో తేలిందని స్పష్టం చేశారు. ప్రయాణికుల భద్రత తమ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని, రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు రవాణా శాఖ పరంగా అన్ని రకాల కఠిన చర్యలు చేపడుతున్నట్లు మంత్రి వెల్లడించారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 16 కీలక ప్రాంతాల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి నిరంతరం వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నామని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠినంగా వ్యవహరిస్తున్నామని పేర్కొన్నారు.గత పది రోజుల్లోనే రవాణా శాఖ అధికా





రులు రాష్ట్రవ్యాప్తంగా 10 వేల వాహనాలను తనిఖీ చేశారని, వీటిలో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న వాహనాలతో పాటు ఇతర రాష్ట్రాల్లో రిజిస్టర్ అయి ఏపీలో నిబంధనలు అతిక్రమిస్తున్న వాహనాలను సీజ్ చేసినట్లు మంత్రి వివరించారు. ప్రైవేట్ ట్రావెల్స్ యాజమాన్యాలు కూడా ప్రయాణికుల రక్షణ పట్ల బాధ్యతగా ఉండాలని, వాహనాల ఫిట్‌నెస్ , డ్రైవర్ల పనితీరుపై నిరంతరం నిఘా ఉంచాలని ఆయన ఆదేశించారు. ముఖ్యంగా 300 కిలోమీటర్ల కంటే ఎక్కువ దూరం ప్రయాణించే బస్సుల్లో ఖచ్చితంగా ఇద్దరు డ్రైవర్లు ఉండాలని, డ్రైవర్ల అలసట కారణంగానే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు.ప్రయాణికుల భద్రతను మెరుగుపరిచేందుకు ఆధునిక సాంకేతికతను జోడిస్తున్నట్లు మంత్రి ఈ సందర్భంగా ప్రకటించారు. డ్రైవర్ల ఏకాగ్రతను, వారి కదలికలను నిరంతరం పర్యవేక్షించేందుకు బస్సుల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ , ఆధారిత కెమెరాలను ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. దీనివల్ల డ్రైవర్లు నిద్రలోకి జారినా లేదా అప్రమత్తత కోల్పోయినా వెంటనే గుర్తించే అవకాశం ఉంటుందని వివరించారు. అలాగే, ప్రైవేట్ ట్రావెల్స్ రంగానికి ఊరటనిచ్చేలా త్వరలోనే బస్సు సీట్లపై విధిస్తున్న టాక్సేషన్‌ను తగ్గించేందుకు ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు. నిబంధనలను అతిక్రమించి ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటమాడితే ఎంతటి వారైనా వదిలిపెట్టబోమని ఆయన హెచ్చరించారు.

# గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది..

**విజయవాడ (ఏడీఎన్ఎన్) :**

ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడంపై మాజీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి అనూహ్య రీతిలో స్పందించారు. ఈ నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేస్తూనే, అమరావతిని ఆమోదించినందుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు , ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి సోషల్ మీడియా వేదికగా మంగళవారం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కుల, మత, జాతి భేదాలకు అతీతంగా అమరావతిలో ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలను నిర్మించాలని ఆయన కోరారు. అయితే, కేవలం నిర్ణయం తీసుకోవడం ఒక ఎత్తు అయితే, దానిని క్షేత్రస్థాయిలో అమలు చేయడం అసలైన సవాలు అని పేర్కొన్న వి



జయసాయిరెడ్డి.. గతంలో వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు కూడా అమరావతిని నిర్లక్ష్యం చేశారంటూ అసంతృప్తి వ్యక్తం చేయడం రాజకీయ వర్గాల్లో పెను సంచలనంగా మారింది.రాజధాని నిర్మాణ బాధ్యతను ప్రస్తుత ప్రభుత్వం సమర్థవంతంగా తీసుకోవాలని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ముందుకు సాగాలని ఆయన సూచించారు. విజయసాయిరెడ్డి చేసిన ఈ ట్వీట్ ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. మరోవైపు, కేంద్ర గెజిట్ విడుదలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేస్తూ.. ఇది ఐదేళ్లుగా పోరాటం చేస్తున్న అమరావతి రైతుల , ఆంధ్రప్రదేశ్ ప్రజల సాధించిన గొప్ప విజయమని కొనియాడారు. రాజధానిగా అమరావతికి చట్టబద్ధమైన ముద్ర పడటంతో, ఇకపై నిర్మాణ పనుల్లో మరింత వేగం పెరుగుతుందని రాష్ట్ర ప్రభుత్వం ధీమా వ్యక్తం చేస్తోంది. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయంతో అమరావతి భవితవ్యంపై ఉన్న సందిగ్ధత పూర్తిగా తొలగిపోయిందని విశ్లేషకులు భావిస్తున్నారు.



# ఇది చారిత్రక విజయం

**అమరావతి(ఏడీఎన్ఎన్) :**

ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి సంబంధించి గెజిట్ నోటిఫికేషన్ విడుదల కావడంపై హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భాన్ని రాష్ట్ర ప్రజలందరికీ ఒక చారిత్రక విజయ క్షణంగా ఆయన అభివర్ణించారు. అమరావతి కేవలం ఒక నగరం మాత్రమే కాదని, అది ఆంధ్రుల ఆత్మగౌరవానికి , భావి తరాల భవిష్యత్తుకు ప్రతీక అని ఆయన పేర్కొన్నారు. రాజధాని కోసం భూములిచ్చిన రైతుల త్యాగానికి, ఇన్నాళ్లుగా ప్రజలు పెట్టుకున్న ఆశలకు నేడు న్యాయం జరిగిందని, మనందరం కలిసి అమరావతిని ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దుదామని పిలుపునిచ్చారు.రాజధాని చిరకాల స్వప్నాన్ని సాకారం చేయడంలో కీలక పాత్ర పోషించిన భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా , ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడులకు బాలకృష్ణ తన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. వీరితో పాటు ఈ బిల్లుకు మద్దతు తెలిపిన అన్ని పార్టీల సభ్యులకు ధన్యవాదాలు తెలుపుతూ, అమరావతి పునర్నిర్మాణం ద్వారా రాష్ట్ర అభివృద్ధి మళ్లీ పట్టాలెక్కుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.




# రాధాకృష్ణవి బ్రోకర్ రాతలు...

**తిరుపతి(ఏడీఎన్ఎన్) :**

ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఎండీ వేమూరి రాధాకృష్ణ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు , వారి కుటుంబ సభ్యులపై చేస్తున్న అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ తిరుపతిలో వైసీపీ శ్రేణులు కదం తొక్కాయి. టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి, మాజీ మంత్రి ఆర్కే రోజా నేతృత్వంలో చిత్తూరు జిల్లా నేతలు భారీ ఎత్తున ఆందోళన నిర్వహించి, రోడ్డుపై ఆంధ్రజ్యోతి పత్రికలను దహనం చేశారు. ఈ క్రమంలో పోలీసులు వైసీపీ నేతలను అడ్డుకోవడంతో అక్కడ తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. రాధాకృష్ణ చేస్తున్నది జర్నలిజం కాదని, పక్కా 'బ్రోకరిజం' అని ధ్వజమెత్తిన ఆర్కే రోజా, మహిళల గురించి తప్పుగా రాస్తే ఆంధ్రజ్యోతి కార్యాలయాలను తగలబెట్టడానికి కూడా వెనకాడబోమని హెచ్చరించారు. డొక్కు సైకిల్‌పై వచ్చిన వ్యక్తి చంద్రబాబుకు బ్రోకర్‌గా మారి వేల కోట్లు ఎలా సంపాదించారో అందరికీ తెలుసని ఆమె ఘాటుగా విమర్శించారు. చంద్రబాబును 'రాయలసీమ ద్రోహి'గా అభివర్ణిస్తూ, రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ కోసం రూ. 2 వేల కోట్లు ఖర్చు చేయలేని వ్యక్తి, అమరావతి కోసం రూ. 2 లక్షల కోట్లు ఎలా ఖర్చు చేస్తారని ప్రశ్నించారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డితో చీకటి ఒప్పందాలు చేసుకుని రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టారని ఆరోపించారు. 87 శాతం పూర్తయిన రాయలసీమ పథకాన్ని నిలిపివేయడం అంటే ఈ ప్రాంత ప్రజల గొంతు కోయడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పాదయాత్రలు, మహా ఉద్యమాల ద్వారా ప్రజల్లోకి వెళ్తామని స్పష్టం చేస్తూ, తమపై తప్పుడు కూతలు కూయిస్తే చూస్తూ ఊరుకోమని, తాము తిట్టడం మొదలుపెడితే కూటమి నేతలు రోడ్లపై తిరగలేరని రోజా హెచ్చరించారు.





# దేవదాయ శాఖలో అవినీతి తిమింగలాలపై ఏసీబీ పంజా

**తాడేపల్లి(ఏడీఎన్ఎన్) :**

ఆంధ్రప్రదేశ్ దేవదాయ శాఖలో అవినీతి తిమింగలాలపై అవినీతి నిరోధక శాఖ ఉక్కుపాదం మోపింది. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శాంతిని ఏసీబీ అధికారులు మంగళవారం అరెస్ట్ చేశారు. గత కొంతకాలంగా ఆమెపై వస్తున్న వరుస అవినీతి ఫిర్యాదుల నేపథ్యంలో, పక్కా ఆధారాలతో రంగంలోకి దిగిన ఏసీబీ బృందాలు ఈ భారీ ఆపరేషన్ నిర్వహించాయి. మంగళవారం ఉదయం నుంచే తాడేపల్లిలోని ఆమె నివాసంతో పాటు, ఆమెకు అత్యంత సన్నిహితంగా ఉన్న వ్యక్తులు మరియు వివిధ ప్రాంతాల్లోని కార్యాలయాల్లో ఏకకాలంలో సోదాలు చేపట్టారు. సుమారు 10 గంటల పాటు నిరంతరాయంగా సాగిన ఈ తనిఖీల్లో అధికారులే విస్తుపోయేలా భారీగా అక్రమ ఆస్తులు వెలుగులోకి వచ్చాయి.ఈ సోదాల్లో భాగంగా అధికారులు పెద్ద మొత్తంలో బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు వివిధ ప్రాంతాల్లో ఉన్న విలువైన భూములు, విలాసవంతమైన ఇళ్లు, ఖరీదైన ప్లాట్లకు సంబంధించిన ఒరిజినల్ డాక్యుమెంట్లను ఏసీబీ సీజ్ చేసింది. బహిరంగ మార్కెట్లో ఈ స్థిరాస్తుల విలువ కోట్లాది రూపాయలు ఉంటుందని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. కేవలం ఆస్తులే కాకుండా, ఆమెకు సంబంధించిన వివిధ బ్యాంక్ ఖాతాలు, లాకర్లు , ఇతర రూపాల్లో చేసిన పెట్టుబడులకు సంబంధించిన కీలక పత్రాలను కూడా అధికారులు సేకరించారు. భక్తుల సొమ్మును, ఆలయ భూములను సంరక్షించాల్సిన బాధ్యతాయుతమైన ఉన్నత పదవిలో ఉండి, తన అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఇంతలా అక్రమార్జనకు పాల్పడటంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.సోదాలు ముగిసిన తర్వాత , తాడేపల్లిలోని ఆమె నివాసం వద్దే శాంతిని ఏసీబీ అధికారులు అధికారికంగా అదుపులోకి తీసుకున్నారు. తర్వాత వైద్య పరీక్షలు నిర్వహించి, రాత్రి వేళ ఆమెను ఏసీబీ ప్రత్యేక కోర్టుకు తరలించారు. కేసు తీవ్రత దృష్ట్యా విచారణ నిమిత్తం ఆమెను రిమాండ్‌కు కోరనున్నట్లు సమాచారం అందుతోంది. దేవదాయ శాఖలో ఒక అసిస్టెంట్ కమిషనర్ స్థాయి అధికారిణి ఇలా అక్రమాస్తుల కేసులో పట్టుబడటం శాఖాపరంగానే కాకుండా రాజకీయ వర్గాల్లోనూ పెను సంచలనంగా మారింది. ఈ భారీ అవినీతి నెట్‌వర్క్‌లో ఇంకా ఎవరెవరి ప్రమేయం ఉంది, ఎవరి సహకారంతో ఆమె ఈ ఆస్తులను కూడబెట్టింది అనే కోణంలో ఏసీబీ అధికారులు లోతుగా దర్యాప్తును ముమ్మరం చేశారు.

# కేరళ ప్రజలారా జాగ్రత్త



హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :

కేరళ అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి తెరపడనున్న తరుణంలో, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అక్కడ నిర్వహిస్తున్న ప్రచారంపై జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తెలంగాణ ప్రజలను కాంగ్రెస్ పార్టీ, రాహుల్ గాంధీ నిలువునా మోసం చేశారంటూ సోషల్ మీడియా వేదికగా ఆమె ఒక సంచలన వీడియోను విడుదల చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన 'ఆరు గ్యారంటీలను' అమలు చేయకుండా తెలంగాణ ప్రజలను గాలికొదిలేసిన రేవంత్ రెడ్డి, ఇప్పుడు అదే మోసపూరిత స్క్రిప్ట్ తో కేరళకు వస్తున్నారని ఆమె ఎద్దేవా చేశారు.తెలంగాణలో రైతు రుణమాఫీ, నిరుద్యోగులకు ఉద్యోగ కల్పన, రైతు సంక్షేమం వంటి ప్రధాన వాగ్దానాలన్నీ నేటికీ నెరవేరలేదని కవిత ఈ సందర్భంగా గుర్తు చేశారు. రాష్ట్రంలో విఫలమైన అదే హామీలను ఇప్పుడు కేరళ ఎన్నికల ప్రచారంలో రేవంత్ రెడ్డి ప్రయోగిస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ తరహాలో కేరళ ప్రజలు కూడా కాంగ్రెస్ బాధితులుగా మారొద్దని, అబద్ధపు హామీలతో ఓట్లు దండుకోవాలని చూస్తున్న వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆమె కేరళ ఓటర్లకు పిలుపునిచ్చారు. అభివృద్ధిని నిరంతరం కొనసాగించాలంటే పినరయి విజయన్ వంటి నిరూపితమైన నాయకత్వాన్నే ఎంచుకోవాలని కవిత సూచించారు. కేరళ సీఎంపై రేవంత్ రెడ్డి చేస్తున్న వ్యక్తిగత విమర్శలు కేవలం తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికేనని ఆమె కొట్టిపారేశారు. తెలంగాణలో కాంగ్రెస్ వైఫల్యాలను ఎత్తిచూపుతూ కేరళ ప్రజలను అప్రమత్తం చేస్తూ కవిత చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో పెను దుమారం రేపుతున్నాయి.



# భద్రత ప్రతి పౌరుడి ప్రథమ బాధ్యత

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :

హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ బాబు జగ్జీవన్ రామ్ భవన్‌లో 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా అగ్నిప్రమాదాల నివారణ, భద్రతా చర్యలపై అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నగరంలో పెరుగుతున్న అగ్నిప్రమాదాల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, భద్రతా నిబంధనలను పాటించడం ద్వారా ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించవచ్చని మంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు.అగ్నిప్రమాదం సంభవించినప్పుడు తీసుకోవాల్సిన తక్షణ చర్యలు, ఫైర్ ఎక్స్టింగ్విషర్ లు వినియోగంపై అగ్నిమాపక శాఖ అధికారులు ఈ సదస్సులో ప్రత్యక్ష ప్రదర్శనల ద్వారా అవగాహన కల్పించారు. అగ్నిమాపక భద్రత అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, పౌరులందరూ భాగస్వాములు కావాలని అధికారులు సూచించారు. ముఖ్యంగా బహుళ అంతస్తుల భవనాలు, వాణిజ్య సముదాయాల్లో ఫైర్ సేఫ్టీ ఆడిట్ నిర్వహించుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు.ఈ సదస్సులో హైదరాబాద్ జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్, ఫైర్ డీజీ విక్రమ్ మాన్ సింగ్, ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్, జేటీసీ రమేష్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అగ్నిమాపక శాఖను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని, నగర ప్రజల రక్షణే తమ ప్రాధాన్యతని మంత్రి స్పష్టం చేశారు.

# హైదరాబాద్‌లో భారీగా డ్రగ్స్ సీజ్



హైదరాబాద్:

నగరంలో డ్రగ్స్ విక్రయాలే లక్ష్యంగా సాగుతున్న ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. చిలకలగూడ, ఆదిభట్ల, సనత్ నగర్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన భారీ ఆపరేషన్‌లో సుమారు రూ.64.35 లక్షల విలువైన డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ అక్రమ రవాణాకు పాల్పడుతున్న ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో టాస్క్ ఫోర్స్ డీసీపీ వైభవ్ గైక్వాడ్ ఈ కేసు వివరాలను వెల్లడించారు.నిందితులు గతంలో వివిధ ఉద్యోగాల్లో ఉండేవారు. అనంతరం టైల్స్ వ్యాపారం ప్రారంభించి, అందులో భారీగా నష్టాలు రావడంతో సులభంగా డబ్బు సంపాదించేందుకు డ్రగ్స్ దందాలోకి దిగారు. డ్రగ్స్ తో పాటు రూ.50,000 నగదు, ఒక ద్విచక్ర వాహనం , మొబైల్ ఫోన్లను సీజ్ చేశారు.నిందితులు ఎక్కడి నుంచి డ్రగ్స్ తెస్తున్నారు, ఎవరికి విక్రయిస్తున్నారు అనే కోణంలో లోతైన విచారణ జరుపుతున్నట్లు డీసీపీ తెలిపారు.నగరంలో డ్రగ్స్ రహిత సమాజం కోసం పోలీసులు నిరంతరం నిఘా ఉంచుతున్నారని, యువత మత్తుకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని డీసీపీ వైభవ్ గైక్వాడ్ హెచ్చరించారు. డ్రగ్స్ సరఫరా లేదా విక్రయాల గురించి సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు. పట్టుబడిన నిందితులపై సంబంధిత సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు అధికారులు వెల్లడించారు.

# విపక్షాల గొంతు నొక్కడమే 'ప్రజాపాలనా'?

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :



పరిగి నియోజకవర్గంలో తమ భూములను కాపాడుకోవడానికి పోరాడుతున్న రైతులకు మద్దతుగా వెళ్తున్న బీఆర్ఎస్ నేతలను అక్రమంగా గృహ నిర్బంధం చేయడంపై ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ప్రభుత్వ తీరును ఆయన 'పిరికిపంద చర్య'గా అభివర్ణించారు. మాజీ మంత్రులు హరీశ్ రావు, సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మహేష్ రెడ్డి, నరేందర్ రెడ్డి, వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్ సహా పలువురు నేతలను అడ్డుకోవడం పూర్తిగా ప్రజాస్వామ్య విరుద్ధమని ఆయన ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు.అరెస్టులు, జైళ్లు, అక్రమ కేసులు బీఆర్ఎస్ నాయకులకు కొత్తేమీ కాదని కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమ కాలం నుండి ఇలాంటి ఎన్నో ఆంక్షలను తాము ఎదుర్కొన్నామని, ఎన్ని అడ్డంకులు సృష్టించినా ఎల్లప్పుడూ ప్రజల పక్షానే నిలబడతామని పునరుద్ఘాటించారు. రైతుల ఆవేదనను వినాల్సింది పోయి, వారికి మద్దతుగా వస్తున్న విపక్ష నేతలపై ఆంక్షలు విధించడం ద్వారా ప్రభుత్వం తన బలహీనతను బయటపెట్టుకుంటోందని ఆయన విమర్శించారు. అక్రమంగా నిర్బంధించిన నేతలను వెంటనే విడుదల చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.పరిగిలో ఇండస్ట్రియల్ పార్క్ పేరుతో రైతుల నుంచి బలవంతంగా భూములను సేకరించడాన్ని తక్షణమే నిలిపివేయాలని కేటీఆర్ ప్రభుత్వాన్ని కోరారు. రైతుల అనుమతి లేకుండా, వారిని ఇబ్బందులకు గురి చేస్తూ సాగిస్తున్న ఈ ప్రక్రియను బీఆర్ఎస్ తీవ్రంగా ప్రతిఘటిస్తుందని హెచ్చరించారు. అమాయక రైతుల పొట్ట కొట్టి పరిశ్రమలు కట్టాలనుకోవడం దుర్మార్గమని, బాధితులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదని ఆయన స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాల కోసం తాము ఎంతటి త్యాగానికైనా సిద్ధమని కేటీఆర్ ప్రకటించారు.రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ, విపక్షాల గొంతు నొక్కేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని కేటీఆర్ ఆరోపించారు. ఒకవైపు ప్రజాపాలన అని చెబుతూనే, మరోవైపు శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును కాలరాస్తున్నారని మండిపడ్డారు. భూసేకరణ విషయంలో రైతుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా, పోలీసు బలగాలతో భయభ్రాంతులకు గురిచేయడం పరిపాలన అనిపించుకోదని హితవు పలికారు. ఇండస్ట్రియల్ పార్క్ పేరుతో జరుగుతున్న ఈ భూదందాను ప్రజలందరూ గమనిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి కాలం దగ్గర పడిందని కేటీఆర్ హెచ్చరించారు. అన్నదాతల కన్నీరు ఊరికే పోదని, వారి శాపం ప్రభుత్వానికి తగులుతుందని వ్యాఖ్యానించారు. క్షేత్రస్థాయిలో రైతులు పడుతున్న ఇబ్బందులను స్వయంగా చూసేందుకు వెళ్తున్న నేతలను అడ్డుకోవడం ద్వారా ప్రభుత్వం ఏం సాధించాలనుకుంటోందని ప్రశ్నించారు. బాధితుల పక్షాన నిలబడేందుకు బీఆర్ఎస్ శ్రేణులు ఎప్పుడూ సిద్ధంగా ఉంటాయని, అణచివేత చర్యలకు తాము భయపడే ప్రసక్తే లేదని కేటీఆర్ తన ప్రకటనలో స్పష్టం చేశారు.

# అడ్డదారుల్లో ధాన్యం తరలిస్తే కఠిన చర్యలు

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :



రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను అత్యంత పారదర్శకగా నిర్వహిస్తున్నామని, అడ్డదారుల్లో ధాన్యాన్ని తరలించే ప్రయత్నం చేస్తే కఠిన చర్యలు తప్పవని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హెచ్చరించారు.ఆయన సూర్యాపేటలో మంగళవారం మాట్లాడుతూ, రాష్ట్ర సరిహద్దుల్లో ధాన్యం ఎగుమతులు, దిగుమతులపై కట్టుదిట్టమైన నిఘా ఉంచామని స్పష్టం చేశారు. ఈ రబీ సీజన్‌లో సుమారు 148 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నామని, అందులో 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా 8,251 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని, రైతులకు ఇబ్బంది కలగకుండా 16 కోట్ల గన్నీ బ్యాగులను అందుబాటులో ఉంచామని వెల్లడించారు. అంతకుముందు హుజూర్ నగర్ నియోజకవర్గ పరిధిలోని రామస్వామి గట్టు సమీపంలో నిర్మిస్తున్న ఐటీ కాలేజీ , మోడల్ కాలనీ పనులను మంత్రి పరిశీలించారు. 116 ఎకరాల్లో రూ. 145 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న 2,160 సింగిల్ బెడ్‌రూమ్ ఇళ్ల మోడల్ కాలనీ రాష్ట్రానికే గర్వకారణంగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో ఎలాంటి రాజకీయ జోక్యానికి, పైరవీలకు తావులేదని.. పూర్తిగా అర్హత ప్రాతిపదికనే ఎంపిక జరుగుతుందని స్పష్టం చేశారు. మొదటి విడతలో 1500 మందిని ఎంపిక చేశామని, జాబితాలో అనర్హులు ఉంటే నేరుగా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. ఈ నెలాఖరులోగా మోడల్ కాలనీని ప్రారంభించేందుకు పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

# బీఆర్ఎస్ యూట్యూబ్ ఛానళ్లతో జాగ్రత్త

నాగర్ కర్నూల్ (ఏడీఎన్ఎన్) :



అక్రమంగా సంపాదించిన వేల కోట్ల రూపాయలతో బీఆర్ఎస్ పార్టీ సుమారు 200 యూట్యూబ్ ఛానెళ్లను కొనుగోలు చేసిందని మంత్రి జూపల్లి కృష్ణారావు సంచలన ఆరోపణలు చేశారు. జిల్లా పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన డీసీసీ కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, సదరు యూట్యూబ్ ఛానెళ్లు, సోషల్ మీడియా వేదికల ద్వారా ప్రభుత్వంపై బీఆర్ఎస్ నిరంతరం అసత్య ప్రచారాలు చేస్తూ బురదజల్లుతోందని మండిపడ్డారు. ఈ అబద్ధపు ప్రచారాలను ప్రజలు నమ్మే ప్రమాదం ఉందని, కాంగ్రెస్ కార్యకర్తలు సోషల్ మీడియా వేదికగా వీరికి ధీటుగా సమాధానం చెప్పాలని పిలుపునిచ్చారు.దేశంలో అభివృద్ధి, సంక్షేమ ఫలాలను అందించిన ఏకైక పార్టీ కాంగ్రెస్ అని జూపల్లి కొనియాడారు. కేవలం మంత్రాలకు చింతకాయలు రాలవని, ఇంట్లో కూర్చుంటే అధికారం రాదని కార్యకర్తలకు హితవు పలికారు. 2029లో కేంద్రంలో రాహుల్ గాంధీ ప్రధాని కావాలన్నా, రాష్ట్రంలో మళ్లీ కాంగ్రెస్ అధికారంలోకి రావాలన్నా ప్రతి కార్యకర్త ఫీల్డ్ లెవెల్‌లోకి వెళ్లి పనిచేయాలని సూచించారు. పదవుల వెంట పరిగెత్తవద్దని, నిబద్ధతతో పనిచేసే వారిని వెతుక్కుంటూ పదవులే వస్తాయని ఈ సందర్భంగా ఆయన కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. పార్టీని బూత్ స్థాయి నుంచి బలోపేతం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని మంత్రి స్పష్టం చేశారు. ప్రతి కార్యకర్త రోజుకు కనీసం గంట సమయాన్ని వెచ్చించి ప్రజల సమస్యలను వినాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై వారికి అవగాహన కల్పించాలని కోరారు. ప్రభుత్వ సానుకూల అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం ద్వారానే ప్రతిపక్షాల కుట్రలను తిప్పికొట్టగలమని జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయం సాధించాలంటే కార్యకర్తలే కీలక భూమిక పోషించాలని ఆయన పిలుపునిచ్చారు.

# ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాల్సిందే

నాగర్ కర్నూల్ (ఏడీఎన్ఎన్) :




తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని మళ్లీ అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా కార్యకర్తలు సైనికుల్లా కష్టపడాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. నాగర్ కర్నూల్‌లో మంగళవారం జరిగిన జిల్లా కాంగ్రెస్ నేతల ప్రమాణ స్వీకారోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో బీఆర్ఎస్, బీజేపీలకు భవిష్యత్తు లేదని జోస్యం చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ పగ్గాల కోసం బావా బామ్మర్దులు కేటీఆర్, హరీశ్ రావు కొట్లాడుకుంటున్నారని విమర్శించారు. కులమతాలకు అతీతంగా పనిచేసే కాంగ్రెస్ పార్టీ గుండెకాయ గ్రామాల్లోనే ఉందని, క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని క్యాడర్‌కు దిశానిర్దేశం చేశారు.బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని రూ. 8 లక్షల కోట్ల అప్పుల్లో ముంచిందని, ఆ భారాన్ని ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం మోస్తోందని మహేశ్ కుమార్ గౌడ్ మండిపడ్డారు. సోనియా గాంధీ ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణ ఇచ్చారని, నీళ్లు, నిధులు, నియామకాల లక్ష్యం కాంగ్రెస్‌తోనే సాధ్యమని స్పష్టం చేశారు. ఇప్పటికే ఇందిరమ్మ ఇళ్లు, సన్న బియ్యం, ఉచిత ఆర్టీసీ ప్రయాణం వంటి హామీలను నెరవేరుస్తున్నామని గుర్తు చేశారు. అలాగే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 52 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత తమ ప్రభుత్వానిదేనని, ప్రతి పేదవాడికి రేషన్ కార్డు అందేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని త్వరితగతిన పూర్తి చేసి లక్షలాది ఎకరాలకు సాగునీరు అందిస్తామని టీపీసీసీ చీఫ్ హామీ ఇచ్చారు. ఈ ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ప్రధాని మోదీ పేదలకు చేసిందేమీ లేదని, రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం అసాధ్యమని కొట్టిపారేశారు. రాహుల్ గాంధీ పాదయాత్ర స్ఫూర్తితో ప్రజల సమస్యలను తెలుసుకుంటూ ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, రాజేశ్ రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# పేదల భూములపై ప్రభుత్వం దండయాత్ర

వికారాబాద్ జిల్లా

వికారాబాద్ జిల్లా పరిగి నియోజకవర్గంలో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు పేరుతో ప్రభుత్వం చేపట్టిన భూసేకరణపై మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దళితులు, పేద వర్గాల భూములపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎందుకు దండయాత్ర చేస్తోందో చెప్పాలని ఆయన సూటిగా ప్రశ్నించారు. భూములు కోల్పోతున్న బాధితులను పరామర్శించేందుకు వెళ్తున్న తరుణంలో తనను పోలీసులు అడ్డుకుని, గృహనిర్బంధం చేయడంపై ఆయన మండిపడ్డారు. హైదరాబాద్ చుట్టుపక్కల ఎక్కడ ఎస్సీ, ఎస్టీ, బీసీల అసైన్డ్ భూములు ఉంటే అక్కడ ఇండస్ట్రియల్ పార్కులంటూ నోటిఫికేషన్లు ఇచ్చి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని విమర్శించారు. ప్రజాస్వామ్యం, ప్రశ్నించే హక్కు అని మాట్లాడే రేవంత్ రెడ్డి ప్రభుత్వం, శాంతియుతంగా సమావేశం ఏర్పాటు చేసుకున్న రైతుల టెంట్లను పీకేయడం, మహిళలను అరెస్టు చేయడం 'ప్రజాపాలన' కాదని, ఇది 'భక్షక పాలన' అని హరీశ్ రావు ధ్వజమెత్తారు. నాడు ఇందిరమ్మ పంపిణీ చేసిన భూములను, నేటి ఇందిరమ్మ పాలనలో గద్దల్లా వాలి లాక్కోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనలన్నీ కేవలం భూముల చుట్టూనే తిరుగుతున్నాయని, మూసీ, హైడ్రా, లగచర్ల నుంచి పరిగి వరకు పేదల ఇళ్లు, భూములపైనే ప్రభుత్వం దాడులు చేస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో పరిశ్రమల కోసం ఇతర భూములు సిద్ధంగా ఉన్నా, సాగు భూములను సేకరించడం వెనుక భారీ కుట్ర ఉందని ఆయన విమర్శించారు.కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో ఎస్సీ, ఎస్టీలకు భూములపై పూర్తి హక్కులు కల్పిస్తామని, ఒకవేళ భూములను సేకరిస్తే పట్టా భూములతో సమానంగా పరిహారం చెల్లిస్తామని హామీ ఇచ్చిందని హరీశ్ రావు గుర్తు చేశారు. కానీ నేడు అందుకు విరుద్ధంగా, ఎకరాకు కోటి రూపాయల విలువ ఉన్న భూమిని కేవలం రూ. 10 లక్షలకో, రూ. 20 లక్షలకో గుంజుకుంటున్నారని ఆరోపించారు. పరిగిలో రైతులు తమ భూములు ఇవ్వలేమని కన్నీరుమున్నీరవుతున్నా ప్రభుత్వం కనికరించకపోవడం శోచనీయమన్నారు. అసెంబ్లీ స్పీకర్ ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లాలో ఈ రకమైన అన్యాయం జరగడం జిల్లా ప్రజలకు శాపంగా మారిందని ఆయన వ్యాఖ్యానించారు.తక్షణమే 22A నిషేధిత జాబితాను రివ్యూ చేసి ఎత్తివేయాలని, ఇండస్ట్రియల్ పార్క్ నోటిఫికేషన్‌ను ఉపసంహరించుకోవాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. పేదల నోట్లో మట్టి కొట్టే ప్రయత్నాలను తాము అడ్డుకుంటామని, రైతులకు వారి భూములు తిరిగి ఇచ్చే వరకు బీఆర్ఎస్ పోరాటం ఆపదని స్పష్టం చేశారు. పోలీసులు ఎంతమందిని మోహరించినా, తనను అడ్డుకోలేరని, బాధితులకు అండగా నిలిచేందుకు తాను ఖచ్చితంగా పరిగి వెళ్లి తీరుతానని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వ అణచివేత ధోరణిని ప్రజలు గమనిస్తున్నారని, రాబోయే రోజుల్లో దీనికి తగిన గుణపాఠం చెబుతారని హరీశ్ రావు పేర్కొన్నారు.



# జాతీయ ఐక్యతకు పరిరక్షకులు 'ఐఐఎస్'లు

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :

దేశ భద్రత, సంక్షోభ సమయాల్లో తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తూ గందరగోళం సృష్టించే శక్తుల కుట్రలను తిప్పికొట్టడంలో ఇండియన్ ఇన్ఫర్మేషన్ సర్వీస్ అధికారుల పాత్ర అత్యంత కీలకమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ఢిల్లీలోని కర్తవ్య భవన్‌లో శిక్షణ పొందుతున్న 2009, 2023, 2024 బ్యాచ్‌లకు చెందిన గ్రూప్‌ఏ ట్రైనీ అధికారులతో ఆయన మంగళవారం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఐఐఎస్ అధికారులు కేవలం సమాచార మాధ్యమకారులుగా మాత్రమే కాకుండా, జాతీయ ఐక్యతకు పరిరక్షకులుగా నిలవాలని సూచించారు.వేగంగా మారుతున్న ప్రస్తుత ప్రపంచంలో సమర్థవంతమైన కమ్యూనికేషన్ అనేది కేవలం పరిపాలనా సాధనం మాత్రమే కాదని, అది జాతీయ స్థిరత్వానికి , ప్రజల విశ్వాసానికి మూలస్తంభమని మంత్రి పేర్కొన్నారు. యుద్ధం చేయకుండానే సమాచార వ్యాప్తి ద్వారా శత్రువుల మనసులను ప్రభావితం చేయడంలో టీవీ, రేడియో సహా సోషల్ మీడియా వంటివి 'సైకలాజికల్ ఆపరేషన్స్' నిర్వహిస్తూ ముఖ్య భూమిక పోషిస్తాయన్నారు. బలాన్ని కాకుండా మేధస్సును ఉపయోగించి చేసే సమాచార యుద్ధంలో ఐఐఎస్ అధికారులు అగ్రభాగాన నిలబడాలని పిలుపునిచ్చారు.సోషల్ మీడియాలో ప్రజలను తప్పుదారి పట్టించే ఫేక్ న్యూస్ పెద్ద సవాలుగా మారిందని, వాటిని అధిగమించేందుకు అధికారులకు ఇచ్చే ప్రత్యేక శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని బండి సంజయ్ తెలిపారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ సమాచార సమగ్రతను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేంద్ర హోంశాఖ మీడియా విభాగం అదనపు డైరెక్టర్ జనరల్ రాజ్ కుమార్, ఐఐఎస్ కోర్స్ డైరెక్టర్ రష్మీ రోజా తుషార నాయర్ మరియు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# సురక్షిత డ్రైవింగ్ మీ ప్రాణాలకు రక్ష




హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :

రహదారి భద్రత నిబంధనలను విస్మరించి అజాగ్రత్తగా వాహనాలు నడిపి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి వాహనదారులకు హితవు పలికారు. ములుగు జిల్లా వెంకటాపురం మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన 'అరీవ్ అలైవ్' కార్యక్రమంలో ఎస్ఐబీ చీఫ్ సుమతితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరికీ సురక్షిత ప్రయాణమే అత్యంత ప్రధానమని, వాహనదారులు విధిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని కోరుతూ అందరితో ప్రమాణం చేయించారు.ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారు నడిపే వారు సీట్ బెల్ట్ పెట్టుకోవాలని డీజీపీ సూచించారు. రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్న వారిలో 75 శాతం మంది హెల్మెట్ లేకపోవడం వల్లే ప్రాణాలు కోల్పోతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా 18 నుంచి 40 ఏళ్ల మధ్య వయసు గల యువతే ఈ ప్రమాదాల బారిన పడుతున్నారని, డ్రైవింగ్ చేసేటప్పుడు సెల్‌ఫోన్ మాట్లాడటం వంటి ప్రాణాంతక అలవాట్లకు దూరంగా ఉండాలని హెచ్చరించారు.అంతకుముందు పామునూరు అటవీ ప్రాంతంలో పోలీస్ ఔట్ పోస్ట్, ఇంటలిజెన్స్ కోఆర్డినేషన్ సెంటర్‌ను డీజీపీ ప్రారంభించారు. తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణం వేగంగా జరగడం అభినందనీయమని, రహదారులు అభివృద్ధి చెందితేనే మారుమూల ప్రాంతాలు పురోగమిస్తాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చీఫ్ ఫారెస్ట్ కన్జర్వేటర్ సువర్ణ, సీఆర్పీఎఫ్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అటవీ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణం వల్ల ఇక్కడి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందుతాయని డీజీపీ శివధర్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఐపీఎల్ బెట్టింగ్ ఉచ్చులో పడొద్దు

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :

ఐపీఎల్ మ్యాచ్‌ల పేరుతో ఆన్‌లైన్ బెట్టింగ్ మోసాలు పెరిగిపోతున్నాయని, సోషల్ మీడియాలో వచ్చే నకిలీ ప్రిడిక్షన్లను నమ్మి మోసపోవద్దని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ ప్రజలను హెచ్చరించారు. ముఖ్యంగా 'ఎక్స్' , టెలిగ్రామ్ వంటి వేదికల్లో 'ఫేక్ క్రికెట్ ప్రిడిక్షన్' ఛానెళ్లు అమాయకులను లక్ష్యంగా చేసుకుని దందా చేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. టాస్ గెలుపు, మ్యాచ్ ఫలితాలను ముందే చెబుతామంటూ ఆశ చూపి బెట్టింగ్ ఉచ్చులోకి లాగుతున్నారని, కొంతమంది సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లు కూడా ఇటువంటి అసత్య ప్రచారాల్లో భాగస్వామ్యమవుతున్నారని సీపీ ఆందోళన వ్యక్తం చేశారు.ఈ మోసగాళ్లు తొలత యూజర్లను ఎన్‌రోల్ చేయించుకుని, ఆపై వివిధ బెట్టింగ్ యాప్‌ల లింకులను పంపి వారి సంపాదనను లూటీ చేస్తున్నారని సజ్జనార్ వివరించారు. నకిలీ ప్రిడిక్షన్లు, అక్రమ బెట్టింగ్ యాప్‌లపై హైదరాబాద్ సైబర్ క్రైమ్ విభాగం ఇప్పటికే కఠిన చర్యలు ప్రారంభించిందని తెలిపారు. ఇందులో భాగంగా ఇప్పటివరకు 494 పెయిడ్ అడ్వర్టైజ్‌మెంట్లను పోలీసులు బ్లాక్ చేశారని, సోషల్ మీడియాలో ఉన్న 129 ఫేక్ ప్రొఫైళ్లను తొలగించారని వెల్లడించారు. మోసపూరిత యాప్‌లు , వెబ్‌సైట్లపై నిరంతర నిఘా ఉంటుందని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు.సోషల్ మీడియాలో ఎక్కడైనా మోసపూరిత ప్రకటనలు కనిపిస్తే వెంటనే రిపోర్ట్ చేయాలని, ఒకవేళ ఎవరైనా సైబర్ మోసానికి గురైతే ఆలస్యం చేయకుండా '1930' హెల్ప్ లైన్ నంబర్‌కు ఫోన్ చేయాలని సీపీ సూచించారు. లేదా నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ (cybercrime.gov.in)లో ఫిర్యాదు చేయాలని కోరారు. ఐపీఎల్ సీజన్‌ను కేవలం వినోదంగా మాత్రమే చూడాలని, ఈజీ మనీ ఆశతో బెట్టింగ్‌ల జోలికి వెళ్లి జీవితాలను పాడు చేసుకోవద్దని సజ్జనార్ యువతకు హితవు పలికారు.



సంక్షేమ మనసర్కార్
Follow: manasarkar

బుధవారం | హైదరాబాద్
08.04.2026
www.manasarkar.com

## రాశి ఫలాలు

**08-04-2026 బుధవారం**

**మేషం:**
వృత్తి, వ్యాపారాల్లో కొత్త ఆలోచనలు ప్రవేశపెట్టి లాభాలు ఆర్జిస్తారు. సర్వత్రా మీ మాట చెల్లుబాటవుతుంది. ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉండడం వల్ల విలాసాల మీద ఖర్చు పెరుగుతుంది. స్వల్ప అనారోగ్యానికి అవకాశముంది. విదేశాల్లో ఉన్న పిల్లల నుంచి శుభ వార్తలు వింటారు. కుటుంబంతో ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొంటారు.

**వృషభం:**
ఉద్యోగంలో ఆశించిన భద్రత, స్థిరత్వం ఏర్పడతాయి. వ్యాపారాల్లో పెట్టుబడికి తగ్గ ప్రతిఫలం ఉంటుంది. వృత్తి జీవితంలో గుర్తింపు ఏర్పడుతుంది. ఆదాయానికి, ఆరోగ్యానికి ఇబ్బందేమీ ఉండకపోవచ్చు. కొన్ని ముఖ్యమైన కార్యకలాపాలను సకాలంలో పూర్తి చేస్తారు.

**మిథునం:**
ఉద్యోగంలో పనిభారం పెరిగినప్పటికీ ఆశించిన గుర్తింపు, ప్రతిఫలం లభిస్తాయి. వృత్తి జీవితంలో తీరిక లేని పరిస్థితి ఏర్పడుతుంది. ఆర్థిక లాభాలు బాగా పెరుగుతాయి. ముఖ్యమైన ప్రయత్నాలలో విజయం సాధిస్తారు. నిరుద్యోగులకు, అవివాహితులకు సమయం బాగా అనుకూలంగా ఉంది.

**కర్కాటకం:**
వృత్తి, ఉద్యోగాలు సజావుగా, సానుకూలంగా సాగిపోతాయి. అధికారుల వల్ల కొద్దిగా ఒత్తిడికి గురవుతారు. వ్యాపారాలు లాభసాటిగా సాగిపోతాయి. మంచి స్నేహ సంబంధాలు ఏర్పడతాయి. కొందరు బంధుమిత్రులతోడ్పాటుతో ముఖ్యమైన వ్యవహారాల్ని పూర్తి చేస్తారు.

**సింహం:**
ఆదాయం అనుకూలంగా ఉంటుంది. బాగా ఆలోచించి ఖర్చు చేయడం మంచిది. కొందరు మిత్రులకు ఆర్థికంగా సహాయం చేయడం జరుగుతుంది. ఇంటా బయటా పరిస్థితులు బాగా మెరుగ్గా ఉంటాయి. పెండింగులో ఉన్న ముఖ్యమైన పనులు పూర్తవుతాయి. ఉద్యోగంలో కొత్త ప్రాజెక్టులు చేతికి అందుతాయి.

**కన్య:**
ఉద్యోగంలో అధికారులకు, సహోద్యోగులకు ఆశించిన సహాయ సహకారాలు అందిస్తారు. ఆస్తి వివాదం ఒకటి పరిష్కారమవుతుంది. కొత్త ఉద్యోగ ప్రయత్నాలు సానుకూల పడతాయి. ఆదాయం, ఆరోగ్యాలు చాలావరకు నిలకడగా ఉంటాయి.

**తుల:**
ఉద్యోగంలో ప్రాధాన్యం పెరుగుతుంది. వృత్తి, వ్యాపారాల్లో బాగా కలిసి వస్తుంది. కొత్త ఉద్యోగ ప్రయత్నాలకు సానుకూల స్పందన లభిస్తుంది. ఆదాయానికి, ఆరోగ్యానికి ఢోకా ఉండదు. ఇష్టమైన మిత్రులతో విందు కార్యక్రమంలో పాల్గొంటారు. సామాజిక సహాయ కార్యక్రమాల్లో కీలక పాత్ర పోషిస్తారు.

**వృశ్చికం:**
వృత్తి, ఉద్యోగాల్లో బాధ్యతలు, లక్ష్యాలు పెరిగే సూచనలున్నాయి. వ్యాపారాలు లాభసాటిగా సాగి పోతాయి. ఒకటి రెండు వ్యక్తిగత సమస్యలకు ఆశించిన పరిష్కారం లభిస్తుంది. ఇతరుల పనుల కంటే సొంత పనుల మీద శ్రద్ధ పెట్టడం మంచిది. ఆర్థిక ప్రయత్నాలు చాలావరకు లాభిస్తాయి.

**ధనస్సు:**
ఉద్యోగంలో పదోన్నతికి అవకాశం ఉంది. వ్యాపారాల్లో సొంత నిర్ణయాలు అమలు చేసి లాభాలు గడిస్తారు. ఆర్థిక విషయాల్లో గ్రహ సంచారం చాలావరకు అనుకూలంగా ఉంది. ఆదాయం పెరిగే సూచనలున్నాయి. ఆరోగ్యం మెరుగుపడుతుంది. నిరుద్యోగుల ప్రయత్నాలు ఫలించి ఉద్యోగావకాశాలు కలిసి వస్తాయి.

**మకరం:**
ఉద్యోగంలో హోదా పెరిగే అవకాశం ఉంది. అధికారులు, సహోద్యోగులు ఎక్కువగా మీ మీద ఆధార పడడం జరుగుతుంది. వృత్తి జీవితంలో బిజీ అయిపోతారు. వ్యాపారాలు అనుకూలంగా సాగిపో తాయి. ఆర్థిక విషయాలు బాగా అనుకూలంగా ఉంటాయి. రావాల్సిన డబ్బు చేతికి అందుతుంది.

**కుంభం:**
వృత్తి, ఉద్యోగాలు ఉత్సాహంగా, ప్రోత్సాహకరంగా సాగుతాయి. వ్యాపారాల్లో లాభాలు నిలకడగా కొనసాగుతాయి. ఆదాయం బాగానే ఉంటుంది. వృథా ఖర్చుల్ని అదుపు చేస్తారు. సన్నిహితుల వల్ల కొద్దిగా నష్టపోయే అవకాశం ఉంది. ఎవరినీ తేలికగా నమ్మకపోవడం మంచిది.

**మీనం:**
వృత్తి జీవితంలో కొద్దిగా ఒత్తిడి ఉండవచ్చు. వ్యాపారాల్లో లాభాలు గడిస్తారు. ఆస్తి వ్యవహారం ఒకటి ఒక కొలిక్కి వస్తుంది. ఇల్లు గానీ, స్థలంగానీ కొనే విషయం ఆలోచిస్తారు. ఆదాయం మెరుగ్గా ఉంటుంది. ఎక్కువగా ఆధ్యాత్మిక విషయాలపై ఖర్చు చేస్తారు.




## బండ్లగూడలో భారీ అగ్నిప్రమాదం

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

హైదరాబాద్ శివారు రాజేంద్రనగర్ పరిధిలోని బండ్లగూడలో మంగళవారం తెల్లవారుజామున భారీ అగ్నిప్రమాదం సంభవించింది. స్థానికంగా ఉన్న ఓ బట్టల దుకాణంలో మంటలు చెలరేగి, క్షణాల్లోనే అగ్నికీలలు ఎగిసిపడడంతో పరిసర ప్రాంతం దట్టమైన పొగతో కమ్ముకుంది. ఈ ఘటనను గమనించిన స్థానికులు భయాందోళనకు గురై వెంటనే డయల్ 100 కు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సంఘటనాస్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది ఫైరింజన్ల సాయంతో మంటలను అదుపులోకి తీసుకువచ్చేందుకు శ్రమిస్తున్నారు. ఈ ప్రమాదంలో భవనం రెండో అంతస్తులో ఉన్న 'సిద్ధి వినాయక టెక్స్‌టైల్స్' షాపు పూర్తిగా దగ్ధమైంది. ఘటనలో భారీగా ఆస్తి నష్టం సంభవించినట్లు తెలుస్తోంది. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఈ అగ్నిప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు.

## నేను చనిపోయాక పింఛన్ ఇస్తారా?

**శ్రీకాకుళం (ఏడీఎన్ఎన్) :**



నేను బతికుండగా పింఛన్ ఇవ్వరా? నేను చనిపోయిన తర్వాత మంజూరు చేస్తారా?," అంటూ ఒక వృద్ధురాలు ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యంపై నిప్పులు చెరిగారు. శ్రీకాకుళం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్ వేదికగా జరిగిన ఈ ఘటన అక్కడున్న వారందరినీ కలిచివేసింది. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో విపరీతంగా వైరల్ అవుతోంది. వివరాల్లోకి వెళితే.. జిల్లాకు చెందిన సదరు వృద్ధురాలు ఆసరా పింఛన్ కోసం గత రెండు సంవత్సరాలుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. అర్హత ఉన్నప్పటికీ, పదేపదే దరఖాస్తు చేసుకున్నా అధికారులు ఆమె విన్నపాన్ని పట్టించుకోలేదు. ఎన్నిసార్లు అధికారులను వేడుకున్నా ఫలితం లేకపోవడంతో, విసుగుచెందిన ఆమె సోమవారం జరిగిన గ్రీవెన్స్ సెల్‌కు చేరుకుని తన గోడును వెళ్లబోసుకున్నారు. గ్రీవెన్స్ సెల్ అధికారి వద్ద తన ఆవేదనను వ్యక్తపరుస్తూ ఆమె భావోద్వేగానికి లోనయ్యారు. "రెండేళ్లుగా పిచ్చిపట్టినట్లు ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. అసలు న్యాయం అనేది ఉందా? మా బాధలు చెప్పుకుని ఏడిస్తే ఏడిచారు అంటారు.. న్యాయం కోసం గట్టిగా మాట్లాడితే అలా మాట్లాడారు అంటారు. నాకు చావే పరిష్కారమా? దయచేసి నాకు న్యాయం చేయండి," అని అధికారులను నిలదీశారు. వృద్ధురాలు కన్నీటి పర్యంతమవుతూ తన బాధను చెప్పుకుంటున్న దృశ్యాలను అక్కడున్న వారు మొబైల్ ఫోన్లలో రికార్డ్ చేయగా, అది కాస్తా ఇంటర్నెట్‌లో వైరల్‌గా మారింది. ఈ వీడియో చూసిన నెటిజన్లు ప్రభుత్వ యంత్రాంగంపై, అధికారుల ఉదాసీనతపై తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. వృద్ధురాలి దీనస్థితిని చూసైనా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, ఆమెకు వెంటనే పింఛన్ మంజూరు చేసి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

## ఈ బామ్మ అట్లకు 40 ఏళ్లు

**ఖమ్మం (ఏడీఎన్ఎన్) :**



ఖమ్మం నగరంలో తన అద్భుతమైన పోరాట పటిమతో అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు మహబూబ్ బీ అనే బామ్మ. కట్టెల పొయ్యిపై అట్లు వేస్తూ గడిచిన 40 ఏళ్లుగా తన కుటుంబాన్ని సాకుతున్న ఈమె కథ ఎందరికో స్ఫూర్తిదాయకం. మహబూబ్ బీకి ఐదుగురు సంతానం. ముగ్గురు కుమార్తెలకు పెళ్లిళ్లు చేసి బాధ్యతలు నెరవేర్చారు. పదేళ్ల క్రితం భర్త రహీమ్ మరణించినా, ఆమె ఏమాత్రం అధైర్య పడకుండా అట్ల వ్యాపారాన్ని కొనసాగిస్తూ జీవనం సాగిస్తున్నారు. మొదట్లో స్టేషన్ రోడ్డులోని ఒక చిన్న గదిలో భర్తతో కలిసి హోటల్ నడిపేవారు. ప్రస్తుతం భక్తరామదాసు కళాక్షేత్రం ఎదురుగా ఉన్న ఖాళీ ప్రదేశంలో, ఒక పరదా కట్టుకుని దాన్నే తన చిరునామాగా మార్చుకున్నారు. ఆమెకు తన చిన్న కుమారుడు గఫార్ తోడుగా నిలుస్తున్నారు. తెల్లవారుజామున 4 గంటలకే నిద్రలేచి అట్ల పిండి, పల్లీ చట్నీ, టమాటా పచ్చడి స్వయంగా సిద్ధం చేసుకుంటారు. ఉదయం 6 నుండి మధ్యాహ్నం 12 వరకు కట్టెల పొయ్యిపై నిరంతరాయంగా అట్లు పోస్తూ కష్టమర్ల ఆకలి తీరుస్తారు. సాయంత్రం 6 గంటల నుండి మరుసటి రోజుకు కావాల్సిన ముందస్తు ఏర్పాట్లు చేసుకుంటారు. నాలుగు దశాబ్దాలుగా కట్టెల పొయ్యి వద్ద పొగలోనే వంట చేస్తున్నా, ఇప్పటివరకు ఆమెకు ఎటువంటి ఆరోగ్య సమస్యలు తలెత్తకపోవడం విశేషం. కాయకష్టమే ఆమె జీవితానికి చిరునామాగా మారింది. కష్టపడే తత్వం ఉంటే వయసుతో సంబంధం లేకుండా ఏదైనా సాధించవచ్చని, ఆత్మగౌరవంతో ఎలా బతకాలో ఈ బామ్మ నిరూపిస్తున్నారు. ఆమె జీవితం నేటి తరానికి నిజమైన స్ఫూర్తి. ఈ కాలంలో చిన్న కష్టం వస్తేనే కుంగిపోయే వారికి మహబూబ్ బీ ఒక గొప్ప పాఠం. "కాయకష్టమే నమ్ముకున్న వారికి ఆకలి బాధ ఉండదు" అని ఆమె నిరూపిస్తున్నారు. రోజుకు దాదాపు 18 గంటల పాటు శ్రమిస్తూ, ఎవరిపైనా ఆధారపడకుండా స్వశక్తితో జీవిస్తున్న ఆమె ఆత్మగౌరవం వెలకట్టలేనిది. ఆధునిక సౌకర్యాలు, గ్యాస్ స్టవ్‌లు అందుబాటులో ఉన్నా, నేటికీ సంప్రదాయ పద్ధతిలో కట్టెల పొయ్యిపై ఆమె వేసే అట్లకు ఉన్న రుచే వేరు. ఆ రుచి వెనుక ఆమె 40 ఏళ్ల అనుభవం మాత్రమే కాదు, తన కుటుంబాన్ని నిలబెట్టుకోవాలనే బలమైన సంకల్పం కూడా ఉంది. అందుకే, కేవలం వ్యాపారిగానే కాకుండా, కష్టాన్నే నమ్ముకున్న ఒక ధైర్యశాలిగా ఖమ్మం నగర ప్రజల మన్ననలు పొందుతున్నారు.

## ప్రేమకు లేదు అడ్డంకి

**మచిలీపట్నం (ఏడీఎన్ఎన్) :**

ప్రేమకు అందచందాలు, శారీరక ఆకృతులు అడ్డు కావని నిరూపిస్తూ కృష్ణా జిల్లా మచిలీపట్నంలో జరిగిన ఓ వివాహం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. మరుగుజ్జు యువకుడిని మనసారా ప్రేమించిన ఒక యువతి, పెద్దలను ఎదిరించి మరీ అతడిని మనువాడి తన ప్రేమను చాటుకుంది. మనసు కలిస్తే మనిషి రూపంతో పనిలేదని నిరూపించారు శశి, గౌసియా. మచిలీపట్నానికి చెందిన వేముల శశి ప్రస్తుతం జిల్లా కోర్టులో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పనిచేస్తుండగా, గౌసియా ఫార్మసిస్ట్ గా స్థిరపడింది. వీరిద్దరి మధ్య తొమ్మిదో తరగతి నుంచే స్నేహం చిగురించింది. కాలక్రమేణా అది బలమైన ప్రేమగా మారింది. వీరి పెళ్లికి గౌసియా కుటుంబ సభ్యులు ససేమిరా అన్నారు. శశి శారీరక స్థితి (మరుగుజ్జు కావడం) కారణంతో ఈ బంధాన్ని నిరాకరించారు. అయితే, బాహ్య రూపం కంటే శశి వ్యక్తిత్వానికే విలువ ఇచ్చిన గౌసియా, తన కుటుంబ సభ్యుల అభ్యంతరాలను కాదని అతడినే వివాహం చేసుకుంది. పెళ్లి అనంతరం ఈ నవదంపతులు రక్షణ కోసం ఇరుకుదురుపేట పోలీసులను ఆశ్రయించారు. తమ కుటుంబ సభ్యుల నుంచి ప్రాణహాని ఉందని ఫిర్యాదు చేయడంతో, పోలీసులు ఇరు వర్గాలను పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించారు. సామాజిక కట్టుబాట్లు, శారీరక లోపాల కంటే



మనసుల కలయికే ముఖ్యమని చాటిన ఈ జంటపై స్థానికంగా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. నిజమైన ప్రేమకు వీరు నిలువుటద్దంగా నిలిచారని పలువురు కొనియాడుతున్నారు.

## టచ్ ఫీలింగ్ డివైస్: సైంటిస్టుల కొత్త అద్భుతం

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

మనం బజార్ల ఏదైనా సామాను కొనాలంటే.. అటూ ఇటూ తిప్పి చూస్తం, చేత్తో పట్టుకొని అది మెత్తగుందా? గట్టిగుందా? అని గిల్లి గిల్లి మరీ చెక్ చేస్తం. కానీ ఆన్‌లైన్ షాపింగ్ల అట్లా జేత్తమా? జరగదు. ఫోన్ల బొమ్మ చూసి ఆర్డర్ ఇయ్యాలె తప్ప, అది ఎట్లుంటదో ముట్టుకుంటే గాని తెల్వది. కానీ, ఇకముందు అట్లాంటి రంది లేకుంట ఉండాలని మన సైంటిస్టులు ఒక కిర్రాక్ పరికరాన్ని కనిపెట్టిండ్రు. నార్త్ వెస్టర్న్ యూనివర్సిటీకి చెందిన మేధావులు ఒక 'ఫింగర్ టిప్ డివైజ్'ను తయారు చేసిండ్రు. దీని పేరు 'వోక్స్ లైట్'. మీరు ఫోన్లనో, ట్యాబ్లనో ఏదైనా



బట్టను గాని, వస్తువును గాని చూస్తున్నప్పుడు.. ఈ డివైజ్‌ను మీ వేలికి పెట్టుకొని స్క్రీన్‌పై ముట్టుకుంటే, నిజంగానే ఆ వస్తువును చేత్తో తాకినట్టు అనిపిస్తదట. ఆ వస్తువు గరుకుగా ఉందా లేక నునుపుగా ఉందా అనేది మీ వేలికి తెలిసిపోతది. ఇది మరీ లావుగా ఏమీ ఉండదు. కేవలం 0.1 మిల్లీ మీటర్ల మందం ఉంటది. అంటే మన వెంట్రుకంత సన్నం అన్నట్టు. దీని బరువు కేవలం 0.19 గ్రాములే. వేలికి పెట్టుకున్నా కూడా అసలు ఏమీ లేనట్టే ఉంటది. ఈ డివైస్‌ను సాగే గుణం ఉన్న లాటెక్స్ షీట్స్‌తో దీన్ని తయారు చేసిండ్రు. దీనివల్ల వేలికి గట్టిగా అతుక్కొని, మనం ఏది ముట్టుకున్నా ఆ ఫీలింగ్‌ను మన మెదడుకు పంపిస్తది. ఇకముందు ఆన్‌లైన్ల డ్రెస్సులు కొన్నా, ఇంకేం కొన్నా.. గమ్మత్తుగా దాన్ని ముట్టుకొని క్వాలిటీ ఎట్లుందో ముందే తెలుసుకోవచ్చన్నమాట! భలే ఉంది కదా ఈ టెక్నాలజీ!

## గ్యాస్ పోయి... కిరోసిన్ స్టవ్ వచ్చే

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

పశ్చిమాసియాలో జరుగుతున్న యుద్ధ పరిస్థితుల వల్ల మన దేశంలో ఇంధన కొరత ఏర్పడి, సామాన్యుల జీవితాలపై భారం పడుతోంది. ముఖ్యంగా భారత్‌లోని మధ్యతరగతి ప్రజలు, చిరు వ్యాపారులు, టీ టిఫిన్ సెంటర్లపై భారం పడుతోంది. దేశంలో ఇంధన కొరత కారణంగా వంట గ్యాస్ సిలిండర్ల సరఫరాలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఒకప్పుడు ఫోన్ చేయగానే వచ్చే సిలిండర్, ఇప్పుడు బుక్ చేసిన వారం పది రోజుల వరకు కూడా రావడం లేదు. సిలిండర్ల సరఫరా తగ్గడంతో గృహిణులు, హోటల్ యజమానులు ఇబ్బందులు పడుతున్నారు. గ్యాస్ కోసం ఎదురుచూడలేక చాలామంది టీకొట్టు వ్యాపారులు, చిన్న దుకాణదారులు పాత పద్ధతిలోకి మారిపోయారు. గ్యాస్ సిలిండర్లకు బదులుగా మళ్ళీ కిరోసిన్ స్టవ్‌లను వాడుతున్నారు. తమిళనాడులోని ఈరోడ్ జిల్లా, గోపీ ప్రాంతంలో ఈ మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. ఇక్కడి టీ దుకాణదారులు రోజుకు సుమారు 4 లీటర్ల కిరోసిన్ ఉపయోగిస్తూ వ్యాపారాలు సాగిస్తున్నారు. మరికొందరు దుకాణదారులు గ్యాస్ ఇబ్బందుల కంటే నయం అని భావించి ఇండక్షన్ స్టవ్‌ల (కరెంటు పొయ్యిలు) వైపు మొగ్గు చూపుతున్నారు. ఇటు ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో కిరోసిన్ స్టవ్, కట్టెల పొయ్యిని ఎక్కువగా వాడుతున్నారు. "కాలం వెనక్కి వెళ్ళడం



అంటే ఇదేనేమో" అని స్థానికులు వాపోతున్నారు. ఒకప్పుడు అలంకారప్రాయంగా మారిపోయిన కిరోసిన్ స్టవ్‌లు, నేడు అవసరార్థం మళ్ళీ పొయ్యిల మీదకు వచ్చాయి.


## సినిమా స్టైల్‌లో దోపిడీ

**శ్రీకాకుళం జిల్లా (ఏడీఎన్ఎన్) :**

పలాసలో పట్టపగలే జ్యువెలరీ దుకాణంలో సినిమా తరహాలో దోపిడీ చోటుచేసుకుంది. అధికారుల ముసుగులో వచ్చిన దుండగులు షాపు యజమానిని బంధించి భారీగా బంగారం దోచుకెళ్లడంతో స్థానికంగా కలకలం రేగింది. వివరాలు తెలిసిన ప్రకారం.. పలాసలోని ఓ జ్యువెలరీ షాపులోకి నలుగురు వ్యక్తులు ప్రవేశించి తాము జీఎస్టీ అధికారులమని చెప్పి తనిఖీలు నిర్వహిస్తున్నట్లు నటించారు. రికార్డులు పరిశీలిస్తున్నట్లుగా నమ్మబలికిన అనంతరం ఒక్కసారిగా యజమానిపై దాడి చేశారు. అతని చేతులకు బేడీలు వేసి కదలకుండా కట్టేసి, నోరు మూసారు. అనంతరం షాపులో ఉన్న సుమారు పావు కేజీ (250 గ్రాములు) బంగారాన్ని బ్యాగుల్లో నింపుకుని పరారయ్యారు. కొంతసేపటి తర్వాత తేరుకున్న బాధితుడు స్థానికుల సహాయంతో పోలీసులకు సమాచారం అందించాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు షాపు, పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ ఫుటేజీలను సేకరించి దర్యాప్తు ప్రారంభించారు. దుండగులు వచ్చిన వాహనం, పారిపోయిన దిశపై




ఆరా తీస్తున్నారు. జిల్లా సరిహద్దుల్లో అప్రమత్తం చేసి తనిఖీలు చేపట్టారు. అధికారుల పేరుతో దోపిడీ జరగడం వ్యాపార వర్గాల్లో ఆందోళన కలిగించింది. గుర్తుతెలియని వ్యక్తులు తనిఖీల పేరుతో వస్తే వారి గుర్తింపు పత్రాలను పరిశీలించాలని, అనుమానం ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని అధికారులు సూచించారు. కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలింపు చర్యలు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



## ఐటీ కారిడార్‌లో హైడ్రా బిగ్ ఆపరేషన్


### రూ.1200 కోట్ల విలువైన భూమి స్వాధీనం

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

ఐటీ హబ్‌కు అత్యంత చేరువలో ఉన్న ఖానామెట్‌లో హైడ్రా అధికారులు భారీ ఆపరేషన్ నిర్వహించారు. బడా రియల్ ఎస్టేట్ సంస్థల చెరలో ఉన్న సుమారు 8 ఎకరాల ప్రభుత్వ భూమిని మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం ఖానామెట్ సర్వే నంబర్ 55లోని ఈ భూమి విలువ బహిరంగ మార్కెట్ ధర ప్రకారం సుమారు రూ. 1200 కోట్లకు పైగా ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులతో కలిసి ఈ దాడులు నిర్వహించారు. సర్వే నంబర్ 55లోని అసైన్డ్ భూమిని మీనాక్షి రియల్ ఎస్టేట్ సంస్థ తమదిగా చెప్పుకుంటూ ఆక్రమించగా, వాసవి నిర్మాణ సంస్థ అక్కడ ఆర్‌సీసీ ప్లాంట్లు, కార్మికుల కోసం తాత్కాలిక షెడ్లను ఏర్పాటు చేసింది. సుమారు 4.20 ఎకరాల ప్రభుత్వ భూమిని ఈ సంస్థలు వాడుకుంటున్నట్లు గుర్తించిన హైడ్రా అధికారులు, వాటన్నింటినీ తొలగించారు. హైడ్రా హెచ్చరికలతో వాసవి సంస్థ తమ ప్లాంట్‌ను స్వయంగా తొలగించుకోగా, మిగిలిన నిర్మాణాలను హైడ్రా సిబ్బంది నేలమట్టం చేశారు.అదేవిధంగా, మరో 4 ఎకరాల భూమిని తనదిగా పేర్కొంటూ బౌన్సర్లను కాపలా ఉంచిన కొలను సబిత అనే వ్యక్తి ఆక్రమణలను కూడా అధికారులు తొలగించారు. ఈ భూమిని ఇప్పటికే కలెక్టర్ ప్రోహిబిటెడ్ జాబితాలో చేర్చినప్పటికీ, ప్రైవేటు వ్యక్తులు దీనిని ఆక్రమించుకున్నట్లు విచారణలో తేలింది. స్వాధీనం చేసుకున్న 8 ఎకరాల భూమి చుట్టూ హైడ్రా అధికారులు ఫెన్సింగ్ వేసి, ఇది 'ప్రభుత్వ భూమి' అని తెలిపే హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే ఎంతటి వారైనా వదిలే ప్రసక్తే లేదని ఈ ఆపరేషన్ ద్వారా హైడ్రా మరోసారి స్పష్టం చేసింది.

## ఏసీబీ వలలో అగ్రికల్చర్ వర్సిటీ అసోసియేట్ డీన్

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**



ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం అసోసియేట్ డీన్ గోవర్ధన్ అవినీతి నిరోధక శాఖ అధికారులకు అడ్డంగా దొరికిపోయారు. ఒక ప్రైవేట్ విత్తన కంపెనీకి సంబంధించిన పనిని పూర్తి చేసేందుకు ఆయన లక్ష రూపాయల లంచం డిమాండ్ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు నిఘా ఉంచిన ఏసీబీ అధికారులు, రాజేంద్రనగర్‌లోని యూనివర్సిటీ ప్రాంగణంలో గోవర్ధన్ ఆ లంచం డబ్బు తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా మంగళవారం పట్టుకున్నారు. గోవర్ధన్ పట్టుబడిన వెంటనే ఏసీబీ బృందాలు ఏకకాలంలో పలుచోట్ల సోదాలు చేపట్టాయి. రాజేంద్రనగర్‌లోని ఆయన కార్యాలయంతో పాటు, ఎల్బీనగర్‌లోని ఆయన నివాసంలో అధికారులు క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ సోదాల్లో అక్రమ సంపాదనకు సంబంధించి ఏవైనా కీలక పత్రాలు లేదా అదనపు నగదు లభ్యమవుతాయా అనే కోణంలో విచారణ సాగుతోంది. ఉన్నత విద్యాసంస్థలో కీలక పదవిలో ఉండి లంచం తీసుకుంటూ పట్టుబడటం వర్సిటీ వర్గాల్లో కలకలం రేపింది.నిందితుడిని అదుపులోకి తీసుకున్న ఏసీబీ అధికారులు, ఆయనపై కేసు నమోదు చేసి తదుపరి విచారణ నిమిత్తం ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరచనున్నారు. గత కొంతకాలంగా ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతిపై ఉక్కుపాదం మోపుతున్న ఏసీబీ, తాజాగా అగ్రికల్చర్ వర్సిటీలో జరిగిన ఈ దాడితో మరోసారి అవినీతి అధికారులకు హెచ్చరికలు పంపింది. లంచం అడిగితే వెంటనే అధికారులకు సమాచారం అందించాలని ఏసీబీ ఈ సందర్భంగా ప్రజలకు విజ్ఞప్తి చేసింది.



## భోజనం బాగోలేదని రోడ్డెక్కిన విద్యార్థులు

**మెదక్ జిల్లా (ఏడీఎన్ఎన్) :**

మెదక్ జిల్లా కౌడిపల్లి మండల కేంద్రంలోని బాలుర గిరిజన ఆశ్రమ గురుకుల పాఠశాలలో విద్యార్థులు మంగళవారం ఆందోళనకు దిగారు. పాఠశాలలో అందిస్తున్న భోజనం నాణ్యత లేనిదిగా ఉందని ఆరోపిస్తూ జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించారు. మెనూ ప్రకారం ఆహారం అందించాల్సి ఉన్నప్పటికీ, నాణ్యతలేని భోజనం అందిస్తున్నారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. మంచి భోజనం గురించి ప్రశ్నిస్తే టీచర్లు దురుసుగా ప్రవర్తిస్తూ, కొడుతున్నారని, బెదిరిస్తున్నారని ఆరోపించారు. సమస్యను ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు.నాణ్యత లేని ఆహారం గురించి ప్రశ్నించినందుకు ఒక టీచర్ శారీరకంగా దాడి చేశాడని, ఈ విషయంలో ప్రిన్సిపాల్ అతనికి మద్దతు ఇస్తున్నారని విద్యార్థులు పేర్కొన్నారు. పాఠశాలలో అవినీతి, అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ సంబంధిత అధికారుల నుంచి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.విద్యార్థుల నిరసనతో కొంతసేపు జాతీయ రహదారిపై రాకపోకలకు అంతరాయం ఏర్పడిందని, సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు.

## ప్లేఆఫ్స్ రేసులో టాప్-4 జట్లు!



ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):

ఐపీఎల్ 2026 సీజన్ ఆరంభంలోనే రసవత్తరంగా మారింది. ఇప్పటివరకు 12 మ్యాచ్‌లు పూర్తి కావడంతో పాయింట్ల పట్టికలో సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. ప్రస్తుతం పాయింట్ల పట్టికలో టాప్ స్థానాల్లో ఉన్న జట్లు ప్లేఆఫ్స్ దిశగా బలమైన అడుగులు వేస్తున్నాయి. ముంబై ఇండియన్స్ ఒక మ్యాచ్‌లో ఓటమి ఎదురైనప్పటికీ, బ్యాటింగ్ , బౌలింగ్ విభాగాల్లో ముంబై అత్యంత సమతూకంగా కనిపిస్తోంది. రోహిత్ శర్మ ఫామ్‌లో ఉండటం ఆ జట్టుకు పెద్ద ప్లస్ పాయింట్. రాజస్థాన్ రాయల్స్ ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ విజయం సాధించి క్లీన్ రికార్డుతో ఉంది. బౌలింగ్‌లో రవి బిష్ణోయ్, బ్యాటింగ్‌లో వైభవ్ వంటి ప్లేయర్లు అద్భుతంగా రాణిస్తున్నారు. డిఫెండింగ్ ఛాంపియన్లుగా బరిలోకి దిగిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు వరుస విజయాలతో టేబుల్ టాప్‌లో కొనసాగుతోంది. కోహ్లి ఫామ్‌లో ఉండడం..నెట్ రన్ రేట్ కూడా మెరుగ్గా ఉండటం వీరికి కలిసొచ్చే అంశం. పంజాబ్ కింగ్స్ కూడా ఈ సీజన్‌లో అనూహ్య ప్రదర్శన చేస్తోంది. వరుస విజయాలతో ప్లేఆఫ్స్ రేసులో తాము కూడా ప్రధాన పోటీదారులమే అని చాటిచెప్తోంది. కొన్ని ఫేవరెట్ జట్లు ఈ సీజన్ ఆరంభంలో తీవ్రంగా తడబడుతున్నాయి. కష్టాల్లో ఉన్నా ఈ దిగ్గజ జట్లు కూడా విజయం కోసం తీవ్రంగా శ్రమిస్తున్నాయి. చెన్నై సూపర్ కింగ్స్ వరుసగా మూడు ఓటములతో పాయింట్ల పట్టికలో అట్టడుగున ఉంది. ముఖ్యంగా బౌలింగ్ విభాగం వైఫల్యం జట్టును వేధిస్తోంది. కోల్‌కతా నైట్ రైడర్స్ భారీ ధర పలికిన ఆటగాళ్లు రాణించకపోవడం, స్పిన్ విభాగం బలహీనపడటంతో గెలుపు కోసం పోరాడాల్సి వస్తోంది. గుజరాత్ టైటాన్స్ పటిష్టమైన లైనప్ ఉన్నప్పటికీ, కీలక సమయాల్లో ఫామ్ లేమితో వరుస ఓటములను చవిచూస్తోంది. సన్‌రైజర్స్ హైదరాబాద్, లక్నో సూపర్ జెయింట్స్ జట్లు కేవలం బ్యాటింగ్‌పైనే అతిగా ఆధారపడుతున్నాయి. బౌలింగ్ విభాగంలో మెరుగుపడితేనే వీరు టాప్ 4లోకి వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం బెంగళూరు, రాజస్థాన్, ముంబై, పంజాబ్ జట్లు ప్లేఆఫ్స్ చేరుకోవడానికి అత్యంత అనుకూలమైన స్థితిలో ఉన్నాయి. అయితే ఐపీఎల్ ద్వితీయార్థంలో అనూహ్య మార్పులు జరిగే అవకాశం ఉన్నందున, మిగిలిన జట్లు ఎలా పుంజుకుంటాయో వేచి చూడాల్సిందే.



## పురాతన ఆలయానికి అనంత్ అంబానీ రూ.12 కోట్ల విరాళం!

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):

భారత కుబేరుడు ముకేష్ అంబానీ తనయుడు అనంత్ అంబానీ ఇటీవల కేరళలోని తాలిపరంబ రాజరాజేశ్వర ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న సమయంలో, దాదాపు 200 ఏళ్లుగా ఆలయం శిథిలావస్థలో ఉన్నట్లు అనంత్ అంబానీ గమనించారు. ఆలయ అధికారులు గత 25 ఏళ్లుగా ప్రయత్నిస్తున్నప్పటికీ, ఆర్థిక వనరుల కొరత వల్ల ఆ పనులు నెమ్మదిగా సాగుతున్నాయని అధికారులు వెల్లడించారు. దీనితో ఈ ప్రాచీన ఆలయానికి ఏకంగా రూ.12 కోట్ల సహాయం ప్రకటించి, తన ఉదారతను చాటుకున్నారు. పునరుద్ధరణ పనులు ప్రారంభించేందుకు వీలుగా ప్రాథమికంగా రూ.3 కోట్ల చెక్కును అధికారులకు అందజేశారు. అనంత్ అంబానీ అందించిన ఈ విరాళాన్ని ప్రధానంగా శిథిలావస్థకు చేరిన చారిత్రాత్మక తూర్పు గోపురాన్ని పురాతన శైలిలో పునర్నిర్మించడం, ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం పార్కింగ్ ప్రాంతాన్ని మెరుగుపరచడం. ఆలయ పరిసరాల్లో భక్తుల కోసం మరిన్ని మౌలిక సదుపాయాలను కల్పించడం వంటి పనులకు ఉపయోగిస్తామని ఆలయ అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అనంత్ అంబానీ స్వామివారికి ప్రత్యేక పూజలతో పాటు, అత్యంత భక్తితో 'అశ్వమేధ నమస్కారం' నిర్వహించారు. స్వామివారికి పొన్నుంకుడం, పట్టం, తాళి, నెయ్యమృతు వంటి విశేష కానుకలను భక్తిశ్రద్ధలతో సమర్పించారు.




## 'ఛోటు' గ్యాస్ సిలిండర్లపై గుడ్‌న్యూస్

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):


అంతర్జాతీయంగా ఇంధన సరఫరాపై ఒత్తిడి పెరుగుతున్న నేపథ్యంలో, కేంద్ర ప్రభుత్వం వలస కార్మికులకు గుడ్ న్యూస్ చెప్పింది. వారికోసం 5 కేజీల ఎల్పీజీ (LPG) సిలిండర్ల కేటాయింపును భారీగా పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. వలస కార్మికులు ఎక్కువగా ఉపయోగించే 5 కేజీల ఎల్పీజీ సిలిండర్ల రోజువారీ కోటాను కేంద్రం రెట్టింపు చేసింది. 'ఛోటు' పేరుతో లభించే ఈ ఫ్రీ ట్రేడ్ సిలిండర్లను పొందేందుకు ఎటువంటి చిరునామా రుజువు అవసరం లేదు. కేవలం గుర్తింపు కార్డు ఉంటే సరిపోతుంది. పట్టణ ప్రాంతాల్లో నివసించే వలస కార్మికులు, తక్కువ ఆదాయ వర్గాల వారికి ఇది నేరుగా ప్రయోజనం చేకూరుస్తుంది. మార్చి 2, 3 తేదీల్లో నమోదైన సరఫరా గణాంకాల ఆధారంగా రాష్ట్రాలకు, కేంద్రపాలిత ప్రాంతాలకు అదనపు కోటాను పంపిణీ చేయనున్నారు. బ్లాక్ మార్కెట్‌లో ఎక్కువ ధరలకు గ్యాస్ కొనుగోలు చేసే పరిస్థితి తప్పుతుంది. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే సిలిండర్లు అందుబాటులోకి వస్తాయి. గ్యాస్ కనెక్షన్ కోసం అవసరమైన సంక్లిష్టమైన పత్రాల బాధ ఉండదు కాబట్టి, వలస కార్మికులు సులభంగా వంట ఇంధనాన్ని పొందవచ్చు. సరఫరా పెరగడం వల్ల కృత్రిమ కొరత ఏర్పడకుండా చూడవచ్చు, తద్వారా ధరలు అదుపులో ఉంటాయి. ఈ అదనపు కేటాయింపులు కేవలం వలస కార్మికుల అవసరాల కోసమే వినియోగించాలని కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల సహకారంతో ఈ సరఫరా వ్యవస్థను పర్యవేక్షించనున్నారు.

# ముంబై పై రాజస్థాన్ ఘన విజయం




ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :


ఐపీఎల్‌లో భాగంగా ముంబై ఇండియన్స్‌తో జరిగిన ఉత్కంఠభరిత పోరులో రాజస్థాన్ రాయల్స్ 27 పరుగుల తేడాతో అద్భుత విజయాన్ని అందుకుంది. వర్షం కారణంగా 11 ఓవర్లకు కుదించిన ఈ మ్యాచ్‌లో రాజస్థాన్ బ్యాటర్లు మొదటి బంతి నుంచే ముంబై బౌలర్లపై విరుచుకుపడ్డారు. ఓపెనర్లు యశస్వి జైస్వాల్ (32 బంతుల్లో 77 నాటౌట్), 15 ఏళ్ల సంచలనం వైభవ్ సూర్యవంశీ (14 బంతుల్లో 39) ఆకాశమే హద్దుగా చెలరేగిపోయారు. ముఖ్యంగా వైభవ్, ప్రపంచ నంబర్ వన్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా బౌలింగ్‌లో వరుస సిక్సర్లు బాదడం స్టేడియంను హోరెత్తించింది. జైస్వాల్ కేవలం 23 బంతుల్లోనే మెరుపు హాఫ్ సెంచరీ పూర్తి చేయడంతో రాజస్థాన్ నిర్ణీత 11 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 150 పరుగుల భారీ స్కోరు సాధించింది. అనంతరం 151 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ముంబై ఇండియన్స్, రాజస్థాన్ బౌలర్ల ధాటికి తలవంచక తప్పలేదు. నిర్ణీత 11 ఓవర్లలో ముంబై జట్టు 9 వికెట్లు కోల్పోయి కేవలం 123 పరుగులకే పరిమితమైంది. రాజస్థాన్ బౌలర్లు కట్టుదిట్టమైన బౌలింగ్‌తో పరుగులు ఇవ్వకుండా ఒత్తిడి పెంచడంతో ముంబై బ్యాటర్లు పెవిలియన్‌కు క్యూ కట్టారు. ముంబై ఇన్నింగ్స్‌లో స్టార్ బ్యాటర్లు విఫలం కాగా, రాజస్థాన్ బౌలర్లు క్రమం తప్పకుండా వికెట్లు తీస్తూ పట్టు బిగించారు. ఈ విజయంతో రాజస్థాన్ రాయల్స్ పాయింట్ల పట్టికలో తమ ఆధిపత్యాన్ని చాటుకోగా, స్వల్ప ఓవర్ల మ్యాచ్‌లోనూ సమర్థవంతమైన పోరాటాన్ని కనబరిచి అభిమానులను అలరించింది.



## ఉబర్ డ్రైవర్‌గా ఒరాకిల్ మాజీ ఉద్యోగి ఆర్థిక పాఠం!

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :

ఐటీ కంపెనీల్లో లేఆఫ్స్ అనగానే ఉద్యోగులు తీవ్ర ఆందోళనకు లోనవుతుంటారు. కానీ, బెంగళూరు ఒరాకిల్‌లో పనిచేసిన ఈ ఉద్యోగి మాత్రం ప్రశాంతంగా తన జీవితాన్ని గడుపుతూ ఆర్థిక పాఠాలు నేర్పిస్తున్నాడు. పింక్ స్లిప్ రాగానే తన సామాన్లు సర్దుకుని సొంతూరైన భువనేశ్వర్‌కు వెళ్లిపోయారు. నాయక్ సత్య అనే యూజర్ పంచుకున్న వివరాల ప్రకారం, ఈ ఉద్యోగి సంపాదించిన సొమ్మును హడావుడి లేకుండా పాత పద్ధతుల్లో పొదుపు చేశారు. సుమారు రూ.60 లక్షల వరకు




పోస్టాఫీస్, బ్యాంకుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేయడంతో వాటి ద్వారా నెలకు సుమారు రూ.43,000 వడ్డీ రూపంలోనే వస్తోంది. ఎటువంటి హోమ్ లోన్, కార్ లోన్ లేదా ఇతర ఈఎంఐలు లేకపోవడం ఆయనకు అతిపెద్ద ప్లస్ పాయింట్ అయింది. ఉద్యోగం పోయింది కదా అని ఖాళీగా కూర్చోకుండా, తనకు తెలిసిన డ్రైవింగ్ నైపుణ్యాన్ని వాడుకుంటూ భువనేశ్వర్‌లో ఉబర్ డ్రైవర్‌గా మారారు. ఇది ఆయనకు నచ్చిన సమయంలో పనిచేసుకునే వెసులుబాటును ఇవ్వడమే కాకుండా, అదనపు ఆదాయాన్ని కూడా అందిస్తోంది. మరోవైపు, తన తల్లిదండ్రుల సహాయంతో ఒక చిన్న వ్యాపారాన్ని ప్రారంభించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. ఈ ఉదాహరణ నేటి తరం ఉద్యోగులకు కొన్ని ముఖ్యమైన పాఠాలను నేర్పుతోంది. అత్యవసర నిధి కష్టకాలంలో ఆదుకోవడానికి స్థిరమైన పొదుపు ఉండాలి. ఆదాయానికి మించి ఈఎంఐల ఉచ్చులో పడకపోవడం శ్రేయస్కరం.

## లాభాల్లో ముగిసిన దేశీయ మార్కెట్లు

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటనల నేపథ్యంలో తీవ్ర ఒడిదుడుకులకు లోనైన దేశీయ స్టాక్ మార్కెట్లు, మంగళవారం చివరకు లాభాల్లో ముగిశాయి. ఉదయం భారీ నష్టాలతో ప్రారంభమైనప్పటికీ, కనిష్టాల వద్ద కొనుగోళ్ల మద్దతు లభించడంతో సూచీలు పుంజుకున్నాయి. సెన్సెక్స్ ఉదయం 73,734.36 వద్ద ప్రారంభమైంది. ఒక దశలో 800 పాయింట్లు కోల్పోయి 73,282.41 వద్ద కనిష్టాన్ని తాకినప్పటికీ, ముగిసే సమయానికి 509.73



పాయింట్ల లాభంతో 74,616.58 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 155.40 పాయింట్ల లాభంతో 23,123.65 వద్ద ముగిసింది. అమెరికన్ డాలరుతో రూపాయి మారకం విలువ 93 వద్ద ఉంది. ఐటీ దిగ్గజాలు హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టీసీఎస్, ఇన్ఫోసిస్‌తో పాటు భారతీ ఎయిర్‌టెల్, సన్‌ఫార్మా రాణించాయి. ఇండిగో, అదానీ పోర్ట్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, టైటాన్, ట్రెంట్ వంటి షేర్లు నష్టాలను చవిచూశాయి. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 110 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ఔన్సు ధర 4663 డాలర్ల వద్ద కొనసాగుతోంది. ముఖ్యంగా ఐటీ రంగ షేర్లు మార్కెట్ రికవరీలో కీలక పాత్ర పోషించాయి.

## ప్రయాణికులకు ఎయిరిండియా సర్‌ఛార్జీ షాక్

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):

అంతర్జాతీయ మార్కెట్‌లో విమాన ఇంధన ధరలు భారీగా పెరగడంతో, ప్రముఖ విమానయాన సంస్థ ఎయిరిండియా ప్రయాణికులకు ధరల షాక్ ఇచ్చింది. వారిపై ఫ్యూయెల్ సర్‌ఛార్జ్ భారాన్ని మోపింది. ఏప్రిల్ 8 నుంచి దేశీయ మార్గాల్లో, ఏప్రిల్ 10 నుంచి అంతర్జాతీయ మార్గాల్లో ఈ కొత్త ధరలు అమలులోకి రానున్నాయి. ఇంటర్నేషనల్ ఎయిర్ ట్రాన్స్ పోర్ట్ అసోసియేషన్ గణాంకాల ప్రకారం, ఫిబ్రవరిలో బ్యారెల్ జెట్ ఫ్యూయెల్ ధర 99.40 డాలర్లు ఉండగా, మార్చి చివరి నాటికి అది 195.19 డాలర్లకు చేరుకుంది. ఈ అదనపు భారాన్ని తగ్గించుకోవడానికి ఎయిరిండియా సర్‌ఛార్జీలను




పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ప్రయాణ దూరాన్ని బట్టి అదనపు బాదుడు ఉంటుంది. ఈ పెంపు 500 కి.మీ వరకు రూ. 299, 501 నుండి 1000 కి.మీ వరకూ రూ. 399, 1001 నుండి 1500 కి.మీ వరకూ రూ. 549, 1501 నుండి 2000 కి.మీ వరకూ రూ. 749, 2000 కి.మీ పైన రూ. 899 పెరగనుంది. అంతర్జాతీయ విమానాలపై సర్‌ఛార్జ్ ఏప్రిల్ 10 నుండి అమలులోకి వస్తుంది. విదేశీ ప్రయాణాలకు గమ్యస్థానాన్ని బట్టి ఛార్జీలు మారుతాయి. సార్క్ దేశాలకు (బంగ్లాదేశ్ మినహా) 24 డాలర్లు, పశ్చిమాసియా దేశాలకు 50 డాలర్లు, సింగపూర్ 60 డాలర్లు, ఆగ్నేయాసియా (సింగపూర్ మినహా) 100 డాలర్లు, ఆఫ్రికా దేశాలకు 130 డాలర్లు, ఐరోపా దేశాలు (యూకే మినహా) 205 డాలర్లు, నార్త్ అమెరికా, ఆస్ట్రేలియాలకు 280 డాలర్లు పెరిగింది. ఇప్పటికే ఇండిగో వంటి సంస్థలు ఫ్యూయెల్ సర్‌ఛార్జీలను పెంచగా, ఇప్పుడు ఎయిరిండియా కూడా అదే బాటలో పయనిస్తోంది. వేసవి సెలవుల ప్రయాణాలకు సిద్ధమవుతున్న వారికి ఈ ధరల పెంపు పెద్ద భారమే కానుంది.

## రూ.2.50 లక్షల కోట్లతో క్రెడిట్ గ్యారెంటీ పథకం

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):

కోవిడ్ సమయంలో ఎంఎస్ఎంఈలను ఆదుకున్న 'ఎమర్జెన్సీ క్రెడిట్ లైన్ గ్యారెంటీ స్కీమ్' తరహాలోనే, ప్రస్తుత ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధ పరిస్థితుల వల్ల దెబ్బతిన్న రంగాల కోసం ప్రభుత్వం ఈ భారీ ప్యాకేజీని రూపొందిస్తోంది. పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతలు, అంతర్జాతీయ సరఫరా గొలుసులో అంతరాయాల వల్ల భారత ఆర్థిక వ్యవస్థపై పడుతున్న ఒత్తిడిని తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ నూతన ప్యాకేజీని సిద్ధం చేస్తోంది. వ్యాపారాలు పొందే రుణాలకు నేషనల్ క్రెడిట్ గ్యారెంటీ ట్రస్టీ కంపెనీ ద్వారా 90 శాతం వరకు గ్యారెంటీ లభిస్తుంది. ఒకవేళ రుణగ్రహీత చెల్లించలేకపోతే ఆ నష్టాన్ని ప్రభుత్వమే భరిస్తుంది. వివిధ రంగాలకు సుమారు




రూ.100 కోట్ల వరకు రుణ సదుపాయం కల్పించే అవకాశం ఉంది. రుణాలను చౌకగా అందించేందుకు బ్యాంకుల వడ్డీ రేటును 9.25శాతం, ఎన్బీఎఫ్సీల (NBFC) వడ్డీ రేటును 14శాతానికి పరిమితం చేయనున్నారు. అసలు మొత్తం చెల్లింపుపై ఏడాది పాటు మారటోరియం లభిస్తుంది. అయితే, ఈ కాలంలో వడ్డీ మాత్రం చెల్లించాల్సి ఉంటుంది. ఈ పథకం సుమారు నాలుగేళ్ల పాటు అమలులో ఉండే అవకాశం ఉంది. ముఖ్యంగా విమానయాన రంగానికి ఇంధన ధరల పెరుగుదల, విమాన మార్గాల మళ్లింపు వల్ల పెరిగిన నిర్వహణ ఖర్చుల నుండి ఉపశమనం కలిగించడం, నగదు లభ్యత సమస్యలను ఎదుర్కొంటున్న చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ఊపిరి పోయడం కోసం ఎంఎస్ఎంఈ రంగానికి, ఇతర కీలక వ్యాపారాలకు, అంతర్జాతీయ సరఫరాలో అంతరాయాల వల్ల ఇబ్బంది పడుతున్న ఇతర ప్రధాన రంగాలకు ఈ లోన్లు లభిస్తాయి. ఈ నిర్ణయం వల్ల భారతీయ పరిశ్రమలకు తగినంత ఆర్థిక వెసులుబాటు లభించడమే కాకుండా, మార్కెట్‌లో స్థిరత్వం ఏర్పడే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు.

## ఎయిర్‌ఇండియా సీఈఓ క్యాంప్‌బెల్ విల్సన్ రాజీనామా

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):

ఎయిర్‌ఇండియా సీఈఓ క్యాంప్‌బెల్ విల్సన్ తన పదవికి రాజీనామా చేశారు. ఈ ఘటన విమానయాన రంగంలో చర్చనీయాంశంగా మారింది. టాటా గ్రూప్ యాజమాన్యంతో విభేదాలు, సంస్థ పనితీరుపై అసంతృప్తి నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. న్యూజిలాండ్‌కు చెందిన క్యాంప్‌బెల్ విల్సన్ 2022 జూలైలో ఎయిర్‌ఇండియా సీఈఓగా బాధ్యతలు చేపట్టారు. వాస్తవానికి ఆయన పదవీకాలం 2027 జూన్ వరకు ఉంది. అయితే, మరో ఏడాది గడువు ఉండగానే ఆయన తప్పుకోవడం గమనార్హం. విల్సన్ నేతృత్వంలోనే ఎయిర్ ఇండియాలో విస్తారా విలీన ప్రక్రియ పూర్తయ్యింది. దీనికి ప్రధాన కారణం ఎయిర్‌ఇండియా విమాన సర్వీసుల్లో నాణ్యత, సమయపాలన ఆశించిన స్థాయిలో మెరుగుపడకపోవడం




పై టాటా గ్రూప్ అసంతృప్తిగా ఉన్నట్లు సమాచారం. ముఖ్యంగా గతేడాది అహ్మదాబాద్‌లో జరిగిన విమాన ప్రమాద ఘటన విల్సన్ నాయకత్వంపై వ్యతిరేకతకు దారితీసింది. ఆ సమయంలో ప్రభుత్వ అధికారులు విల్సన్‌ను పక్కనపెట్టి, నేరుగా టాటా గ్రూప్ పెద్దలతో చర్చలు జరపడం ఆయన ప్రాధాన్యత తగ్గిందనే సంకేతాలిచ్చింది. ఎయిర్‌ఇండియా పగ్గాలను చేపట్టేందుకు అమెరికా, యూకేలకు చెందిన ప్రముఖ విమానయాన సంస్థల చీఫ్ ఎగ్జిక్యూటివ్‌లతో టాటా గ్రూప్ ఛైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ ఇప్పటికే చర్చలు జరిపినట్లు వార్తలు వచ్చాయి. విల్సన్‌తో పాటు ఎయిర్‌ఇండియా ఎక్స్ ప్రెస్ మేనేజింగ్ డైరెక్టర్ అలోక్ సింగ్ కూడా ఇటీవల తన పదవి నుంచి తప్పుకోవడం సంస్థలో జరుగుతున్న అంతర్గత మార్పులను సూచిస్తోంది. టాటా గ్రూప్ ఎయిర్‌ఇండియాను ప్రపంచ స్థాయి విమానయాన సంస్థగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ క్రమంలో ఆశించిన ఫలితాలు రాకపోవడంతో, మేనేజ్‌మెంట్ స్థాయిలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టినట్లు కనిపిస్తోంది.

## నేటి ఐపీఎల్ మ్యాచ్






## అర్షదీప్ సింగ్ 'టాటూ'గర్ల్ లవ్ మిస్టరీ

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):

టీమిండియా యువ పేసర్ అర్షదీప్ సింగ్ ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారారు. ఇటీవల అర్షదీప్ సింగ్ తన స్నాప్‌చాట్ ఖాతాలో ఒక అమ్మాయి చేయి పట్టుకుని ఉన్న ఫోటోను షేర్ చేశారు. ఆ ఫోటోలో అమ్మాయి ముఖం కనిపించకపోయినప్పటికీ, ఆమె చేతిపై ఉన్న ఒక ప్రత్యేకమైన టాటూ నెటిజన్ల దృష్టిని ఆకర్షించింది. నెటిజన్ల పరిశోధన ప్రకారం, ఆ టాటూ పంజాబీ మోడల్ నటి సమ్రీన్ కౌర్ చేతిపై ఉన్న టాటూతో సరిపోలింది. దీనితో నెటిజన్లు వారిద్దరూ ప్రేమలో ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. 26 ఏళ్ల సమ్రీన్ కౌర్ పంజాబ్‌కు చెందినవారు. 2018 మిస్ ఇండియా ఫైనలిస్ట్ గా నిలిచారు. అనేక పంజాబీ మ్యూజిక్ వీడియోలు, ఓటీటీ చిత్రాల్లో నటించారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమెకు 4 మిలియన్లకు పైగా ఫాలోవర్లు ఉన్నారు. అర్షదీప్ ప్రస్తుతం ఐపీఎల్ 2026లో పంజాబ్ కింగ్స్ తరపున ఆడుతున్నారు. అదే సమయంలో సమ్రీన్ పంజాబ్ కింగ్స్ జెర్సీ ధరించి స్టేడియంలో ఉన్న ఫోటోలను షేర్ చేయడం ఈ వార్తలకు మరింత బలాన్ని ఇచ్చింది. ఈ వార్తలపై అటు అర్షదీప్ సింగ్ కానీ, ఇటు సమ్రీన్ కౌర్ కానీ ఇప్పటివరకు ఎటువంటి అధికారిక ప్రకటన చేయలేదు. అయితే, క్రికెట్ అభిమానులు మాత్రం ఈ 'పంజాబీ జోడీ'కి సోషల్ మీడియాలో శుభాకాంక్షలు తెలుపుతున్నారు.



## ధురంధర్ 2' అద్భుతం: కోహ్లి, అనుష్క

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):

భారతీయ సినీ చరిత్రలో భారీ వసూళ్లతో ప్రభంజనం సృష్టిస్తున్న 'ధురంధర్ 2' చిత్రానికి తాజాగా క్రికెట్ దిగ్గజం విరాట్ కోహ్లి, నటి అనుష్క శర్మల నుంచి ప్రశంసలు దక్కాయి. బాక్సాఫీస్ వద్ద రూ.1600 కోట్లు కొల్లగొట్టిన ఈ సినిమాపై వారు పెట్టిన పోస్ట్ లు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. సినిమా చూసిన అనంతరం విరాట్ కోహ్లి ఎంతో ఉద్వేగానికి లోనయ్యారు. ఈ చిత్రంపై ఆయన స్పందిస్తూ.. "కనురెప్ప వేయకుండా చూశాను" అని పేర్కొన్నారు. "భారతీయ సినిమా చరిత్రలో ఇలాంటి అనుభవాన్ని నేను ముందెన్నడూ పొందలేదు. 4 గంటల పాటు సాగే ప్రతి సన్నివేశం గుండెలకు హత్తుకునేలా ఉంది." ఈ చిత్రంతో రణ్‌వీర్ నటనలో కొత్త శిఖరాలను చేరుకున్నారని, ఆయన ప్రతిభను వర్ణించడానికి 'అద్భుతం' అనే పదం కూడా సరిపోదని కొనియాడారు. దర్శకుడు ఆదిత్య ధర్‌ను 'జీనియస్' అని సంబోధిస్తూ, ప్రతి సీన్‌లోనూ ఆయన కష్టం కనిపిస్తోందని ప్రశంసించారు. కోహ్లి సతీమణి అనుష్క శర్మ కూడా ఈ సినిమా కట్టిపడేసేలా ఉందంటూ సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు. చిత్ర బృందం పడ్డ కష్టానికి తగిన ప్రతిఫలం దక్కుతోందని ఆమె హర్షం వ్యక్తం చేశారు. కోహ్లి, అనుష్కల నుంచి ప్రశంసలు రావడంతో దర్శకుడు ఆదిత్య ధర్ ఆనందానికి అవధులు లేవు. ఆయన స్పందిస్తూ.."విరాట్.. నీ ప్రశంసలు నాకు ఎంతో విలువైనవి. గ్రౌండ్‌లో నువ్వు చేసే పోరాటమే మాకు స్ఫూర్తి. దేశం గర్వపడేలా సినిమాలు తీయడానికి ఎప్పుడూ ప్రయత్నిస్తూనే ఉంటాను. అనుష్క.. నీ నుంచి వచ్చిన ఈ స్పందన నా బాధ్యతను మరింత పెంచింది." అంటూ సంతోషం వ్యక్తం చేశారు.



## హెల్త్ కేర్, ఫార్మా రంగాల్లో భారీగా ఉద్యోగాలు!

### 2030 నాటికి 25 లక్షల కొత్త ఉద్యోగాలు!

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):

భారతీయ ఆరోగ్య సంరక్షణ, ఔషధ రంగాలు భారీ వృద్ధి దిశగా అడుగులు వేస్తున్నాయి. అడెక్కో ఇండియా నివేదిక ప్రకారం.. 2030 నాటికి ఈ రంగాల్లో భారీ మార్పులు, ఉద్యోగావకాశాలు రాబోతున్నాయని అంచనా వేసింది. 2030 నాటికి జీడీపీలో ఈ వాటా 5 శాతానికి చేరుకుంటుందని అంచనా. మారుతున్న సాంకేతికత దృష్ట్యా, ప్రస్తుతం పనిచేస్తున్న వారిలో 30 నుండి 35శాతం మందికి కొత్త నైపుణ్యాలు అవసరమవుతాయి. ప్రత్యేకించి టెక్నాలజీ, స్పెషలైజేషన్ ఉన్న వారికి కింది విభాగాల్లో అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ప్రత్యేకించి ఆసుపత్రులు, ఆయుష్, వృద్ధుల సంరక్షణ, ఫార్మా, లైఫ్ సైన్సెస్, డయాగ్నొస్టిక్స్, టెలిమెడిసిన్, క్లినికల్ పరిశోధన, పబ్లిక్ హెల్త్ సిస్టమ్స్, అధునాతన ఆర్ అండ్ డీ , రెగ్యులేటరీ ఉద్యోగాల్లో 30 శాతం వృద్ధి నమోదు కావచ్చు. హైదరాబాద్, బెంగళూరు, ముంబయి, చెన్నై, ఢిల్లీఎన్సీఆర్ వంటి మెట్రో నగరాలలో 60 శాతానికి పైగానే ఉన్నా.. ఆసుపత్రి నెట్వర్క్లు, తయారీ క్లస్టర్ల విస్తరణ కారణంగా పుణె, అహ్మదాబాద్, కోయంబత్తూర్ వంటి నగరాల్లోనూ నియామకాలు క్రమంగా పెరుగుతున్నాయి. టెలిమెడిసిన్, డిజిటల్ హెల్త్ సర్వీసెస్ రెండవ, మూడవ అంచె పట్టణాలకు విస్తరించడం వల్ల డిమాండ్ 25 శాతం పెరిగింది. క్లినికల్ రీసెర్చ్, ఫార్మా తయారీ కోసం ప్రపంచ దేశాలు భారత్ వైపు మొగ్గు చూపుతున్నాయి. జనరిక్స్, బయోలాజిక్స్ వైపు పరిశ్రమ మళ్లడం వల్ల నిపుణుల అవసరం పెరిగింది. స్పెషలైజేషన్ కలిగిన అభ్యర్థులకు రాబోయే ఐదేళ్లు సువర్ణావకాశంగా మారనున్నాయి.

# 'పెద్ది' వాయిదా రహస్యం!

**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

రామ్ చరణ్ హీరోగా బుచ్చి బాబు డైరెక్షన్లో వస్తున్న 'పెద్ది' సినిమా విడుదల గురించి ఇండస్ట్రీ వర్గాల్లో ఒక ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. ముందుగా అనుకున్నట్లుగా ఈ చిత్రం ఏప్రిల్ 30న థియేటర్లలోకి రావడం లేదని అధికారికంగా ఇంకా అనౌన్స్ చేయలేదు కానీ ఈ వాయిదా వెనుక కేవలం డేట్ మార్పు మాత్రమే కాదు, పెద్ద ఎత్తున ఓటీటీ బేరసారాలు కూడా ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే ఓ సారి వాయిదా వేసిన నిర్మాతలు మరోమారు సినిమాను వాయిదా వేయాలని ఒక నిర్ణయానికి వచ్చేశారు. ప్రస్తుతం వారి పూర్తి ఫోకస్ ప్రముఖ ఓటీటీ సంస్థతో జరుగుతున్న చర్చల పైన ఉంది. ఏప్రిల్ 30 దాటిన తర్వాత, మే నెలలో ఏ తేదీన సినిమాను విడుదల చేస్తే బాగుంటుందనే విషయంపై ఓటీటీ పార్ట్నర్ లతో సంప్రదింపులు జరుపుతున్నారు. స్ట్రీమింగ్ నిబంధనలు, థియేట్రికల్ రిలీజ్ మధ్య గ్యాప్ వంటి అంశాలే ఈ చర్చలకు ప్రధాన కారణం. షెడ్యూల్ ప్రకారం ఏప్రిల్ 30న సినిమా రాకపోవడం వల్ల, మునుపటి ఒప్పందం ప్రకారం ఓటీటీ సంస్థ కొంత మేర చెల్లింపుల్లో కోత విధించే అవకాశం ఉందని, దీనివల్ల నిర్మాతలకు ఆర్థికంగా కొంత నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది అనే చర్చ ఉంది. అయితే, ఈ కోత ఎంత మేర ఉంటుంది అనేది ప్రస్తుతానికి సదరు ఓటీటీ సంస్థకు, నిర్మాతలకు మాత్రమే తెలిసిన రహస్యం. అయితే, ఈ డీల్‌లో ఒక ఆసక్తికరమైన మెలిక కూడా ఉందంటున్నారు. అదేమంటే ఒకవేళ సినిమా లేటుగా విడుదలైనా, బాక్సాఫీస్ వద్ద అద్భుతమైన వసూళ్లు సాధించి, అనుకున్న టార్గెట్ నంబర్స్ ను దాటితే.. ఓటీటీ సంస్థ అదనంగా మరికొంత మొత్తాన్ని చెల్లించడానికి సిద్ధంగా ఉందట. అంటే, సినిమా కంటెంట్‌పై నమ్మకంతో నిర్మాతలు ఈ రిస్క్ తీసుకుంటున్నట్లు కనిపిస్తోంది.





# వసూళ్ల సునామీని సృష్టించిన టాప్5 సినిమాలివే..

**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

ఇండియన్ సినిమా స్థాయి ఇప్పుడు కేవలం దేశానికే పరిమితం కాలేదు. హాలీవుడ్ రేంజ్‌లో మన సినిమాలు ప్రపంచ వ్యాప్తంగా వసూళ్ల సునామీని సృష్టిస్తున్నాయి. తాజాగా అందుబాటులోకి వచ్చిన గణాంకాల ప్రకారం, వరల్డ్ వైడ్ బాక్సాఫీస్ వద్ద అత్యధిక వసూళ్లు రాబట్టిన టాప్5 భారతీయ సినిమాల జాబితా ఆసక్తికరంగా మారింది. ప్రభాస్ నుండి అల్లు అర్జున్ వరకు, రణవీర్ సింగ్ నుండి అమీర్ ఖాన్ వరకు మన హీరోలు గ్లోబల్ మార్కెట్‌లో తమ జెండా పాతారు.


**నెం.1 స్థానంలో 'దంగల్' :** అమీర్ ఖాన్ నటించిన 'దంగల్' ఇప్పటికీ తన నంబర్ వన్ స్థానాన్ని పదిలపరుచుకుంది. అనేక నివేదికల ప్రకారం, ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా ఏకంగా రూ. 2,070 కోట్ల అసాధారణ వసూళ్లను రాబట్టింది. ముఖ్యంగా చైనా మార్కెట్‌లో ఈ సినిమా సృష్టించిన ప్రభంజనం భారతీయ సినిమా దిశను మార్చివేసింది.

**బాహుబలి 2 - పుష్ప 2 జోరు:** ప్రపంచ వేదికపై తెలుగు సినిమా ఖ్యాతిని చాటిచెప్పిన చిత్రాలు ఈ జాబితాలో ప్రముఖంగా ఉన్నాయి. దర్శకధీరుడు రాజమౌళి రూపొందించిన 'బాహుబలి 2: ది కన్‌క్లూజన్' రూ.1,788 కోట్లతో రెండో స్థానంలో నిలిచి ఇండియన్ సినిమా గర్వించేలా చేసింది. అల్లు అర్జున్ నటించిన 'పుష్ప 2: ది రూల్' సరికొత్త రికార్డులను సృష్టిస్తూ రూ.1,742 కోట్లతో మూడో స్థానాన్ని కైవసం చేసుకుంది. మాస్ ఎంటర్‌టైనర్‌గా వచ్చి గ్లోబల్ బాక్సాఫీస్‌ను షేక్ చేయడం విశేషం.

**సంచలనం సృష్టిస్తున్న 'దురందర్' సిరీస్ :** రణవీర్ సింగ్ నటించిన 'దురందర్' ఫ్రాంచైజీ కూడా అగ్రస్థానాల్లో నిలిచింది. రీసెంట్‌గా విడుదలైన 'దురందర్ 2 ప్రస్తుతం రూ.1,606 కోట్లతో దూసుకుపోతోంది. ఇంకా వసూళ్లు కొనసాగుతుండటంతో ఈ సినిమా తదుపరి స్థానాలకు ఎగబాకే అవకాశం ఉంది. మొదటి భాగం 'దురందర్ 1' రూ.1,307 కోట్ల వసూళ్లతో ఐదో స్థానంలో నిలిచింది.

**బాక్సాఫీస్ రిపోర్ట్ (వరల్డ్ వైడ్ గ్రాస్):** దంగల్ రూ.2,070 కోట్లు, బాహుబలి 2 రూ.1,788 కోట్లు,పుష్ప 2 రూ.1,742 కోట్లు, దురందర్ 2 రూ.1,606 కోట్లు (ఇంకా కొనసాగుతోంది), దురందర్ 1రూ.1,307 కోట్లు, ఈ వసూళ్లు చూస్తుంటే భారతీయ సినిమాలు రాబోయే రోజుల్లో రూ. 3000 కోట్ల మార్కును కూడా సునాయాసంగా దాటుతాయని ట్రేడ్ విశ్లేషకులు భావిస్తున్నారు.

# అల్లరి నరేష్ హీరోగా 'కనక దుర్గ' ప్రారంభం




**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

తమిళ సినీ ఇండస్ట్రీలో విజయవంతమైన ప్రముఖ కంటెంట్ స్టూడియో అప్లాజ్ ఎంటర్‌టైన్‌మెంట్ ఇప్పుడు టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చింది. అందులో భాగంగా టెంపుల్ టౌన్ పిక్చర్స్ తో కలిసి చేయబోతున్న సినిమా 'కనక దుర్గ'ను పూజా కార్యక్రమాలతో ప్రారంభించారు. వెర్సటైల్ స్టార్ అల్లరి నరేష్ హీరోగా నటిస్తోన్న ఈ సినిమాలో కాజల్ చౌదరి హీరోయిన్. ఈ సినిమాలో నటుడు సుబ్బరాజు కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ భక్తి ప్రధాన కథా చిత్రానికి బి.వి.ఎస్. రవి కథ అందిస్తుండగా.. ప్రదీప్ మద్దాలి దర్శకత్వం వహిస్తున్నారు. సమీర్ నాయర్, దీపక్ సెహగల్, అజిత్ ఠాకూర్, బి.వి.ఎస్. రవి నిర్మాతలు. భారతీయ దేవతల ఆధారంగా ఒక దివ్యమైన ప్రపంచాన్ని ఆవిష్కరిస్తూ ఈ సినిమా భక్తి, యాక్షన్, భావోద్వేగాలు, సంగీతం ఇలా అన్ని అంశాలతో ప్రేక్షకులకు ఓ అద్భుతమైన సినిమాటిక్ ఎక్స్ పీరియెన్స్ ను అందించనుంది. అప్లాజ్ ఎంటర్‌టైన్‌మెంట్ సమర్పణలో టెంపుల్ టౌన్ పిక్చర్స్ నిర్మాణంలో రూపొందుతోన్న ఈ సినిమా ఈ రెండు సంస్థలకు ఎంతో ప్రత్యేకమైనది. ఘనంగా జరిగిన కార్యక్రమంలో సురేఖ కొణిదెలతో పాటుగా ప్రముఖ నిర్మాతలు అల్లు అరవింద్, శ్యామ్ ప్రసాద్ రెడ్డి, హరీష్ శంకర్, మిక్కిలినేని సుధాకర్, కోన వెంకట్, ప్రశాంత్ వర్మ, మధుర శ్రీధర్, స్వప్నాదత్, సుప్రియ, విద్యా కొప్పినీడు, పద్మ కస్తూరి రంగన్, అనురాధ గూడూరు, దివ్య విజయ్, హన్షిత రెడ్డి, జాన్వీ నారంగ్, స్రవంతి చొక్కారపు, వైఘా రెడ్డి, విరుప తదితరులు అతిథులుగా విచ్చేశారు. సినిమా భావాన్ని ప్రతిబింబిస్తూ పూజా కార్యక్రమం చివర్లో కనకదుర్గ అమ్మవారి దివ్య స్త్రీ శక్తిని ప్రత్యేకంగా స్మరించుకున్నారు. హాజరైన మహిళలు కలిసి అమ్మవారి శక్తి, కరుణ, మహిమలను గౌరవించారు. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత అల్లు అరవింద్ క్లాప్ కొట్టగా, సురేఖ కొణిదెల కెమెరా స్విచ్ ఆన్ చేశారు. స్వప్న దత్ గౌరవ దర్శకత్వం వహించారు. శ్యామ్ ప్రసాద్ రెడ్డి స్క్రిప్ట్ ను అందించారు.

# పాన్ ఇండియా భాషల్లో 'అహోం' ప్రారంభం

**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**


వివేక్ మిశ్రా, శృతిక జంటగా నటిస్తున్న సినిమా 'అహోం'. ఈ చిత్రాన్ని ఈగల్ ఐ స్టూడియో ఇంటర్నేషనల్ బ్యానర్ పై దశరథ్ నిర్మిస్తున్నారు. ప్రసాద్ రాజు దర్శకత్వం వహిస్తున్నారు. పాన్ ఇండియా భాషల్లో తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళంలో సినిమా తెరకెక్కనుంది. నిర్మాత కేఎస్ రామారావు, డైరెక్టర్ వి.వి.వినాయక్ ముఖ్య అతిథులుగా ఈ చిత్ర ప్రారంభోత్సవం మంగళవారం హైదరాబాద్ లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలోనిర్మాత కేఎస్ రామారావు మాట్లాడుతూ డైరెక్టర్ ప్రసాద్ రాజు మంచి అనుభవం ఉన్న వ్యక్తి. ఆయన దర్శకత్వంలో ఈ సినిమా పలు భాషల్లో రూపొందడం సంతోషంగా ఉంది. ఎందుకంటే ఈ రోజు సినిమా ఒక్క భాషలో చేస్తే వర్కవుట్ కావడం లేదు. హిందీతో పాటు దక్షిణాది అన్ని ప్రధాన భాషల్లో 'అహోం' సినిమాను రూపొందిస్తున్నారు. బెంగాలీ, మరాఠీ వంటి భాషలతో పాటు ఈ చిత్రానికి ఇంగ్లీష్ లోనూ డబ్ చేయాలని సూచిస్తున్నా. నిర్మాత దశరథ్ కి కంగ్రాట్స్. కొత్త నిర్మాతలు బాగుంటేనే మరిన్ని చిత్రాలు తెరకెక్కి ఇండస్ట్రీ మీద ఆధారపడి ఉన్న వారికి ఉపాధి కల్పిస్తాయి. 'అహోం' సినిమా మంచి విజయం సాధించాలని కోరుతున్నా అన్నారు. హీరోయిన్ శృతిక మాట్లాడుతూ 'అహోం'లో హీరోయిన్ గా నటించే అవకాశం రావడం ఆనందంగా ఉంది అన్నారు.



# ఐకాన్ స్టార్ ప్రీలుక్ పోస్టర్..

**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, స్టార్ డైరెక్టర్ అట్లీ కాంబోలో సన్ పిక్చర్స్ అంతర్జాతీయ స్థాయిలో సినిమాని నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. ఈ ప్రాజెక్ట్ ఇప్పటికే సోషల్ మీడియాలో ఓ ట్రెండ్ క్రియేట్ చేసింది. ఇక ఈ ప్రాజెక్ట్ కి సంబంధించిన అప్డేట్ అల్లు అర్జున్ బర్త్ డే (ఏప్రిల్ 8) సందర్భంగా అందరినీ ఆశ్చర్యపర్చబోతోంది. ఈ క్రమంలోనే తాజాగా ఈ ప్రాజెక్ట్ కి సంబంధించిన ప్రీ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఈ ఒక్క పోస్టర్‌తోనే మేకర్స్ ప్రేక్షకులు, సినీ లవర్స్ లో ఎన్నో అనుమానాల్ని, ఉత్సుకతను రేకెత్తించారు. ఆ హ్యాండ్ ఎవరిది? ఆ ఆకారం ఏంటి? అది ఎందుకు అలా మారింది? కథ ఎలా ఉండబోతోంది? అని ఇలా అందరిలో రకరకాల ప్రశ్నల్ని లేవనెత్తింది. ఈ ఒక్క ప్రీలుక్ పోస్టర్ ఇప్పుడు సోషల్ మీడియాని షేక్ చేసేస్తోంది. అసలు సిసలు అప్డేట్ రాబోతోందని మేకర్లు ప్రకటించారు. టైటిల్‌తో పాటుగా హీరో ఫస్ట్ లుక్ పోస్టర్‌ని కూడా రివీల్ చేయబోతోన్నారు. అంతర్జాతీయ స్థాయిలో ఈ మూవీని ప్లాన్ చేసిన సంగతి తెలిసిందే. ఇక అల్లు అర్జున్ పుట్టిన రోజు సందర్భంగా సినిమాకు సంబంధించిన టైటిల్, పాత్రకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌తో అభిమానుల్ని అలరించనున్నారు. సరికొత్త సినిమాటిక్ వరల్డ్ లోకి తీసుకు వెళ్లేలా ఈ చిత్రం ఉండబోతోందని టీం చెబుతోంది.



# 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ'ని ఎంజాయ్ చేస్తారు

**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

వరుస బ్లాక్‌బస్టర్ విజయాలతో అలరిస్తున్న యంగ్ సెన్సేషన్ ప్రదీప్ రంగనాథన్ హీరోగా, విఘ్నేష్ శివన్ దర్శకత్వంలో రూపొందిన క్రేజీ లవ్ స్టోరీ 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ'. ఈ చిత్రాన్ని నయనతార నిర్మించగా, కృతి శెట్టి హీరోయిన్‌గా నటించారు. ఈ చిత్రంలో ఎస్.జె. సూర్య, యోగి బాబు కీలక పాత్రలు పోషించారు. ఇప్పటికే విడుదలైన తెలుగు టీజర్, ట్రైలర్ కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. శ్రీ పద్మిని సినిమాస్ ద్వారా ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో ఏప్రిల్ 10న ఈ చిత్రం గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ సందర్భంగా ప్రొడ్యూసర్ శివప్రసాద్ మీడియాతో మాట్లాడుతూ సినిమా విశేషాలు పంచుకున్నారు.




**ప్రొడ్యూసర్‌గా మీ జర్నీ గురించి?**
మొదట శ్రీరామ్‌తో మాతృ సినిమా నిర్మించాం. తర్వాత రారాజా ప్రొడ్యూస్ చేశాం. సుహాసిని మణిరత్నంతో మహతి అనే సినిమా చేస్తున్నాం. ఆ సినిమా షూటింగ్‌లో ఇంకా బ్యాలెన్స్ ఉంది. విజయ్ సేతుపతి గారి ఏస్ సినిమాను మేము డిస్ట్రిబ్యూట్ చేశాం. మరాఠీలో ఒక సినిమా తీశాం, అది రిలీజ్‌కు సిద్ధంగా ఉంది. ఆ సినిమాకు డైరెక్టర్, ప్రొడ్యూసర్ నేనే. ఇప్పుడు 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' సినిమాను రిలీజ్ చేస్తున్నాం. గీతాంజలి, మిథున్ చక్రవర్తి గారి డిస్కో డాన్సర్ రీరిలీజ్‌కు సిద్ధంగా ఉన్నాయి.

**'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' సినిమా గురించి?**
గత సంవత్సరం ఈ సినిమాకు అగ్రిమెంట్ చేసుకున్నాము. ఈ సినిమా కోసం చాలా మంది ప్రయత్నించారు. కానీ మేమే ముందుగా కమిట్ అయినందున, వాళ్లు మాకు ఇచ్చారు. సినిమా చాలా అద్భుతంగా వచ్చింది. కచ్చితంగా మంచి సక్సెస్ అవుతుందని నమ్మకం ఉంది. దాదాపు 500 స్క్రీన్స్‌లో రిలీజ్ కానుంది. డిస్ట్రిబ్యూషన్ పరంగా మేము సేఫ్‌గా ఉన్నాం. ప్రస్తుతం ఉన్న పరిస్థితులు, ఫ్యూచర్ టెక్నాలజీ ఆధారంగా చేసుకుని డిజైన్ చేసిన స్టోరీ ఇది. టెక్నాలజీ హ్యూమన్ రిలేషన్స్, ఎమోషన్స్ పై ప్రభావం చూపితే ఎలా ఉంటుందనే విషయం ఈ సినిమాలో ప్రధానంగా ఉంటుంది. టెక్నాలజీ కారణంగా మనుషుల మధ్య సంబంధాలు హార్ట్ ఫుల్‌గా కాకుండా ఆర్టిఫిషియల్‌గా మారిపోయే పరిస్థితి కనిపిస్తోంది.

**కొత్తగా మీరు చేయబోయే సినిమాలు?**
మా తమ్ముడు అజయ్ హీరోగా రంగూన్ రాజా సినిమా చేశాం. అది జూన్ లేదా జూలైలో రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నాం. అలాగే మహతి సినిమా కూడా త్వరలో రెడీ అవుతుంది.

**ఐపీఎల్ ఎఫెక్ట్ సినిమాలపై ఉంటుందని అనుకుంటున్నారా?**
సినిమా బాగుంటే, చూడాలనుకునే ఆడియన్స్ తప్పకుండా చూస్తారు. సినిమా మంచి కంటెంట్‌తో ఉంటే ఐపీఎల్ పెద్దగా ప్రభావం చూపదని నేను భావిస్తున్నాను.

**విజయ్ సేతుపతికి కథ చెప్పే విషయంపై?**
విజయ్ సేతుపతి గారు ప్రస్తుతం చాలా బిజీ షెడ్యూల్‌లో ఉన్నారు. మేము ఇంకా పరిశ్రమలో స్థిరపడిన తర్వాత కథ చెప్తే బాగుంటుందని వెయిట్ చేస్తున్నాం.

**మీకు ఎలాంటి కథలు ఇష్టం?**
నాకు లవ్ స్టోరీస్ అంటే ఇష్టం. ప్రస్తుత సమస్యలను అందరికీ కనెక్ట్ అయ్యేలా చెప్పే కథలు ఇష్టం. లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ ఒక ఫుల్‌లెంగ్త్ ఎంటర్టైనర్. ఫ్యూచరిస్టిక్ జానర్ ఆడియన్స్ కు కొత్త అనుభూతి ఇస్తుంది.

-ఎం.డి అబ్దుల్

# క్వీన్ సీక్వెల్!

**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

బాలీవుడ్ ఫీమేల్ ఓరియెంట్ చిత్రాలకు ఓ బ్రాండ్ క్రియేట్ చేసిన బ్యూటీ కంగనా రనౌత్. 2014లో వచ్చిన 'క్వీ'న్‌లో రాణి పాత్ర ఎంతో మంది అమ్మాయిలకు స్ఫూర్తి కూడా. ఆమె కెరీర్‌కే ఓ మైల్ స్టోన్ ఫిల్మ్. కానీ ఇప్పుడు పూర్తిగా ఫైర్ బ్రాండ్ సినీ కెరీర్ గాడి తప్పేసింది. మణికర్ణిక తర్వాత అమ్మడి ఖాతాలో హిట్టే లేదు. కొన్ని పొలిటికల్ బయోపిక్స్ తీసి.. ఓ సెపరేట్ ఆడియన్స్ కు దూరమైంది కంగనా. పొలిటికల్ జర్నీని ఎంజాయ్ చేస్తోన్న కంగనాకు సినీ కెరీర్ డల్‌గా మారడంతో మళ్లీ తన ఫ్యాన్ ఫాలోయింగ్ వెనక్కు తెచ్చుకునేందుకు స్కెచ్ వేస్తోంది. తనకు స్టార్‌డమ్‌తో పాటు జాతీయ అవార్డ్ తెచ్చిపెట్టిన క్వీన్ సీక్వెల్ ప్లాన్ చేస్తోంది. అయితే ఈ సారి పూర్తి కొత్త కథతో రాబోతుందట. క్వీన్ మూవీని డీల్ చేసిన వికాస్ బహ్ల్ ఈ మూవీని హ్యాండిల్ చేస్తున్నాడు. క్వీన్2కి కంప్లీట్ న్యూ స్టోరీతో తెరకెక్కబోతుందట. క్వీన్‌లో రాణి మ్యారేజ్ క్యాన్సిల్ కావడంతో హనీమూన్ కోసం ఫారెన్ ట్రిప్‌కు వెళితే.. క్వీన్2లో మన దేశంలోని ప్రధాన నగరాలను చుట్టేయబోతున్నట్లు తెలుస్తోంది. చూడబోతే ఇదొక జర్నీ బేస్డ్ ఫిల్మ్ లా తీయబోతున్నారట. ఏప్రిల్ ఎండింగ్ నుండి మూవీ పట్టాలెక్కబోతోంది. మరి ఈ డైనమిక్ లేడీ.. క్వీన్ సీక్వెల్‌తో మిస్సైన తన ఆడియన్స్ ను మళ్లీ చేరువయ్యేలా చేసుకుంటుందేమో చూడాలి.



# నెట్‌ఫ్లిక్స్‌లో జోరు..

**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

'సాంప్రదాయని సుప్పిని సుద్దపూసిని' సినిమా నెట్‌ఫ్లిక్స్ లో టాప్ ఫైవ్ ట్రెండింగ్ లిస్టులో స్థానం సంపాదించి తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. శివాజీ, లయ, రోహన్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ క్రైమ్ కామెడీ చిత్రం గ్రామీణ నేపథ్యంలో ఒక సర్పంచ్ ఎదుర్కొనే రహస్యాలు, సవాళ్లను హాస్య రూపంలో చూపిస్తూ ప్రేక్షకులకు మంచి వినోదాన్ని అందిస్తుంది. నియమబద్ధమైన గ్రామాధికారి ఒక కుట్రలో చిక్కుకుని తన కుటుంబంతో కలిసి ఒక అనిశ్చిత ప్రయాణం చేయడం ద్వారా స్థానిక పోటీలు, రహస్యాలు బయటపడతాయి. ఈ చిత్రం థ్రిల్లర్.. హాస్య అంశాలను సమతుల్యంగా మిళితం చేసి, ఆకర్షణీయమైన కథనంతో ఆద్యంతం ఆసక్తిని కొనసాగిస్తుంది. మార్చి 6న థియేటర్లలో విడుదలై మిశ్రమ స్పందనలు అందుకున్న ఈ సినిమా, ఏప్రిల్ 3 నుంచి నెట్‌ఫ్లిక్స్ లో స్ట్రీమింగ్ కావడంతో ప్రపంచవ్యాప్తంగా దృష్టి సాధించింది. తెలుగులో మాత్రమే కాకుండా ఇతర భాషల్లోనూ అందుబాటులో ఉండటం విశేషం. ఈ చిత్రం గ్రామీణ జీవితాలను హాస్యాత్మకంగా, యథార్థపూర్వకంగా చూపించి, తెలుగు సినిమా ప్రమాణాలను మరో స్థాయికి తీసుకువెళ్ళింది.



Printed and Published By **SHAIK MASTAN** on behalf of **AARAA DIGITAL NEWS NETWORKS**, Printed at YADU GRAPHICS, Ground Floor 3-2-798, STO Bhavan, Chappal Bazar, Kachiguda, Hyderabad, Telangana-500 027
Published at Plot No. 72, Kamalapuri Colony, Phase III, Road No.2, Banjarahills, Hyderabad, Telangana - 500 073. Editor: **SHAIK MASTAN**, Phone No. 040 - 24099999, **PRGI REG. No. : TGTEL/25/A0540**